హైదరాబాద్
సంపుటి 6
సంచిక: 205
14, ఆదివారం
జనవరి, 2018

ఆదివారం మన తెలంగాణ

www.manatelangana.news
అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Mana Telangana

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad | పేజీలు: 12 + 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

రిజిస్ట్రేషన్ స్టాంప్స్ కమిషనర్, ఐజిగా వాకాటి కరుణ 2

సంక్రాంతి సంబురాల అంబరం



సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ప్రారంభమైన గాలిపటాల వేడుక

ట్రంప్ కంపు వ్యాఖ్యపై భగ్గుమన్న ఆఫ్రికా

జాత్యహంకారి క్షమాపణ చెప్పాలని ఆఫ్రికా దేశాల సంఘం డిమాండ్



నైరోబి: ఆఫ్రికా దేశాలను 'సిట్ హోల్ (గుదము)' దేశాలుగా పేర్కొంటూ అసభ్య పద ప్రయోగం జరిపిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌పై మొత్తం ఆఫ్రికన్లు ఆగ్రహంతో విరుచుకుపడ్డారు. వారిలో చాలా మంది ట్రంప్ వ్యాఖ్యలను అజ్ఞానంతో కూడినదిగా, జాత్యహంకార పద ప్రయోగంగా ఈసడించారు. 55 దేశాల ఆఫ్రికన్ యూనియన్ శుక్రవారం నాడు ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ ట్రంప్‌ను క్షమాపణను కోరింది. ఇది జాత్యహంకార, అన్యదేశ ద్వేషం, అసహ్యకరమైన వ్యాఖ్య అని ఒక ప్రకటనలో విమర్శించాయి. ఆ ఖండానికి చెందిన దేశాల ఐక్యరాజ్య సమితి రాయబారులందరూ ఆ వ్యాఖ్యను ట్రంప్ వెనక్కి తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా తమకు క్షమాపణలు చెప్పాలని కూడా డిమాండ్ చేశారు. ఐక్యరాజ్య సమితి రాయబారుల ఆఫ్రికన్ గ్రూపు అది ఏహ్యత కలిగించే తీవ్ర వ్యాఖ్య అని ఖండించారు. ట్రంప్ వ్యాఖ్యలను పరిశీలించడానికి ఆ రాయబారులందరూ అత్యవసరరంగా సమావేశమై తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. మీడియా ట్రంప్ వ్యాఖ్యకు విపరీతంగా ప్రచారం కల్పించింది. ట్రంప్ వ్యాఖ్యకు స్పష్టంగా జాతి ద్వేషంతో కూడినదని ఎయు తరువాయి 6లో

నకిలీ గల్ఫ్ ఏజెంట్లపై పిడి చట్టం

మంత్రులు కెటిఆర్, నాయిని హెచ్చరిక

మన తెలంగాణ / హైదరాబాద్ : బతుకు దెరువు కోసం గల్ఫ్ తదితర విదేశాలకు వెళ్తున్న కార్మికులు, నిరుద్యోగులను మోసం చేస్తున్న నకిలీ ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం నకిలీ ఏజెంట్ల వివరాలను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఎన్ఆర్ఐ శాఖమంత్రి కెటిఆర్, కార్మికశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డిలు అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని సి బ్లాక్ కాన్ఫరెన్స్ హాలులో శనివారం డిజిపి మహేందర్‌రెడ్డి, హోం శాఖ ముఖ్యకార్యదర్శి రాజీవ్ త్రివేది, టాంకాం చైర్మన్ బోయపల్లి రంగారెడ్డి, ఎన్ఆర్ఐ, పోలీసు శాఖల అధికారులతో తరువాయి 6లో

భూనవశకం

మార్చి 11న కొత్త పాస్‌పుస్తకాల పంపిణీ

- అన్ని గ్రామాల్లో ఒకే రోజున రైతులకు అందజేత : సమీక్షలో సిఎం కెసిఆర్ వెల్లడి

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఒకే రోజు కొత్త పాస్ పుస్తకాలను మార్చి 11న రైతులకు పంపిణీ చేయనున్నట్లు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రకటించారు. కొత్త పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్రపతి లేదా ప్రధానమంత్రిని ఆహ్వానించనున్నట్లు సిఎం వెల్లడించారు. సమగ్ర భూ రికార్డుల ప్రక్షాళన ద్వారా ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్న వివరాలతో కూడిన పాస్ పుస్తకాలను ముద్రిస్తున్నామని, ఇవే వివరాలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నామని సిఎం వివరించారు. కోర్ బ్యాంకింగ్ తరహాలో ల్యాండ్ వెబ్‌సైట్ నిర్వహిస్తామని, దీనికి 'ధరణి' అనే పేరును ఖరారు చేసినట్లు సిఎం వెల్లడించారు. అవినీతికి ఏ మాత్రం ఆస్కారం లేని పారదర్శకమైన తరువాయి 6లో



ఎంపిటిసి ఉపఎన్నికల్లో టిఆర్ఎస్ స్వీప్

16 స్థానాల్లో టిఆర్ఎస్ 10, కాంగ్రెస్, బిజెపిలకు రెండేసి, రెండు చోట్ల ఇండిపెండెంట్లు

మన తెలంగాణ/ హైదరాబాద్: రాష్ట్రంలో 16 ఎంపిటిసి స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో టిఆర్ఎస్ విజయదుందుభి మోగించింది. వాటిలో టిఆర్ఎస్–10, కాంగ్రెస్–2, బిజెపి–2, ఇండిపెండెంట్లు–2 చోట్ల గెలుపొందాయి. గత ఎన్నికల్లో ఇవే స్థానాల్లో టిఆర్ఎస్–6, కాంగ్రెస్–6, బిజెపి–2, టిడిపి–2 చోట్ల విజయం సాధించాయి. వివిధ కారణాలతో ఖాళీ అయిన ఈ స్థానాలకు గురువారం ఓటింగ్, శనివారం కౌంటింగ్ జరిగింది. ఈ ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి గట్టి పట్టు ఉన్న నల్లగొండ జిల్లాల్లో రెండు స్థానాలను టిఆర్ఎస్‌కు కోల్పోయింది. ప్రతిపక్ష నాయకులు తరువాయి 6లో

పెద్ద పేచీ కాదు

ప్రజల ముందు పెట్టాల్సినంత సీన్ లేదు

ప్రభుత్వానికి లేఖ రాస్తాం

- నలుగురు జడ్జీల తిరుగుబావుటాపై సుప్రీం బార్ కౌన్సిల్



న్యూఢిల్లీ: ప్రభుత్వం సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరుకుంటున్నామని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తెలిపింది. శనివారం బార్‌కౌన్సిల్ సమావేశమైంది. జడ్జీలతో చర్చలు జరిపి సమస్య పరిష్కరించేందుకు ఏడుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. మెమొరాండం ఆఫ్ ప్రొసీజర్స్ (ఎంఓపి)ని త్వరగా ఖరారు చేయాలని ప్రభుత్వాన్ని కోరతామని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా తెలిపారు. తాము సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో భేటీ అయ్యామని చెప్పారు. త్వరలోనే సుప్రీంకోర్టులో ఎంఒపిని పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. తాము కూడా ప్రభుత్వానికి ఈ తరువాయి 6లో



భారజల కర్మాగారంలో విషవాయువు లీక్

- ఉద్యోగి మృతి

మన తెలంగాణ/ అశ్వాపురం: ఖమ్మం జిల్లా అశ్వాపురం మండలం మిట్టగూడెం వద్ద గల భారజల కర్మాగారంలో శనివారం విషవాయువులు ప్రసరించి ఉద్యోగి వెంకటరమణ మృతిచెందారు. మండలంలోని మొండికుంట గ్రామానికి తరువాయి 6లో

కాంగ్రెస్ డీలా

నిరంతర విద్యుత్ సక్సెస్ కావడంతో దానికి ఓటమి భయం

జైలుకెళ్లిన వారా నీతులు చెప్పేది?

కరెంట్‌పై ఆధారాలుంటే కోర్టుకెళ్లాలి

ముందస్తు ఎన్నికలకు వెళ్లే ధైర్యం కేంద్రానికి ఉందా?

మేము ఎప్పుడైనా సిద్ధమే : మంత్రి కెటిఆర్



మన తెలంగాణ/ హైదరాబాద్: కరెంటు కోనుగోలు ఆరోపణలపై ఆధారాలుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని పరిశ్రమల శాఖమంత్రి కె.తారకరామారావు అన్నారు. జైల్లో చిప్పకూడు తిన్నవారు సైతం అవినీతి గురించి మాట్లాడితే తాము స్పందించాల్సిన అవసరం లేదని రేవంత్‌రెడ్డినుద్దేశించి వ్యాఖ్యానించారు. కరెంటు సరఫరాపై చర్చించేందుకు శాసనసభ ఉన్నదని, అక్కడ కాంగ్రెస్ నాయకులు చర్చించకుండా పారిపోతారన్నారు. పంచాయతీరాజ్ తరువాయి 6లో

కుంచెపోటు



ఆ అంకుల్ అంతేరా..శాపాయం కాకుండా వేరే కలర్ ఉంటే కట్ చేసేస్తాడు!



క్షయ రోగులకు నెలకు రూ.500

- నయం అయ్యేంత వరకు ఇవ్వాలని కేంద్రం సంకల్పం

న్యూఢిల్లీ: దేశంలో ఉన్న దాదాపు 25 లక్షల టిబి రోగులకు కేంద్ర ప్రభుత్వం తీపి వార్తను అందించింది. వారికి ప్రతి నెల రూ.500 ఆర్థిక సాయం అందించేందుకు సన్నాహాలు చేస్తోంది. రోగం నయమయ్యేంత వరకు వారికి కావలసిన పోషకాహారం అందించేందుకు, ప్రయాణ తరువాయి 6లో

తెలంగాణ తొలి వీణ చెన్నా

మర్రి చెన్నారెడ్డి శతజయంతి ప్రారంభ వేడుకల్లో పుదుచ్చేరి సిఎం నారాయణ స్వామి ప్రశంస

నెంబర్ వన్ మొనగాడు: నాయిని



మన తెలంగాణ/ హైదరాబాద్/ ముషీరాబాద్ : తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష స్వరాష్ట్రం ఏర్పాటుకు 1969లోనే పునాది వేసిన మహనీయుడు మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి అని పాండిచ్చేరి సిఎం నారాయణ స్వామి అన్నారు. శనివారం మర్రి చెన్నారెడ్డి 99వ జయంతిని పురస్కరించుకొని శత జయంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఇందిరాపార్కులో చెన్నారెడ్డి సమాధివద్ద నారాయణస్వామి, మాజీ గవర్నర్ రోశయ్య, శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి, హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎంపి రాజమోహన్‌రెడ్డి, మాజీ ఎంపి హనుమంతరావు, మాజీ మంత్రులు పొన్నాల లక్ష్మయ్య, గీతారెడ్డి, డికె.అరుణ, ఎపి శాసనమండలి చైర్మన్ చక్రపాణిలు ఘనంగా తరువాయి 6లో

పంచాయతీ చట్టం మార్పులపై మంత్రుల కమిటీ నివేదిక

- సిఎం కెసిఆర్‌కు సమర్పణ

మన తెలంగాణ / హైదరాబాద్ : పంట పెట్టుబడి మద్దతు పథకం అమలు, పంచాయితీ రాజ్ చట్టంలో తేవాల్సిన మార్పులకు సంబంధించి ఏర్పాటైన మంత్రివర్గ తరువాయి 6లో

ఫిబ్రవరి 3 లేదా 4న కోదండరామ్ రాజకీయ పార్టీ? 6

రాజ్‌భవన్, సచివాలయానికి సిఎం ఎన్ని సార్లు వెళ్లారు? : కిషన్‌రెడ్డి



మనతెలంగాణ/హైదరాబాద్: ముఖ్యమంత్రి కెసిఆర్ రాజ్‌భవన్, సచివాలయానికి ఎన్ని సార్లు వెళ్లారో తెలుసుకునేందుకు త్వరలోనే తాను సమాచార హక్కు చట్టం కింద పిటిషన్ దాఖలు చేయనున్నట్లు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడి వెల్లడించారు.తెలంగాణను వ్యతిరేకించిన శక్తులే ప్రస్తుతం రాష్ట్రంలో రాజ్యమేలు తున్నాయని టిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎకు ఇప్పుడు జ్ఞానోదయం కలిగిందన్నారు. టిఆర్‌ఎస్‌లో ఉన్న ఉద్యమకారులు, పోరాటం చేసిన వారు కెసిఆర్ నాయకత్వంపై పునరాలోచన చేసుకోవాలన్ని సూచించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ నేతలు డాక్టర్ ప్రకాష్ రెడ్డి, సుధాకర్‌శర్మ, కప్పర ప్రసాద్‌తో కలిసి కిషన్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ టిజెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ కోదండరామ్‌కు కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వని సిఎం కెసిఆర్, తెలంగాణ ఉద్యమ వ్యతిరేకులను ఏకంగా తమ ప్రభుత్వంలో చేర్చుకున్నారని విమర్శించారు. తెలంగాణను వ్యతిరేకించిన ఎంఐఎంకు టిఆర్‌ఎస్ దాసోహం అంటున్నారని, వారి చేతిలో టిఆర్‌ఎస్ కీలుబొమ్మగా మారిందన్నారు. సర్పంచ్‌ల నుంచి మొదలు ఎంఎల్‌ఎ, ఎంపిల పార్టీ ఫిరాయింపులపై కూడా చర్చించి ఒక కొత్త చట్టాన్ని ప్రవేశపెట్టాలని ఆయన తెలిపారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వం తన నాలుగు సంవత్సరాల కాలంలో గ్రామ పంచాయతీలకు ఒక్క రూపాయి ఇవ్వలేదని, పైగా కేంద్ర ప్రభుత్వం, 14వ ఆర్థిక సంఘం నిధులను కూడా దారిమళ్లించారని బిజెఎల్‌పి నేత జి.కిషన్ రెడ్డి ఆరోపించారు.

హెచ్‌ఎంలకే సెలవు మంజూరు అధికారం ఇవ్వాలి

మనతెలంగాణ/హైదరాబాద్: ఉపాధ్యాయుల సెలవు మంజూరు అధికారం ఎంఇఒలకు అప్పగించడం వెనుక ఉన్న ఆంతర్యం ఏంటో వివరించాలని ఎస్‌టియుటిఎస్ అధ్యక్షులు భుజంగరావు ఒక ప్రకటనలో కోరారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు పునరాలోచించి సెలవు మంజూరు అధికారం ప్రధానోపాధ్యాయులకే ఉండే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

అస్తవ్యస్తంగా సవరణ

- **ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతు**
- **జియో ట్యాగింగ్ చేసినా సరికాని వైనం**
- **సమాధానం చెప్పలేకపోతున్న బల్దియా**
- **ఆందోళనలో రాజకీయ పార్టీలు**



మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో : గ్రేటర్ హైదరాబాద్‌లో ఓటర్ల జాబితాలో పేర్ల గల్లంతు చర్చనీయాంశమైంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ దఫా ఓటర్ల జాబితా సవరణ చేపట్టారు. ట్యాబ్‌లకు జియో ట్యాగింగ్ చేసి, జాబితా సవరణ చేశామని మహానగర పాలక సంస్థ (జిహెచ్‌ఎంసి) అధికారులు గొప్పలు చెప్పుకుంటున్నారు. జాబితాలో ఓటర్ల గల్లంతుపై సమాధానం చెప్పలేకపోతున్నారు. లక్షల ఓట్లను తొలగించడంపై రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. రాబోయే సాధారణ ఎన్నికల కోసం ఉద్దేశపూర్వకంగానే ఓటర్లను తొలగిస్తున్నారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఓటర్ల తొలగింపుపై శుక్రవారం కాంగ్రెస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యేలు జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహించిన విషయం తెలిసిందే. గత బల్దియా ఎన్నికల ముందు ఓటర్ల జాబితా సవరణ సమయంలో పెద్ద ఎత్తున ఓట్లు తొలగించడం చర్చనీయ అంశమైంది. కొన్ని ప్రాంతాల్లో బాధితులు ముందుకు వచ్చారు. కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. దీంతో నగరంలో పర్యటించి, జరిగిన తప్పిదాన్ని సవరించాలని అదేశించారు. జరిగిన తప్పిదాలను జిహెచ్‌ఎంసి సైతం ఒప్పుకుని, నామినేషన్లు దాఖలు చేసేవరకు ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పొడిగించారు. ప్రస్తుతం ఓటర్ల జాబితా సవరణ విషయంలో అనేక అవకతవకలు జరిగాయని కాంగ్రెస్, బిజెపి, టిడిపిలు నేతలు రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. జిహెచ్‌ఎంసి పరిధిలో అన్ని నియోజకవర్గాలలో మొత్తం 17 లక్షల 23 వేల ఓట్లు తొలగించారు. సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ఓటర్లను నమోదు చేయించడం, కొత్త ఓటర్లను చేర్పించడం, ఇళ్లు ఖాళీ చేసిన వారిని జాబితా నుంచి తొలగించడం లాంటివి చేయాల్సి ఉంటుంది. అయితే ఇంటింటి సర్వే నిర్వహించకుండానే ఒక్క దగ్గర కుర్చొని జాబితా సవరణ చేయడం కారణంగానే ఓట్లు గల్లంతైనట్లు రాజకీయ పార్టీలు ఆరోపిస్తున్నాయి. వాస్తవానికి ఇంటింటికి వెళ్లి ట్యాబ్‌లతో ఫొటోలు తీయాల్సి ఉంటుంది.

ఓట్లను తొలగించాల్సి వస్తే ఇంటి పక్కవారి సంతకం తీసుకోవాల్సి ఉంటుంది. ఇంత పెద్ద సంఖ్యలో ఓట్లు గల్లంతు కావడంపై పలు అనుమానాలకు తవిస్తుంది. హైదరాబాద్ జిల్లా పరిధిలో జిహెచ్‌ఎంసి, రంగారెడ్డి, మేడ్చెల్, సంగారెడ్డిల పరిధిలో రెవెన్యూ శాఖలు ఓటర్ల జాబితా సవరణ బాధ్యతలు నిర్వహించాయి.

ఓటర్ల జాబితాకు కత్తెర : భారీగా ఓటర్ల జాబితాకు కత్తెర వేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోనే 38 శాతం మంది పేర్లు గల్లంతు అయ్యాయి. 566 మంది బూత్ స్థాయి అధికారులు, 56 మంద సూపర్‌వైజర్లు, 20 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్‌లు, 566 మంది ట్యాబ్ ఆపరేటర్‌లు సర్వే చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఒకే చిరునామాలో పదేళ్లుగా ఉంటున్న వారి పేర్లను సైతం తొలగించారు.కుత్బుల్లాపూర్‌లో 643460 మంది ఓటర్లు ఉండగా,247500 మందిని జాబితా నుంచి తొలగించారు. ఇతర నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాలో కూడా పేర్లు తొలగించారు. 23 నియోజకవర్గాల పరిధిలో 17.23 లక్ష ల మంది పేర్లు మాయమవడం చర్చనీయంశంగా మారిం ది. నగరంలో జనాభా పెరుగుతుండగా, ఓటర్ల సంఖ్య తగ్గడం విస్మయం కల్గిస్తోంది. మెజార్టీ నియోజకవర్గాల్లో 25 శాతానికి పైగా ఓటర్ల పేర్లు తొలగించడంపై రాజకీయ పార్టీలు గగ్గోలు పెడుతున్నాయి. ముందు 80.72 లక్షలకు పైగా ఓటర్లు ఉండగా, పరిశీలన అనంతరం 63.48 లక్షల మంది మాత్రమే మిగిలారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో గోషామహల్‌లో అత్యధికంగా 78940 మంది పేర్లు, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో 70992 ఓట్లు గల్లంతు అయ్యాయి.

బిఎస్‌ఎన్‌ఎల్ నుండి సంక్రాంతి హ్యాపీ ఆఫర్

మన తెలంగాణ/ హైదరాబాద్ : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని బిఎస్‌ఎన్‌ఎల్ తన ప్రిపేయిడ్ వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ఈ హ్యాపీ ఆఫర్ పేరిట 50 శాతం అదనపు డాటాతో పాటు 43 శాతం అదనపు టాక్‌టైమ్‌ను అందించనుంది. అలాగే రోజుకు వంద ఎస్‌ఎంఎస్‌లను కూడా ఈ స్కీమ్ ద్వారా వినియోగదారులు లబ్ది పొందవచ్చని బిఎస్‌ఎన్‌ఎల్ వెల్లడించింది. ప్రత్యేక డాటా ఆఫర్లు కూడా ఈ సంక్రాంతి సందర్భంగా అందిస్తున్నామని వినియోగదారులు ఈ నెల 15 తేదీ లోగా బిఎస్‌ఎన్‌ఎల్ ఆఫర్లను అందుకోవచ్చని వెల్లడించింది. మరిన్ని వివరాలకు టోల్‌ఫ్రీ 1503, లేదా 18001801503ను సంప్రదించవచ్చని తెలంగాణ టెలికం సర్కిల్ సిజిఎం వి. సుందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కామధేను నుండి పర్యావరణ హిత పేయింట్స్

మనతెలంగాణ /హైదరాబాద్ : పర్యావరణ స్నేహ పూర్వక పెయింట్స్‌ను భారత్‌లో ప్రవేశపెట్టేందుకు స్పెయిన్‌కు చెందిన ప్రముఖ పెయింట్స్ తయారీ సంస్థ గ్రాఫిన్ స్టోన్ భారత గృహ నిర్మాణ మెటీరియల్ కంపెనీ కామధేను లిమిటెడ్ చేతులు కలిపింది. ఈ ఒప్పందంలో భాగంగా తొలిసారిగా దేశీయ మార్కెట్లోకి అత్యం త నాణ్యమైన పర్యావరణహిత వొలాటైల్ ఆర్గానిక్ కాంపౌండ్ (విఒసి) ఫ్రీ పేయింట్‌ను తీసుకువచ్చింది. రెండు సంస్థల భాగస్వామ్యంపై కామధేను సంస్థ డైరెక్టర్ సౌరభ్ అగర్వాల్ మాట్లాడుతూ పెయింట్స్ తచారీలో గ్రఫిన్ స్టోన్‌కు అంతర్జాతీయ మార్కట్‌లో గట్టి పట్టుందన్నారు. ప్రస్తు తం భారత పేయింట్స్ మార్కెట్ రూ. 60 వేల కోట్లుగా ఉందని, వచ్చే 2019–20 నాటికి ఇది 71 వేల కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నామన్నారు.

పండుగ రద్దీ ఏర్పాట్లపై ద.మ. రైల్వే జిఎం తనిఖీ

మన తెలంగాణ / హైదరాబాద్ : సంక్రాంతి పండుగ రద్దీ నేపథ్యంలో రైలు ప్రయాణికులకు ఇబ్బందులు కల్గకుండా దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక ఏర్పాట్లను చేస్తోంది. ప్రయాణికులకు పూర్తి స్థాయిలో బెర్త్‌లు అందు బాటులో ఉండేందుకు అదనపు బోగీలు, పారిశుద్ద్యం తదితర అంశాలపై జిఎం వినోద్ కుమార్ యాదవ్ స్వయంగా పరిశీలించారు. శనివారం ఆయన సికింద్రాబాద్ నుండి కాచిగూడ రైల్వే స్టేషన్ వరకు ఒక రైలులో ప్రయాణించి ప్రయాణికులతో ఆయన మాట్లాడారు. రైళ్లలో బెర్త్‌లు అం దుబాటులో ఉంటున్నదీ లేనిదీ ప్రయాణికులను అడిగి తెలుసుకు న్నారు. కాచిగూడలోని టికెటింగ్ కేంద్రాలను కూడా ఆయన తనిఖీ చేశారు.

రైల్వేస్టేషన్లలో ర్యాంప్, వీల్‌చైర్ల సదుపాయం

మన తెలంగాణ/హైదరాబాద్: వికలాంగుల సౌకర్యార్థం రైల్వే స్టేషన్లలలో దక్షిణ మధ్య రైల్వే(ఎస్‌సిఆర్) ప్రత్యేక ఫోల్డింగ్ ర్యాంప్‌ను, వీల్‌ఛైర్ సదుపాయాలను ప్రవేశపెట్టింది. దీనిని ఈ నెల18న గుంటూరు– వికారాబాద్ పలనాడు ఎక్స్‌ప్రెస్ మొదటి రైలులో ఈ సదుపాయాలను ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఎస్‌సిఆర్ సిపిఆర్‌వో ఎం. ఉమాశంకర్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 38 కిలోల బరువుతో ఫోలింగ్ ర్యాంప్‌ను ఏర్పాటు చేయడంతో పాటు మరిన్ని భద్రత చర్యలను తీసుకున్నారు. వినియోగదారులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారని గుర్తించిన రైల్వే అధికారులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.



సంక్రాంతి సందర్భంగా ప్రగతి భవన్‌లో పూజలు

మనతెలంగాణ/హైదరాబాద్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం (ప్రగతి భవన్)లో శనివారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు దంపతులు పూజలు నిర్వహించారు.



రిజిస్ట్రేషన్, స్టాంప్స్ కమిషనర్, ఐజిగా వాకాటి కరుణ

మన తెలంగాణ/హైదరాబాద్ : ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ గా విధులు నిర్వర్తిస్తున్న వాకాటి కరుణకు రిజిస్ట్రేషన్, స్టాంప్స్ కమిషనర్, ఐజిగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు లను జారీ చేసింది.

భూకొనుగోళ్లలో దళారుల చేతివాటం

మన తెలంగాణ/హైదరాబాద్: దళితులకు మూడెకరాల భూమి కొనుగోలు వ్యవహారంలో దళారులు ప్రమేయం పథకం అమలునకు సమస్యగా మారింది. దళారులు ఇబ్బడి ముబ్బడిగా భూముల ధరలు పెంచుతుండటంతో ప్రభుత్వం భూమి కొనుగోలు చేసేందుకు వీలు పడటం లేదని తెలిసింది. సర్పంచులు, ఇతర ధనిక వర్గాలు కూడా ఈ పథకంలో తమ చేతివాటం చూపుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో పథకం వేగంగా ముందుకు కదలడం లేదు. నాలుగేళ్లలో రూ. 514 కోట్లు వెచ్చించి, కేవలం 12013 ఎకరాలు మాత్రమే కొనుగోలు చేసి 4621 మంది లబ్దిదారులకు పంపిణీ చేయడమే ఇందుకు ఉదాహరణ. తక్కువగా రూ. 3 నుంచి రూ. 7 లక్షలకు ఎకరం చొప్పున దొరికే భూమి వ్యవసాయ యోగ్యంగా లేకపోవడం భూమి కొనుగోలునకు మరో ఆటంకంగా మారింది. ఈ క్రమంలో ఎంఎల్‌ఎలు, స్థానిక ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుంటేనే దళిత భూ పంపిణీ వేగం పుంజుకుంటుదని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు కొత్త జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లు ఏర్పడటంతో భూముల ధరలు కూడా అమాంతం పెరిగాయి. ఇది కూడా పథకం అమలునకు ఇబ్బందికరంగా మారినట్లు ప్రభుత్వం భావిస్తోంది. తక్కువ ధరకు టోకులో భూమిని కొనుగోలు చేసి, ఎక్కువ ధరకు ప్రభుత్వానికి అమ్ముతున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. పట్టణాలకు వలస వెళ్లిన ధనికులతో కొంత మంది అధికారులు కుమ్మకై, వాళ్ళ భూములకు ఎక్కువ ధర చెల్లించి, కమిషన్లు దండుకునేలా లోపాయకారి ఒప్పందాలు చేసుకుంటున్నారనే విమర్శలు



ఉన్నాయి. ఎసి కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఉన్న పిడమర్తి రవి ఇతర పనుల్లో బిజీగా ఉంటూ ఈ పథకాన్ని పట్టించుకోవడం లేదనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. ఇప్పటి వరకు అత్యధికంగా అదిలాబాద్ జిల్లాలో 1762 ఎకరాల భూమి కొనుగోలు చేయగా, అత్యల్పంగా సిద్దిపేట జిల్లాలో 45 ఎకరాలుగా ఉంది. ఇదిలా ఉండగా భూ పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఐఎఎస్ అధికారి బుద్ధ ప్రకాష్ కు అప్పగించింది. ఆయన నేతృత్వంలో ఆ కార్యక్రమం విజయవంతంగా ముందుకు సాగుతుందనేది ప్రభుత్వ భావిస్తోంది.

బిజెపిలో రాజీనామాలు

- **ఇమడలేని ఇతర పార్టీ నేతలు**
- **నేతల మధ్య పెరుగుతున్న అంతరం**
- **21న ఢిల్లీకి కిషన్ రెడ్డి?**

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్ర రాజకీయాల్లో సునామీ సృష్టిస్తామన్న బిజెపిలో వరుసగా రాజీనామాల పర్వం కొనసాగుతోంది. మొన్న మాజీ ఎంఎల్‌ఎ కొమ్మురి ప్రతాప్ రెడ్డి రాజీనామా చేయగా, తాజాగా బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు నాగం జానార్ధన్ రెడ్డి పార్టీని వీడనున్నారు. ఇతర పార్టీల నుండి నాయకులను చేర్చుకోవడం ద్వారా బలోపేతం కావాలనుకుంటున్న బిజెపికి గతంలో చేరిన నాయకులు వీడుతుండడంతో ఇబ్బందిగా మారింది. దీంతో ఆ పార్టీలో బైటి వారు చేరేందుకు తటపటాయిస్తున్నారు. ఇతర పార్టీల్లో ఉన్న గుర్తింపు బిజెపిలో లభించకపోవడం, పార్టీ కార్యక్రమాలు కూడా ఆశించిన స్థాయిలో లేకపోవడం, ప్రభుత్వాన్ని ధీటుగా ఎదుర్కోలేకపోతుండడం అనే భావనతో పార్టీకి దూరమవుతున్న వారిలో నెలకొంది. అంతే కాకుండా జిల్లా స్థాయిలో పాత, కొత్త నేతల మధ్య అంతరం పెరుగుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో బిజెపి బలోపేతానికి ఢిల్లీ కేంద్రంగా పాచికలు కదులుతుంటే రాష్ట్రంలో మాత్రం అందుకు భిన్నంగా సీనియర్ నేతలు పార్టీని వీడడం ఆ పార్టీ వర్గాల్లో చర్చనీయంశంగా మారింది. గతంలో మాజీ ఎంఎల్‌ఏ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పార్టీని వీడగా, ఇటీవల కొమ్మురి ప్రతాప్‌రెడ్డి రాజీనామా చేశారు. నాగం జనార్ధన్ రెడ్డి అదే బాటలో ఉన్నారు. అంతే కాకుండా గతంలో చేరిన ఎంఎల్‌సి కపిలవాయి దిలిప్‌కుమార్ కూడా చురుకుగా లేదు. మాజీ మంత్రి పుష్పలీల అడపాదడపానే పార్టీ ఆఫీసుకు వచ్చిపోతున్నారు. మరోవైపు బైటి నుండి వచ్చిన వారు ఇబ్బంది పడుతున్నట్లు తెలిసినా పార్టీ రాష్ట్ర నాయకత్వం పెద్దగా పట్టించుకోవడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. గత కొంత కాలంగా నాగం జానార్ధన్ రెడ్డి బిజెపి కార్యాకలాపాలకు దూరంగా ఉంటూ పార్టీ తీరుపై కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఉగాది తరువాత భవిష్యత్తు రాజకీయాలపై నిర్ణయం తీసుకుంటా నని వెల్లడించారు. అయితే నాగం జనార్ధన్ రెడ్డికి జాతీయ కార్యవర్గ సభ్యు నిగా, గత ఎన్నికల్లో ఎంపి, ఆయన కుమారుడు నాగం శశి ధర్‌రెడ్డికి ఎంఎల్‌ఏగా పోటీ చేసే అవ కాశం కల్పిం చామని, అలాగే శశిధర్‌రెడ్డిని నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షునిగా అవకాశం కల్పించామని ఒక సీనియర్ నేత చెబుతున్నారు. వారికి పార్టీలో మంచి అవకాశం, గౌరవం కల్పించినప్పటికీ పార్టీని వీడేందుకు ఎందుకు సిద్ధపడుతున్నారో తెలి యడం లేదని, ప్రజా సమస్యలపై అధికార పార్టీతో నిత్యం తాము పోరా డు తున్నామని ఆయన వ్యాఖ్యానించారు. కాగా నాగం జనార్ధన్ రెడ్డి అంశం పై రాష్ట్ర కోర్ కమిటీ సంక్రాంతి తరువాత సమావేశమై చర్చించనున్నట్టు తెలిసింది.

21న ఢిల్లీకి కిషన్‌రెడ్డి : రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలు, తదితర అంశాలపై ఢిల్లీని బిజెపి అగ్రనేతల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈనెల 21న బిజెఎల్‌పి నేత జి.కిషన్ రెడ్డి న్యూఢిల్లీకి వెళ్లనున్నట్లు తెలిసింది. తెలంగాణలో జాతీయ అధ్యక్షులు అమిత్‌షా పర్యటన నేపథ్యంలో ముందస్తుగా రాష్ట్ర పరిస్థితులను, రాజకీయ పరిణామాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని, అలాగే ఎస్‌సి వర్గీకరణ అంశాన్ని కూడా ప్రస్తావించాలని కిషన్ రెడ్డి భావిస్తున్నారు. ఆ తర్వాత రాష్ట్రం నుంచి బిజెపి ప్రతినిధి బృందం త్వరలోనే న్యూఢిల్లీకి వెళ్లి జాతీయ నాయకత్వంలో చర్చించనున్నారు. ఇప్పటి వరకు పార్టీ చేపట్టిన కార్యక్రమాలు, బలాబలాలు తదితర అంశాలను వివరించే అవకాశం ఉన్నది.



17న మోహన్‌బాబుకు 'విశ్వనట సార్వభౌమ' బిరుదు ప్రదానం

మన తెలంగాణ/హైదరాబాద్: సినీరంగంలో 42 ఏళ్లు పూర్తిచేసుకున్న విలక్షణ నటుడు డాక్టర్ ఎం.మోహన్‌బాబుకు జనవరి 17న 'విశ్వనట సార్వభౌమ' బిరుదు ప్రధానం చేస్తున్నట్లు కేంద్ర మాజీ మంత్రి టి.సుబ్బరామిరెడ్డి తెలిపారు. టిఎస్‌ఆర్ కాకతీయ లలిత కళా పరిషత్ ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో 'కాకతీయ కళా వైభవ మహోత్సవం' నిర్వహిస్తున్నామన్నారు. శనివారం నాడు హైదరాబాద్‌లో సుబ్బరామిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ కాకతీయులు, రాణి రుద్రమ చరిత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. ఈ చరిత్రను తెలుగు వారంతా తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు. మహారాష్ట్ర గవర్నర్ సిహెచ్.విద్యాసాగర్‌రావు ముఖ్య అతిథిగా హాజరవుతారని, రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కె.స్వామి గౌడ్, శాసనసభ స్పీకర్ ఎస్. మధుసూధనాచారి, మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ హాజరవుతారని సుబ్బరామిరెడ్డి వివరించారు. కూచిపూడి నర్తకి పద్మజారెడ్డి తన శిష్యబృందంతో కలిపి 'రాణి రుద్రమ' నృత్యరూపకాన్ని, వింజమూరి సుజాత తన శిష్యబృందంతో 'యాదాద్రివాసా మనసాస్వామి' నృత్యరూపకాన్ని ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. కాకతీయ కళా వైభవ మహోత్సవాలను వరంగల్, నల్లగొండ, నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మంలలో నిర్వహిస్తామని స్పష్టం చేశారు. మోహన్‌బాబు, పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ కళలను, కళాకారులను గౌరవించాలన్న గొప్ప మనసు సుబ్బరామిరెడ్డిదని ప్రశంసించారు.

ఎవరిది ఈ నిర్లక్ష్యం..?



- మేడిపల్లి అగ్నిప్రమాదం వెనుక అక్రమ వ్యాపారం
- ట్యాంకర్ మూత తొలగించడంలో సాంకేతిక లోపం
- 15 మందికి కాలిన గాయాలు..5 వాహనాలు దగ్ధం
- ఇద్దరి పరిస్థితి విషమం... పోలీసుల అదుపులో షెడ్ యజమాని

మన తెలంగాణ/ హైదరాబాద్ సిటీబ్యూరో: నిర్లక్ష్యం... పర్యవేక్షణాలోపం వెరసి మేడిపల్లి డీజిల్ ట్యాంకర్ భారీ అగ్నిప్రమాదం. 15 మందికి తీవ్రగాయాలు. పరిసర ఇళ్ళకు ఆస్తినష్టాలు. 5 మోటార్ సైకిళ్ల వాహనాలు దగ్ధం. ఈ సంఘటన వెనుక ప్రధానంగా ప్రభుత్వ విభాగాల నిర్లక్ష్యంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటు పోలీసు అధికారులు, అటు గ్రామపంచాయితీ అధికారుల పట్టింపులేని ధోరణి కారణంగానే అగ్నిప్రమాదం చోటుచేసుకున్నట్టు స్థానికులు విమర్శిస్తున్నారు.

మేడిపల్లిలో ట్యాంకర్ల అక్రమాల వెనుక తిలాపాపం తలా పిడికెడు అన్న చందంగా ప్రభుత్వ విభాగాలు వ్యవహరిస్తున్నాయనేది బహిరంగ రహస్యం. ఈ సంఘటనకు బాధ్యులు ఎవరనే విషయం ప్రక్కనబెడితే.. ఇక్కడ ఏర్పాటు చేసిన షెడ్ నిర్మాణానికి అనుమతులు లేవని, అందులో పని చేసే కార్మికులకు సంబంధించిన లేబర్‌కమిషనర్ కార్యాలయం నుండి లైసెన్స్ లేదని అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ షెడ్ లో ట్యాంకర్లు వస్తాయని, అక్కడ ఏమి జరుగుతుందనేది అందరికీ తెలిసిన రహస్యమని స్థానికులు వివరిస్తున్నారు. వాస్తవంగా అక్కడ ట్యాంకర్ల ఇంధనం విషయంలోనే అక్రమాలు చోటుచేసుకుంటాయనేది ప్రచారంలో ఉన్నది.

అసలేం జరిగింది...? : స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం. ఇది రాజు అనే భూ యజమానియే సుమారు 400 చ.గ.లులో మెకానిక్ పనులు చేసేందుకు షెడ్, మరో 200 చ.గ.లు వరకు పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటుచేశారు. ట్యాంకర్లు కూడా అతడియేనని పేర్కొంటున్నారు. ఈ షెడ్‌లోకి ప్రతిరోజు ట్యాంకర్లు 15–30 వరకు రాత్రి పగలు అనే తేడా లేకుండా వస్తుంటాయనేది వారి సమాచారం. షెడ్‌లోకి చర్లపల్లి నుండి ఆరోజు వచ్చిన ట్యాంకర్ మూతను సాంకేతిక పద్ధతిలో తొలగించే ప్రయత్నం జరుగుతుండగా పొరపాటున నిప్పురవ్వ వెలువడి ట్యాంకర్‌లో పడింది. అది గమనించిన సాంకేతిక పనివారు భయాందోళనలకు లోనై అక్కడి నుండి పలాయనం చిత్తగించారు. ట్యాంకర్‌లో మంట రాజుకుంటుండగానే పొగ వెలువడటం, చిన్నగా మంట మొదలైంది. ఆ షెడ్ ముందున్న రోడ్డు మార్గంలో రాకపోకలు సాగించేవారు ట్యాంకర్‌లోని మంటలను గమనించారు. మంటలు ఒక్కసారిగా భారీ స్థాయిలో వెలువడటంతో చేరువగా ఉన్న వాహనాలు దగ్ధమవ్వగా, వాటిపై ఉన్న వ్యక్తులు, తిలకిస్తున్నవారు కాలిన గాయాలకు గురయ్యారు. వెంకటేష్ నాయక్, స్వామి, వాసు అనే ముగ్గురి పరిస్థితి విషమమని అధికారులు వెల్లడిస్తున్నారు. క్షతగాత్రులుగా.. గోపాలచారి, జలీల్‌ఖాన్, ఇబ్రహీం, శివప్రసాద్, రమేష్‌చౌదరి, మురళీదాస్, నిరంజన్ నవనీత్, చంద్రశేఖర్, ప్రశాంత్, శివకుమార్, ప్రవీణ్, నిఖిల్ రెడ్డిలు ఉన్నారు.

పోలీసుల అదుపులో షెడ్ యజమాని..

ట్యాంకర్ అగ్నిప్రమాదం జరిగిన షెడ్ యజమాని రాజును మేడిపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది. వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చేందుకు వారు దర్యాప్తును ముమ్మరం చేసినట్టు సమాచారం. ట్యాంకర్ యజమాని ఎవరు..? షెడ్‌కు ఎందుకు వచ్చింది..? ఎక్కడికి వెళ్ళాల్సి ఉన్నది..? అగ్నిప్రమాదమెలా జరిగింది...? అందుకు ప్రధాన కారకులెవరు..? సహకరించినవారెంతమంది..? దీని వెనుక జరిగేది ఏమిటి..? అనే విషయాలను సమగ్రంగా తెలుసుకునేందుకు పోలీసు యంత్రాంగం వేగంగా దర్యాప్తును చేపట్టినట్టు సమాచారం. మరో రెండు రోజుల్లో ప్రమాదానికి కారణాలు, అందుకు కారకులను విలేకరుల ముందుకు తీసుకురానున్నట్టు పోలీసు వర్గాలు వెల్లడిస్తున్నాయి. ట్యాంకర్ నెంబర్‌ను వెల్లడించడానికి నిరాకరించారు.

మాకు న్యాయం చేయండి : సత్తయ్య




అగ్నిప్రమాదంతో మా మూడంతస్థుల భవనం వెనుకభాగం పూర్తిగా కాలిపోయింది. స్ట్రక్చరల్ ఇంజనీర్‌ను పిలిచి నష్టం అంచనావేస్తున్నామని, ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని స్పెషల్ పోలీసు విభాగంలో పదవీవిరమణ పొందిన సత్తయ్య కోరాడు.

15 లక్షల నష్టం...



ఫర్నిచర్ పూర్తిగా దగ్ధమైంది. పరుపులు, దిండ్లు, కరెంటు వైరింగ్, బోరు పైపులు తగలబడ్డాయని సుమారు రూ. 15 లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లినట్టు సిధార్థ ఫర్నిచర్ యజమాని వెల్లడించారు. అక్కడనే ఉన్న హనుమాన్ ట్రేడర్స్‌లోని టైల్స్, విద్యుత్ వ్యవస్థ వంటివి పూర్తిగా కాలిపోయినట్టు వెల్లడించారు.

విద్యుత్ కొనుగోళ్లంతా పారదర్శకమే



మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రానికి తమ విద్యుత్ ఉత్పత్తి సంస్థ (థర్మల్ పవర్ టెక్) నుంచి జరుగుతున్న విద్యుత్ కొనుగోలు వ్యవహారమంతా పారదర్శకంగానే జరిగిందని కేంద్ర మాజీ మంత్రి టి.సుబ్బరామిరెడ్డి స్పష్టం చేశారు. విద్యుత్ కొనుగోళ్లలో అక్రమాలపై కాంగ్రెస్ , టిఆర్‌ఎస్‌ల మధ్య సవాళ్ళ నేపథ్యంలో ఈ సంస్థ పేరు కూడా ప్రస్తావనకు వచ్చింది. హైదరాబాద్‌లో సుబ్బరామిరెడ్డి శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశం సందర్భంగా ఈ విషయం గురించి ' మన తెలంగాణ'ప్రతినిధి ప్రశ్నించారు. దీనికి ఆయన స్పందిస్తూ 'విద్యుత్ కొనుగోలు కోసం తెలంగాణ ప్రభుత్వం టెండర్లు పిలవగా, అందులో పాల్గొన్నాం. ఎవరు తక్కువ రేటు కోట్ చేస్తే వారికే ప్రాధాన్యత ఉంటుందని' చెప్పారు. దాని ప్రకారమే మా కంపెనీ నుంచి కొనుగోళ్లు జరుగుతున్నాయని, ఎటువంటి అక్రమాలకు,అనుమానాలకు తావులేదని సుబ్బరామిరెడ్డి చెప్పారు. థర్మల్ పవర్ టెక్ సంస్థలో తమకు కేవలం 10 శాతం వాటా ఉందన్నారు.

ఇఎస్‌ఐని ప్రైవేటీకరించేందుకు యత్నం



మన తెలంగాణ / హైదరాబాద్ : ఉద్యోగులకు విశిష్ఠ సేవలందిస్తున్న ఇఎస్‌ఐని ప్రైవేటీకరించే కుట్రను వైద్య ఉద్యోగులు ఐక్యంగా ఎదుర్కోవాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు టి.నరసింహన్, ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకార్‌రావు అన్నారు. ఇఎస్‌ఐ డయోగ్నోస్టిక్స్ పేరుతో వైద్య పరీక్షలను ప్రైవేటుపరం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు. తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రచురించిన 2018 డైరీ, క్యాలెండర్‌ను ఎఐటియుసి కార్యాలయంలో శనివారం వారు ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నరసింహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంట్రాక్టు అనే పదం ఉండదని సిఎం కెసిఆర్ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించినా ఆచరణలో మాత్రం అది జరగలేదన్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణ రెడ్డి మాట్లాడుతూ టివివిపిలో పరిధిలోని వైద్యశాలల ఉద్యోగులకు ట్రెజరీ ద్వారా జీతాలు చెల్లించాలని,హెల్త్‌కార్డులు ఇవ్వాలని, ఐపియంలో ఉన్న ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షులు ఎస్.విఠల్ మాట్లాడుతూ ఎన్‌హెచ్‌యం, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్న ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేయాలని కొరారు.

చెరువుల ఆక్రమణలపై సంజాయిషీ చెప్పండి :హైకోర్టు

మన తెలంగాణ/ హైదరాబాద్: హైదరాబాద్ శివారులోని పటాన్‌చెరు మండలం అమీన్‌పూర్ గ్రామంలో చెరువుల ఆక్రమణలపై సంజాయిషీ చెప్పాలని సంగారెడ్డి జిల్లా రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతోపాటు హెచ్.ఎం.డి.ఎ.ను హైకోర్టు ఆదేశించింది. చెరువుల్ని ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారంటూ చంద్రశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై హెచ్‌ఎండిఎ లాయర్ స్పందిస్తూ చెరువు ప్రాంతంలో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు జరిగాయని ఒప్పుకున్నారు. దాంతో ప్రతివాదులకు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి శ్యాంప్రసాద్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఇటీవల నోటీసులు జారీ చేసింది. పిటిషనర్ చేసిన ఆరోపణలపై వివరణలతో కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని ప్రతివాదుల్ని బెంచ్ ఆదేశించింది. తదుపరి విచారణ 23కి వాయిదా వేసింది.

టిఎన్‌జిఒస్ వ్యవసాయ శాఖ క్యాలెండర్ ఆవిష్కరణ



మన తెలంగాణ/హైదరాబాద్ : టిఎన్‌జిఒస్ వ్యవసాయ శాఖ యూనిట్ 2018 క్యాలెండర్‌ను వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ ఎం.జగన్ మోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు అంకితభావంతో పనిచేయాలన్నారు. నాన్ గెజిటెడ్ సిబ్బందిని మరింతగా నియామకం చేసుకుని పని ఒత్తిడి తగ్గించాలని వ్యవసాయ శాఖ యూనిట్ టిఎన్‌జిఒస్ అధ్యక్షులు మెట్టు నాగిరెడ్డి కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ ఛైర్మన్ దేవి ప్రసా రావు, టిఎన్‌జిఒస్ నాయకులు కారం రవిందర్ రెడ్డి, యం. రాజేందర్, ప్రతాప్, నిరంజన్ రెడ్డి, వ్యవసాయ శాఖ నుంచి గీతా సుమతి, శ్రీకాంత్ తదిరతులు పాల్గొన్నారు.

తిరుమలలో ఉత్తమ్, పద్మావతి



కుటుంబ సభ్యులతో కలిసి శనివారం తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న టిపిసిసి అధ్యక్షులు ఎస్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సతీమణి కోదాడ ఎంఎల్‌ఎ ఎస్.పద్మావతిరెడ్డి

16, 17 తేదీల్లో 3 ప్రత్యేక రైళ్లు



మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 16, 17 తేదీల్లో కాకినాడ టౌన్ – సికింద్రాబాద్ మధ్య రెండు జన్‌సాధారణ్ ప్రత్యేక రైళ్ల (నెం.07051) ను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ ప్రత్యేక రైలు కాకినాడ టౌన్ నుంచి సాయంత్రం 6 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 4:30 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఇదిలా ఉండగా తిరుపతి – సికింద్రాబాద్ మధ్య మరోక ప్రత్యేక రైలు (నెం.07430) ఈ నెల 17వ తేదీ రాత్రి 8:10 గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9:35 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

చిన్న పరిశ్రమలకు చేయూత



- పరిశ్రమలు మూతపడకుండా చూడాలి
- ఏడాదికి రెండుసార్లు ముద్ర రుణాల మేళా
- కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో కెటిఆర్

మన తెలంగాణ / హైదరాబాద్ : జిల్లాల్లోని చిన్న పరిశ్రమలకు చేయూత నిచ్చేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఆ శాఖ మంత్రి కెటిఆర్ అన్నారు. చిన్న పరిశ్రమలను ఆదుకునేందుకు నెలకోసారి జిల్లా స్థాయిలో కలెక్టర్లు సమావేశాలను నిర్వహించి వాటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు రావాలని దిశా నిర్దేశం చేశారు. శనివారం సచివాలయం నుండి ఉన్నతాధికారులతో కలిసి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా స్థాయిలోనే బ్యాంకర్లతో సమావేశాలు ఏర్పాటు చేయాలని, పరిశ్రమలు మూత పడకుండా చూసుకోవాలని సూచించారు. మార్చితో ముగియ నున్న ఈ ఆర్థిక సంవత్సరానికి గాను కనీసం రెండు సార్లు అయినా ముద్రా రుణాల మేళాలను నిర్వహించాలని కలెక్టర్లకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. మూడు రోజుల కిందట నిర్వహించిన బ్యాంకర్ల సమావేశంలో తీసుకున్న నిర్ణయాల నేపథ్యంలో శనివారం నాడు కెటిఆర్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించడం గమనార్హం. ఇసుక అక్రమ రవాణా, అక్రమ మైనింగ్ , నిల్వలు తదితర వాటిపై కలెక్టర్లు కఠినంగా వ్యవహరించాలన్నారు. మైనింగ్ పాలసీతో ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతోందని పాత ప్రభుత్వాల్లో వచ్చిన రెవిన్యూ కన్నా అనేక రెట్లు ప్రస్తుతం ఖనాజాకు చేరుతోందన్నారు. ఇదే సమయంలో సాధారణ ప్రజలకు కూడా ఈ సేవ కేంద్రాల ద్వారా ఇసుకను బుక్ చేసుకునే అవకాశం కల్పించనున్నామన్నారు. ప్రభుత్వానికి ఆదాయం, ప్రజలకు అందుబాటులో ఇసుక అనే రెండు ప్రధానమైన అంశాల మీద ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఇప్పటికే పెద్దపల్లి, మహబూబ్‌నగర్, గద్వాల వంటి ప్రాంతాల్లో ఇసుక రవాణాలో ఆయా జిల్లాల కలెక్టర్లు అద్భుతమైన కార్యక్రమాలను చేపట్టారని, వాటిని ఇతర జిల్లాల కలెక్టర్లు సైతం అమలు చేయాలన్నారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు డిజిపి ప్రత్యేకంగా మరో సారి సమావేశం అవుతారని మంత్రి తెలిపారు. దీంతో పాటు ప్రతి జిల్లాలోని డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ గవర్నింగ్ కౌన్సిళ్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. డిఎంఎఫ్‌కు అందుబాటులో ఉన్న నిధులను ఖర్చు చేసేందుకు ప్రభుత్వం త్వరలోనే మార్గదర్శకాలను విడుదల చేస్తుందన్నారు. ఈ పనుల ద్వారా ఇసుక మైనింగ్ జరిగే ప్రాంతాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టవచ్చన్నారు.



24 గంటల విద్యుత్ వద్దనుకుంటే గ్రామపంచాయితీలో

తీర్మానం చేయండి

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో రూ.270 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రులు

మనతెలంగాణ / వరంగల్‌బ్యూరో : అభివృద్ధి, సంక్షేమ రంగంతోపాటు సాగునీటి రంగానికి పెద్ద పీట వేస్తోందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, భారీ నీటిపారుదల, మార్కెటింగ్‌శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, రోడ్లు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం వరంగల్ రూరల్, అర్బన్ జిల్లాల్లో 270కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. వర్ధన్నపేట నియోజకవర్గంలోని పర్వతగిరి మండలం, గీసుగొండ మండలంలోని వంచనగిరి, హసన్‌పర్తి మండలంలోని చింతగట్టు వద్ద గ్రామంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలలో కడియం శ్రీహరి, హరీష్‌రావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎంపి పసునూరి దయాకర్, ఎంఎల్‌ఎ కొండా మురళీధర్‌రావు, వరంగల్ తూర్పు ఎంఎల్‌ఎ కొండా సురేఖ, వర్ధన్నపేట ఎంఎల్‌ఎ అరూరి రమేష్, పాలకుర్తి ఎంఎల్‌ఎ ఎర్రబెల్లి దయాకర్‌రావులు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి కడియం మాట్లాడుతూ తాను పుట్టినగడ్డ పర్వతగిరి మండలాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలుపుతానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సాగుకు నాణ్యమైన 24 గంటల విద్యుత్‌ను అందిస్తుందని రాష్ట్ర భారీ నీటి పారుదల, మార్కెటింగ్‌శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. ఒకవేళ రైతులు 24 గంటల కరెంటు వద్దు అనుకుంటే గ్రామపంచాయతీలో తీర్మానం చేసి స్థానిక ఎంఎల్‌ఎకు ఇస్తే ఆగ్రామ పంచాయతీ పరిధిలో తక్కువ కరెంటు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటరన్నారు. అభివృద్ధిలో హైదరాబాద్ తరువాత వరంగల్‌కే ముఖ్యమంత్రి కెసిఆర్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. ఉన్న ఊరు, కన్న తల్లిని ప్రేమించే వ్యక్తి ఎంఎల్‌సి కొండా మురళీధర్‌రావు అని, పుట్టిన ఊరు వంచనగిరిని అభివృద్ధి చేసేందుకు తండ్రి మురళీధర్‌రావు, కూతురు సుస్మితా పటేల్ కృషి చేస్తున్నారని వరంగల్ తూర్పు ఎంఎల్‌ఎ కొండా సురేఖ అన్నారు. ఈ కార్యక్రమాలలో ఎంఎల్‌ఎ చల్లా ధర్మారెడ్డి, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జడ్‌పి చైర్‌పర్సన్ గద్దల పద్మ, మేయర్ నన్నపునేని నరేందర్, కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, రాష్ట్ర గొర్రెలు, మేకల కార్పొరేషన్ చైర్మన్ కన్నెబోయిన రాజయ్య యాదవ్, రాష్ట్ర దివ్యాంగుల అభివృద్ధి సంస్థ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, రాష్ట్ర మహిళ కార్పొరేషన్ చైర్మన్ గుండా సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

రెండో దశకు మోక్షమెప్పుడు?



- పాలమూరు ఎత్తిపోతలకు కుదరని ముహూర్తం
- ఇంకా కొనసాగుతున్న మొదటి దశ పనులు

మన తెలంగాణ/హైదరాబాద్: పాలమూరు రంగారెడ్డి రెండో దశకు ఇప్పట్లో మోక్షం లభించేలా లేదు. శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి నీటిని ఎత్తిపోసి, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు తరలించాలన్న ఉద్దేశంతో కృష్ణా నదిపై పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పేరుతో భారీ ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం చేపట్టినా మొదటి దశలోని పెండింగ్ పనుల కారణంగా రెండవ దశపై అనుమానం తలెత్తుతోంది. పాలమూరు జిల్లాకు నీరిచ్చే తొలి దశ టెండర్లు పిలిచి, పనులు మొదలు పెట్టినా చివరి రిజర్వాయర్ ఉద్ధండాపూర్ నిర్మాణంలో ఆశించిన పురోగతి కనిపించడంలేదు. ఈ పనులు పూర్తయితేనే ఆ తర్వాతి దశకు నీరు వెళ్తుంది. తొలి దశలోని 18 ప్యాకేజీల పనులకు టెండర్లు పిలిచి, నిర్మాణపు పనుల్ని ఆరంభించగా, ఉద్ధండాపూర్ రిజర్వాయర్ మినహా, మిగతా పనులన్నీ పురోగతిలోనే ఉన్నాయి. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా మొత్తం 12.30 లక్షల ఎకరాల ఆయకట్టులోకి వస్తుందని అంచనా. ఇందులో సుమారు 4.88 లక్షల ఎకరాలు ఉద్ధండాపూర్ రిజర్వాయర్ ద్వారానే. ఇది పూర్తయితేనే రెండో దశ పనులు ప్రారంభవుతాయి. ఇందులో లక్ష్మి దేవిపల్లి రిజర్వాయర్ ప్రధానమైనది. దీని ద్వారా 4.13 లక్షల ఎకరాలు ఆయకట్టులోకి వస్తుంది. అయితే తొలి దశలోని ఉద్ధండాపూర్, రెండవదశలోని లక్ష్మి దేవిపల్లి రిజర్వాయర్‌ల ద్వారా సాగయ్యే భూమి మొత్తం ప్రాజెక్టు ఆయకట్టు లక్ష్యంలో రెండు వంతులు ఉంటుంది. ఈ రెండింటి పనుల జాప్యంతో మొత్తం ప్రాజెక్టు లక్ష్యమే ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. మొదటి దశలోని నార్లాపూర్ నుంచి మొదలు కరివెన రిజర్వాయర్ వరకు పనులన్నీ సంతృప్తికరంగానే నడుస్తున్నాయి. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో 12,30,000 ఎకరాలకు సాగునీరు, 1300 గ్రామాలకు తాగునీరందించేలా చేపట్టిన ఈ ప్రాజెక్టుకు అనుసంధానంగా నార్లాపూర్ నుంచి డిండి ఎత్తిపోతలకు కూడా నీటిని మళ్లించాల్సి ఉంది. డిండి ఎత్తిపోతల ద్వారా 4 లక్షల ఎకరాలకు సాగునీరు, సమీప గ్రామాల్లో తాగునీరు సరఫరా చేయాలి. కృష్ణా నది బ్యాక్‌వాటర్ నుంచి రోజుకు రెండు టిఎంసిల చొప్పున నీటిని ఎత్తిపోసి నార్లాపూర్ రిజర్వాయర్‌కు చేరుస్తారు. ఇక్కడి నుంచి అర టిఎంసిని డిండికి మళ్లిస్తారు. 1.5 టిఎంసి నీటిని పాలమూరు రంగారెడ్డి పథకానికి వినియోగించుకోవాల్సివుంది. పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టుల్లో మొత్తం ఆరు రిజర్వాయర్లు ఉండగా, అధిక శాతం ఆయకట్టు చివరి రెండు రిజర్వాయర్ల పరిధిలోనే ఉంది. నార్లాపూర్ రిజర్వాయర్ కేవలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ మాత్రమే కాగా, ఏదుల రిజర్వాయర్ నుంచి గరిష్టంగా 20 వేల ఎకరాల ఆయకట్టు ప్రతిపాదించారు. మూడో రిజర్వాయర్ వట్టెం నుంచి 1,39,000 ఎకరాలు, నాలుగోదైన కరివెన రిజర్వాయర్ నుంచి 1,90,000 ఎకరాలకు నీరిచ్చేలా పనులు నడుస్తున్నాయి. పనులు చాలా మెల్లిగా నడుస్తున్న ఉద్ధండాపూర్ రిజర్వాయర్‌పై ఆధారపడి ఏకంగా 4,88,000 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇంకా టెండర్లు పిలవని కెపి లక్ష్మీ దేవపల్లి రిజర్వాయర్ నుంచి 4,13,000 ఎకరాల ఆయకట్టు ఉంది. మొత్తం ఆయకట్టు 12,30,000 ఎకరాలు కాగా, చివరి రెండు రిజర్వాయర్ల నుంచే 9 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఆధారపడివుంది. మిగతా అన్ని రిజర్వాయర్ల నుంచి 3,00,000 ఎకరాల ప్రతిపాదిత ఆయకట్టుకే నీరిస్తారు. ఉద్ధండాపూర్, కెపి లక్ష్మీ దేవపల్లి రిజర్వాయర్ల నుంచే రంగారెడ్డి జిల్లాకు తాగు, సాగునీటితో పాటు రాజధాని హైదరాబాద్‌కు తాగునీరు సరఫరా చేయాల్సి ఉంది. 20 టిఎంసిల సామర్థ్యంతో రాచకొండ గుట్టలు, రామోజీ ఫిలింసిటీకి సమీపంలో నిర్మిస్తున్న డెడికేటెడ్ తాగునీటి రిజర్వాయర్‌కు నీటిని వీటి నుంచే సరఫరా చేయాలి. అతి ఎక్కువ లబ్ధి కలిగించే రిజర్వాయర్ల నిర్మాణాలు నత్తనడక నడుస్తుండడంపై విమర్శలు వస్తున్నాయి. ఉద్ధండాపూర్ భూసేకరణలో జరుగుతున్న జాప్యాన్ని నివారించడం, కెపి లక్ష్మీ దేవపల్లి రిజర్వాయర్ టెండర్లు పిలిచి, నిర్మాణం చేపట్టాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి రూ.35,200 కోట్లతో ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇవ్వగా, 2015–16లో రూ.386 కోట్లు, 2016–17లో రూ.708.61కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ. 1,182 కోట్లు వెచ్చించారు. మొత్తంగా రూ.2,276 కోట్లు ఖర్చు చేశారు. వచ్చే మూడేళ్లలో దండిగా నిధులు సమకూరిస్తేనే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పూర్తవుతుంది.



"నువ్వు సూటిగా, నిజాయితీగా వ్యవహరించినా ప్రజలు నిన్ను మోసగించవచ్చు అయినా నువ్వు సూటిగా, నిజాయితీగా ఉండు. – మదర్ థెరిస్సా"

విపరిణామం

సంపాదకీయం

సుప్రీం కోర్టు సీనియర్ మోస్ట్ న్యాయమూర్తులు నలుగురు పత్రికా గోష్టి జరిపి ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా అడ్మినిస్ట్రేటివ్ పనితీరుపై ధ్వజమెత్తటం అత్యున్నత న్యాయ వ్యవస్థ చరిత్రలో అసాధారణం, అపూర్వం. జస్టిస్‌లు జె.చలమేశ్వర్, రంజన్ గొగోయ్ (తదుపరి ప్రధాన న్యాయమూర్తి కావలసిన సీనియర్), మదన్ బి.లోకూర్, కురియన్ జోసెఫ్ తమ అసంతృప్తిని, ఆవేదనను వెల్లడించటానికి ఎంచుకున్న మార్గంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నప్పటికీ, గత్యంతర రాహిత్య స్థితిలోనే వారు ప్రతికల ద్వారా ప్రజల ముందుకు వచ్చారన్న భావన బలంగా ఉంది. ప్రధాన న్యాయమూర్తి ఎంపిక చేసిన రీతిలో బెంచీలు ఏర్పాటు చేయటం, అత్యంత సున్నితమైన, జాతీయ ప్రాధాన్యత కేసులను వాటికి కేటాయించటంపట్ల తమ మనస్తాపాన్ని వ్యక్తం చేసేందుకు వారు ఎంచుకున్న మార్గాన్ని ప్రశ్నించటం కన్నా, లేవనెత్తిన అంశాలకు పరిష్కారాలు కనుగొనటం జస్టిస్ మిశ్రా ముందున్న కర్తవ్యం. ఎందుకంటే మన రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యంలో న్యాయ వ్యవస్థ స్వతంత్రమైనది. దాని సమస్యలను అంతర్గత చర్చల ద్వారా అదే పరిష్కరించుకోవాలి. కార్యనిర్వాహక వ్యవస్థకు చెందిన కొందరి జోక్యాన్ని అనుమతించటమే వ్యవస్థ గాడితప్పటానికి కారణమన్న భావన నలుగురు న్యాయమూర్తులు ఫిర్యాదులో పూసలో దారంలో ఉంది. ప్రధాన న్యాయమూర్తి పాలనా రీతిని ప్రశ్నిస్తూ వారు రెండు నెలల క్రితమే లేఖ రాశారు. స్పందన లేదు. శుక్రవారం ఉదయం స్వయంగా కలిసి కొన్ని అంశాలు లేవనెత్తారు, సానుకూల స్పందన రాలేదు. అప్రజాస్వామిక, అవాంఛనీయ పరిణామాల నుంచి వ్యవస్థను కాపాడే సదుద్దేశంతో పత్రికాగోష్టి ద్వారా సమస్యలను దేశ ప్రజల ముందుంచారు. ప్రజాస్వామ్యం ప్రమాదం ఎదుర్కొంటున్నట్లు హెచ్చరిక చేశారు.

శుక్రవారం పరిణామాలు ఏమి సూచిస్తున్నాయి? సుప్రీంకోర్టు భిన్నాభిప్రాయాలతో సమమతమవుతోంది. బెంచిలకు కేటాయించే కేసులు ఈ విభేదాలకు మూలం. ప్రధాన న్యాయమూర్తి 'మాస్టర్ ఆఫ్ రోస్టర్' అయినప్పటికీ కీలకమైన కేసుల కేటాయింపులో సీనియర్‌లను కాదని జూనియర్లతో కూడిన బెంచిలను ఎంచుకుంటున్నారు. రాజకీయంగా సున్నితమైన కేసుల్లో బెంచీల ఎంపికను కార్యనిర్వాహక వర్గం (ప్రభుత్వం) ప్రభావితం చేస్తుండవచ్చు. జడ్జీల నియామకం సిఫారసులను ప్రభుత్వం దీర్ఘకాలం తొక్కి పట్టినపుడు అప్పటి ప్రధాన న్యాయమూర్తి టి.ఎస్.ఠాకూర్ బహిరంగంగా కన్నీళ్ల పర్యంతం కావటం గుర్తు చేసుకోదగింది.

జడ్జీలను జడ్జీలతో కూడిన కొలీజియం నియమించే విధానం స్థానంలో ప్రభుత్వం తెచ్చిన జాతీయ జుడీషియల్ కమిషన్ చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధంగా సుప్రీంకోర్టు కొట్టి వేసిన నాటి నుంచి ప్రభుత్వం న్యాయ వ్యవస్థ మధ్య ఘర్షణ నడుస్తోంది. జడ్జీల ఎంపిక ప్రక్రియలో న్యాయ వ్యవస్థ, ప్రభుత్వం, ప్రభుత్వం నియమించే ఇద్దరు ప్రముఖులు ఉంటారని కమిషన్ చట్టం నిర్దేశించింది. ఇది న్యాయ వ్యవస్థలో కార్యనిర్వాహక వర్గం జోక్యంగా సుప్రీంకోర్టు భావించింది. అదే సమయంలో కొలిజియం వ్యవస్థ మెరుగుదల ఆవశ్యకతను వక్కాణించింది. ప్రభుత్వం ప్రతిపాదించిన మెమొరాండం ఆఫ్ ప్రొసీజర్స్‌పై అనేక నెలలపాటు ఇరు పక్షాల తర్జనభర్జనల అనంతరం సుప్రీంకోర్టు తమ అభిప్రాయాలతో ప్రభుత్వానికి పంపింది. ప్రభుత్వం అనేక మాసాలుగా మౌనంగా ఉన్నందున దాన్ని ఆమోదించినట్లే భావించబడింది. కాగా ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి అది ఇంకా ఫైనల్ కాలేదనే వైఖరి తీసుకున్నారు. అలాగే బిజెపి అధ్యక్షుడు అమిత్ షా నిందితుడిగా ఉన్న సొహ్రాబుద్దీన్ కేసును విచారిస్తున్న సిబిఐ కోర్టు జడ్జి బిహెచ్ లోయా మరణంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఉన్నతస్థాయి దర్యాప్తు కోరుతూ కుటుంబ సభ్యులు, మరి కొందరు దాఖలు చేసిన పిటిషన్‌ల విచారణను ప్రధాన న్యాయమూర్తి జూనియర్‌లతో కూడిన బెంచికి కేటాయించటంపై అసమ్మతి న్యాయమూర్తుల అభ్యంతరం వారి ఓర్మికి చివరి పరీక్ష అయింది.

న్యాయ వ్యవస్థకు సంబంధించిన ఈ సంక్షోభాన్ని వారే పరిష్కరించుకోవాలని ప్రభుత్వం సూత్రప్రాయ వ్యక్తీకరణతో తాము ఈ విషయంలో పరిశుద్ధంగా ఉన్నట్లు ప్రకటించుకుంది. కాగా జాతీయ మీడియాలో కొన్ని ఛానళ్లు రాజకీయ రంగు పులిమేందుకు గొంతెత్తి అరుస్తున్నాయి. ఈ పరిస్థితి ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నుంచి రాజనీతిజ్ఞతను డిమాండ్ చేస్తున్నది. తానను తాను చక్కదిద్దుకోగల వివేకం, విజ్ఞత అత్యున్నత న్యాయస్థానానికి ఉందని దేశ ప్రజల విశ్వాసం. రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేసే ప్రయత్నాలు ఎవరు చేసినా అవి బెడిసికొడతాయి. అదే మన ప్రజాస్వామ్య బలం.


కార్మికులలో బడ్జెట్ నైరాశ్యం

చూపు

రానున్న 2018 బడ్జెట్‌పై అనేక వర్గాల ప్రజలు ఆశలు అల్లుకుంటున్నారు. వేతన జీవులు ఆదాయం పన్ను మినహాయింపు పరిమితి పెరుగుతుందని ఎదురు చూస్తున్నారు. యువతరం నిరుద్యోగ భృతి వంటి కొత్త తరహా నిర్ణయం కోసం ఆశగా ఉన్నారు. అలాగే కార్మిక లోకంలో కూడా ఆశలు రెపరెపమంటున్నాయి. వాటిలో ముఖ్యమైనది రిట్రెంచ్ అయిన కార్మికులకు భృతి. కార్మిక అంశాల్లో మోడీ ప్రభుత్వం చేష్టలుడిగినట్లు వ్యవహరిస్తుండడంతో కార్మిక నాయకుల్లో మాత్రం ఈ బడ్జెట్‌పై అంతగా ఆశలు లేవు. ప్రభుత్వ అనుమతి లేకుండా కార్మికులకు ఉద్వాసన చెప్పే అధికారాన్ని 30 లోపు సిబ్బంది పనిచేసే సంస్థలకు కట్టబెట్టే ప్రతిపాదనను ప్రభుత్వం 2017 నవంబర్ 30న ఉపసంహరించుకుంది. అలా ఉద్వాసన పలికిన వారికి పెన్షన్ సౌకర్యం కూడా ఉండదని ప్రతిపాదించింది. చివరకు ఓట్ల కోసం నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ఇది ఒక్కటే మోడీ ప్రభుత్వం కార్మిక ప్రయోజనాలకు అనుకూలంగా తీసుకున్న నిర్ణయం. గుజరాత్‌లో ఎన్నికలకు 10 రోజుల ముందు జరిపిన అభిప్రాయ సేకరణ తమకు విరుద్ధంగా ఉండడంతో మోడీ తక్షణమే స్పందించారు. ఆ ప్రతిపాదనకు వెంటనే స్వస్తి పలికారు. గుజరాత్ ఎన్నికలు లేకుంటే మోడీ ఆ ఒక్క కార్మిక ప్రయోజనకర నిర్ణయమూ తీసుకునే వారు కాదు. గత నవంబర్‌లో ఎకనామిక్ టైమ్స్ ఇండియా డెవలప్‌మెంట్ డిబేట్ జరిపినప్పుడు పారిశ్రామిక వేత్తలు ప్రభుత్వ ఆర్థిక విధానాలపై సణుగుడు ప్రారంభించగా, ఆర్థిక మంత్రి జైట్లీ ప్రమేయం కల్పించుకొని వారిపై ఎదురు దాడి జరిపారు.

గుజరాత్ ఫలితాలు తెలిసిన మరునాడు జైట్లీ గొంతు మార్చా రు. గుజరాత్ ఫలితాల ఒత్తిడి నేపథ్యంలో పార్లమెంట్ ప్రస్తుత, తదుపరి సమావేశాల కోసం వేచిచూడమని పారిశ్రామిక వేత్తలను, కార్మిక నాయకులను ఉద్దేశించి అన్నారు. 44 కార్మిక చట్టాలను నాలుగు నియమావళులు (కోడ్స్) గా మిళితం చేసే సంస్కరణకు 2014లోనే ప్రధాని మోడీ నాంది పలికారు. ఆ సంస్కరణ మాటున ఇష్టానుసారం కొన్ని మార్పులు చేయడానికి ఆయన ప్రయత్నించారు. చిన్న పారిశ్రామిక సంస్థలను కార్మిక చట్టాల నుంచి మినహాయించడం, బయటి వారిపై ఆంక్షల పేరుతో కార్మిక సంఘాల నుండి వృత్తి నిపుణులను నిషేధించడం వంటి చర్యలకు ఆయన ప్రయత్నించారు. ఆ నాలుగు కోడ్‌లకు ఒకే ఒక్క కోడ్ (2017 వేతనాల నియమావళి ముసాయిదా బిల్లు) ఒకటే సిద్ధమైంది. వాటిలో అంతగా వివాదాస్పదం కాని కోడ్ అది ఒక్కటే.


గత ఆగస్టులో దానిని లోక్‌సభలో ప్రవేశపెట్టినప్పటికీ అది ఇంత వరకు ఆమోదం పొందలేదు. ఆ ధైర్యం ప్రభుత్వానికి లేకపోయింది. పారిశ్రామిక సంబంధాల కోడ్ బిల్లుపై పరస్పర విరుద్ధ నివేదికలు వెలువడ్డాయి. కార్మిక సంఘాలు ఈ బిల్లుపై మూడు రో జుల సమ్మెకు ఆరంభంలో పిలుపునిచ్చాయి. కంపెనీలు తమ కార్మికుల్లో 300 మంది దాకా అనుమతి లేకుండా రిట్రెంచ్ చేయవచ్చునన్న నియమాన్ని కార్మికుల నుంచి వల్ల రద్దు చేయడానికి జైట్లీ అంగీకరించారు. దీని తర్వాత కార్మిక సంఘాలతో ఒప్పందానికి వచ్చామని ప్రభుత్వం చాటుకుంది. పారిశ్రామిక సంబంధాల కోడ్ బిల్లును ఆమోదింప చేస్తామని హామీ కూడా ఇచ్చింది. కార్మిక నాయకులు కూడా అంగీకారం కుదిరిందీ లేనిదీ చెప్పలేదు. ఆ కోడ్ బిల్లుకు తమ ముందునాటి అభ్యంతరం ఏమైందన్నది కూడా స్పష్టం చేయలేదు. కార్మిక సంఘాల కార్యనిర్వాహక పదవుల్లో బయటవారు ఉండకూడదన్న ఆంక్ష విషయంలో పునః పరిశీలన జరపాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్ఎస్) కూడా జైట్లీకి సూచించింది. ఎన్నికల ముందు ఏడాదిలో ఆ బిల్లు విషయంలో ప్రభుత్వం మిన్నకుంటుందని చెప్పవచ్చు. సమాచార టెక్నాలజీ, ఇ –కామర్స్ రంగాలలో వేలాది మందికి ఉద్యోగాలు పోయే ప్రమాదం ఏర్పడింది.



సమాచార టెక్నాలజీ రంగంలో వ్యవస్థీకృత సంక్షోభం వల్ల దాదాపు లక్ష మందికి ఉద్యోగ ఉద్వాసన హెచ్చరికలు జారీ అయ్యాయి. అసలే కార్మిక లోకంలో అస్థిరత నెలకొంటున్న తరుణంలో సార్వత్రిక ఎన్నికల ఏడాది (2019) వేగంగా దూసుకొస్తోంది. ఆర్థిక వృద్ధి మృగ్యమై పతనం దశలో ఉన్న తరుణంలో కార్మిక చట్టం సవరణల పేరుతో లక్షలాది మందిని దూరం చేసుకోవడం ఎన్‌డిఎ ప్రభుత్వానికి ఇష్టం లేదని దీని వల్ల తెలుస్తోంది. గుజరాత్ ఎన్నికల్లో అది ప్రధాని స్వరాష్ట్రం అయినప్పటికీ ఓటర్లు బిజెపికి గుణపాఠం గట్టిగా చెప్పారు. ఈ నేపథ్యంలో మోడీ ప్రభుత్వం దూకుడు తగ్గించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. కార్మిక కోడ్ బిల్లులు ఇష్టానుసారం తెచ్చే వీలు ఇప్పట్లో లేదు. యూరోజోన్ సంక్షోభంవల్ల అనేక బిపిఒలు మూతపడ్డాయి. ఈ మూసివేతలు అనేక విధాన సంబంధమైన ప్రశ్నలను లేవనెత్తాయి. దేశంలో ఆర్థిక మాంద్యం వల్ల 10 లక్షల మంది పారిశ్రామిక కార్మికులు ఉద్యోగాలు కోల్పోయారు. అయినప్పటికీ నిరుద్యోగ భృతివంటి చిన్న ఊరట కల్పించే చర్యల గురించి కూడా ప్రభుత్వం యోచించడం లేదు. పశ్చిమ దేశాల్లో పారిశ్రామిక ఆటుపోట్లు సహజం కనుక నిరుద్యోగ భృతి ఇచ్చే ఆనవాయితీ ఎప్పటి నుంచో ఉంది. మన ఐటి కార్మికులకు కొత్తకొత్త సాంకేతిక విద్యలలో నైపుణ్యం అందించడానికి ప్రభుత్వ నిధులతో కార్యక్రమాలను జరపాల్సిన అవసరం కూడా ఉంది. ఈ విషయంలో కూడా ప్రభుత్వం నుంచి ఎటువంటి కదలికా లేదు. సాంకేతిక విజ్ఞానం మొత్తం మార్పు చెందుతున్న ప్రస్తుత తరుణంలో అటువంటి నైపుణ్య కల్పన చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలి.నోట్ల రద్దు కాలంలో కొన్ని నెలలపాటు అనేక లక్షల మంది ఉద్యోగాలు లేకుండా గడిపారు. అయినప్పటికీ వారికి మోడీ ప్రభు త్వం ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం చెల్లించలేదు. బ్యాంకు సిబ్బందిపై పనిభారం విపరీతంగా పెరిగింది. కానీ వారికి కూడా అదనపు చెల్లింపుగాని, నష్ట పరిహారంగాని లేదు. చేనేత, మరమగ్గాలకు చెందిన 10 లక్షల మంది జౌళి కార్మికులకు జిఎస్‌టి వలన బతుకు చిన్నాభిన్నమైంది. మోడీ ప్రభుత్వానికి అదిపెద్ద అంశమే కాదు. సంస్థల దివాళా నియమావళి అన్నది అనధికార మూసివేత విధానంగా మారింది. మోడీ తాజాగా బ్యాంకు డిపాజిట్లపై కన్నేసి తేదలచిన ఎఫ్ఆర్‌డిఐ బిల్లుపై కూడా బ్యాంకు సిబ్బంది పోరాట పంథా వైపు మళ్లుతున్నారు. మలాన్ని చేతులతో ఎత్తే పారిశుద్ధ్య పనివారి ఆనవాయితీని నిషేధించకుండా వృత్తి మూలంగా సంభవించే మరణాల సందర్భంలో వారికి నష్ట పరిహార మొత్తాన్ని పెంచాలని మోడీ ప్రభుత్వం ఆలోచిస్తోంది. అది ఒకరకంగా ఆ దుర్మార్గపు ఆనవాయితీకి ఆమోద ముద్ర వేయడమే అవుతుంది. బాల కార్మిక దుష్ట సాంప్రదాయాన్ని దృఢ చిత్తంతో నిరోధించడం మాని ఎన్‌డిఎ ప్రభుత్వం దానిని కొన్ని రంగాలలో కొనసాగేలా చేస్తోంది. గర్భిణీ స్త్రీలకు నగదు సదుపాయాన్ని ఇద్దరు పిల్ల ల బదులు ఒక బిడ్డకే పరిమితం చేయడం ద్వారా దానికి కూడా గండికొట్టింది. కాబట్టి రానున్న బడ్జెట్‌లో కార్మిక లోకం ఆశలను వెలిగించే చర్యలేవీ ఉండకపోవచ్చు.

* బి.శివరామన్

ముస్లిం సమాజంలో 'వర్ణవ్యవస్థ'!



డానీ
(సీనియర్ పాత్రికేయులు, సమాజ విశ్లేషకులు)
9010757776

బ్రాహ్మణ అనేది ఒక కులం పేరు. బ్రాహ్మణీయ అనేది ఒక సిద్ధాంతం పేరు. కుల అంతస్థులను (Caste Hierarchy) పాటించేవారిని బ్రాహ్మణీయ వాదులు అంటున్నాం. వర్ణవ్యవస్థలో నాలుగు అంతస్తుల గురించి మాత్రమే చెప్పినప్పటికీ వాటికి బయట మరో రెండు వర్ణాలున్నాయి; పంచములు, ఆదివాసులు. తరువాతి కాలంలో శూద్ర సమూహంలోనూ మార్పులొచ్చాయి. వారిలో కొందరు పై అంతస్తులకు చేరుకుని పెత్తందారీ కులాలుగా మారగా అత్యధికులు అతిశూద్రులుగా దిగువకు జారారు.

వర్ణవ్యవస్థ ఏర్పడేనాటికి ముస్లిం, క్రైస్తవ తదితర మతభావనలు మన దేశంలో లేవు. అయినప్పటికీ తరువాతి కాలంలో వాళ్ళకూ ఒక అంతస్తును కేటాయించి తనలో ఇముడ్చుకుంది వర్ణవ్యవస్థ. రైల్లో ప్రయాణించాలంటే ఏదో ఒక పెట్టెలో ఎక్కక తప్పదన్నట్టు వర్ణవ్యవస్థలో భాగం కావాలంటే ఏదో ఒక అంతస్తులో చేరి (చేర్చి) తీరాలి. ముస్లిం, క్రైస్తవ సమూహాలని బ్రాహ్మణీయవాదులు అతిశూద్రులుగా పరిగణిస్తారు. వెనుకబడిన కులాల అంతస్తులో హిందూ వెనుకబడిన కులాలకూ, ముస్లిం, క్రైస్తవులకు మధ్య ఒక పోటీ ఏర్పడడానికి కూడా కారణం ఇదే.

సాంస్కృతికంగా పుట్టుక రీత్యా ఒక సామాజికవర్గంకన్నా మరో సామాజికవర్గం గొప్పదనో తక్కువదనో భావించడమే బ్రాహ్మణీయవాదం. దీనివల్ల సామాజిక వ్యవస్థల మీద, సహజవనరుల మీద కొందరికి పుట్టుకరీత్యానే హక్కులు వస్తాయి. మిగిలిన వాళ్ళు ఆ రెండు వ్యవస్థల నుండి తొలగింపుకు గురవుతారు. కాలక్రమంలో స్వల్పమార్పులు చోటుచేసుకున్నప్పటికీ ఈ రకం పంపకాలే ప్రధానంగా వుంటాయి.

స్వతంత్ర భారత దేశంలో, అందులోనూ రాకెట్ యుగంలో ఇంకా కులమతాలు ఎక్కడున్నాయి అనే వాళ్ళు కొందరుంటారు. ఉత్పత్తిలో యంత్రాల ఉపయోగం పెరిగే కొద్దీ భద్రలోకంలో ఆశ కూడా పెరుగుతుంది. తమ అత్యాశను సాంస్కృతికంగా సమర్ధించుకోవడానికి వాళ్ళు వర్ణవ్యవస్థను సజీవంగా వుంచుతారు. కొత్త పద్ధతులలో గతంకన్నా క్రూరంగా మార్చడానికి దాని కోరలకు కొత్త పదును పెడతారు. ఈ క్రమాన్ని అర్థం చేసుకోవడం కొంచెం క్లిష్టమైన వ్యవహారమే. అయితే దీన్ని నిగ్గుతేల్చడానికి శాస్త్రీయ పరికరాలు లేకపోలేదు.

130 కోట్ల దేశ జనాభాలో ఒక్కొక్కరికి ఎంతెంత ఆస్తి వున్నదో లెక్కలు తీయండి. వాటన్నింటినీ కులాలు మతాల వారీగా ఒక అవరోహణ క్రమం (escending Order)లో పెట్టండి. అప్పుడు ఆ తిరగేసిన పిరమిడ్ ను విశ్లేషించండి. అత్యధిక సంపద బనియా సామాజికవర్గం చేతుల్లో వుందని తెలుస్తుంది. ఆ తరువాతి స్థానాల్లో బ్రాహ్మణ, క్షత్రియ, స్థిర శూద్ర సామాజికవర్గాలు వుంటాయి. ఆ తరువాతి స్థానాల్లో అతిశూద్ర సామాజికవర్గాలుంటాయి. కింది అంతస్థుల్లో దళిత, మతమైనారిటీ, ఆదివాసీ సామాజికవర్గాలుంటాయి. ఇదే క్రమంలో ఓ ఇరవై యేళ్ల, ఇంకా కచ్చితంగా చెప్పాలంటే 1991 నుండి ఛార్టులు తయారు చేస్తే మనకు ఇంకో విషయం తెలుస్తుంది. క్రమంగా సంవత్సరం వెంబటి సంవత్సరం కిందివారి సంపద తగ్గి పై అంతస్తులలోనికి చేరిపోతున్నదని గమనిస్తాం.

> అత్యధిక సంపద బనియా సామాజిక వర్గం చేతుల్లో వుందని తెలుస్తుంది. ఆ తరువాతి స్థానాల్లో బ్రాహ్మణ, క్షత్రియ, స్థిర శూద్ర సామాజికవర్గాలు వుంటాయి. ఆ తరువాతి స్థానాల్లో అతిశూద్ర సామాజికవర్గాలుంటాయి. కింది అంతస్థుల్లో దళిత, మతమైనారిటీ, ఆదివాసీ సామాజికవర్గాలుంటాయి.

దీన్ని ఇంకో విధంగానూ నిర్ధారించవచ్చు. మన దేశంలో 1991లో ఆర్థిక సంస్కరణలు ప్రవేశించాయి. ఆ తరువాత ప్రపంచ వ్యాప్తంగా డంకెల్ ఆర్థికశాస్త్రం అమల్లోనికి వచ్చింది. అప్పటి నుండి ఇప్పటి వరకు జరిగిన స్కామ్ లను మొత్తాల వారీగా, కులాల వారీగా ఒక అవరోహణ క్రమం (escending Order) లో పెట్టండి. ఈ తిరగేసిన పిరమిడ్ లోనూ బనియా, బ్రాహ్మణ, క్షత్రీయ, స్థిర శూద్ర సామాజిక వర్గాలు పై అంతస్తుల్లో కనిపిస్తాయి. అతిశూద్ర, దళిత, మతమైనారిటీ, ఆదివాసీ సామాజికవర్గాలు కింది దొంతర్లలో కనిపిస్తాయి. ఇంతకన్నా రుజువేం కావాలీ మన దేశంలో ఇప్పటికీ బ్రాహ్మణీయ వర్ణవ్యవస్తే సజావుగా, గతంకన్నా దృఢంగా వున్నదని చెప్పడానికీ? దేశంలో మనుస్మృతియే అనధికార రాజ్యాంగంగా కొనసాగుతున్నదని చెప్పడనికీ?

దేశంలో వేల కులాలుండగా కేవలం బ్రాహ్మణ కులం పేరుతో వర్ణవ్యవస్థను నిందించవచ్చా అని అడగడం సమంజసమైన ప్రశ్నే. వర్ణవ్యవస్థను పౌరస్మృతిగానేగాక, వర్ణసంక్రమణాన్ని నేరస్మృతిగా మార్చిన మనువే ఆ పనిచేశాడు. ఏ వర్ణాన్ని ఏ అంతస్తులో వుంచాలో నిర్ణయించడానికి మనువు బ్రాహ్మణ సామాజికవర్గాన్ని కొలబద్దగా పెట్టుకున్నాడు. వాళ్ళను భూమి మీద భగవంతునికి ప్రతినిధులుగా చిత్రించాడు. బ్రాహ్మణ సామాజికవర్గానికి దగ్గరగా వుండాల్సిన సామాజికవర్గాలకు పై అంతస్తులు కేటాయించాడు. బ్రాహ్మణ సామాజికవర్గానికి దూరంగా వుండాల్సిన సామాజికవర్గాలకు కింది అంతస్తులు కేటాయించాడు. అంచేత వర్ణవ్యవస్థ సమర్ధన వాదం అని చెప్పినా బ్రాహ్మణీయ వాదం అని చెప్పినా, హిందుత్వ అని చెప్పినా అర్థం దాదాపుగా ఒక్కటే.

బ్రాహ్మణులను మాత్రమే వర్ణవ్యవస్థ సమర్ధన వాదులు, బ్రాహ్మణీయవాదులు అనడం కూడా తప్పు. నిర్దిష్టంగా పరిశీలిస్తే బ్రాహ్మణీయవాదులు బ్రాహ్మణ కులంలోనూ కనిపిస్తారు; బ్రాహ్మణేతర కులాల్లోనూ కనిపిస్తారు. అలాగే బ్రాహ్మణుల్లోనూ వర్ణవ్యవస్థ వ్యతిరేకులూ వుంటారు. దీనిని వ్యక్తిగత స్థాయిలో నిర్ణయించాలేగానీ మూకుమ్మడి ప్రకటన సాధ్యంకాదు.

తాత్విక మిత్రుడు శ్రీవత్స గడియారం ఒక కీలక ప్రశ్న వేశాడు. 'బ్రాహ్మణీయ' కాని భావజాలం మరొకటి వుందా?!!అంటూ. వేలసంవత్సరాలుగా బ్రాహ్మణీయ వాతావరణంలో వుండిపోవడంవల్ల ఆధిపత్య కులాల్లోనేగాక అణగారిన కులాల్లోనూ బ్రాహ్మణీయ భావజాలం ఇంకిపోయింది. వర్ణవ్యవస్థలోనే ఆ లక్షణం వుంది. ఏ అంతస్తులో వున్నా సరే అందరికీ ఒక తృప్తి, ఒక అసంతృప్తి వుంటుంది. తమకన్నా పై అంతస్తులోని సమూహం తమను తక్కువగా చూడడం ఎవరికైనా బాధాకరమే. అయితే తమకన్నా కింది అంతస్తులోని సముహాన్నీ చూసి వాళ్ళకన్నా తాము గొప్పవాళ్లమని అనుకోవడం వాళ్లకు ఒక సంతృప్తి నిస్తుంది.

బ్రాహ్మణ సామాజికవర్గానికి పై అంతస్తులో ఎవరూ వుండరు కనుక వాళ్లకు సంతృప్తేతప్ప అసంతృప్తి వుండదు. అలాగే అట్టడుగు అంతస్తులో వున్న వాళ్లకు దిగువన ఇంకెవరూ వుండరు కనుక వాళ్ళకు అసంతృప్తితప్ప సంతృప్తి వుండదు. అందుకే కింది అంతస్తులోని సమూహాలకు సహితం ఒక సంతృప్తిని అందించడానికి వాళ్ళ కింద ఇంకో కొత్త అంతస్తును నిర్మించే ప్రక్రియ ఎప్పుడూ సాగుతూ వుంటుంది. వర్ణవ్యవస్థకు ఇదొక అంతర్గత అవసరం. అలా అట్టడుగున నిర్మించే అంతస్తులోనికి ముస్లిం సామాజికవర్గాన్ని తోసే ప్రక్రియ ఇటీవలి కాలంలో చాలా వేగంగా సాగుతున్నదని సులువుగా గమనించవచ్చు.

ఇంతటి దయనీయ స్థితిలో ముస్లిం సమాజానికి సంతృప్తి కాకపోయిన ఒక నిట్టూర్పుగా అయినా పనికొచ్చే అంశం ఏమిటీ? తాము సహితం వర్ణవ్యవస్థలోనికి చేరిపోవడం!. భారత ముస్లిం సమాజంలోని విభిన్న తెగల కూర్పు సమాంతరం (Horizantal) గా వుంటుందా? నిలువు (Vertical) గా వుంటుం దా? అన్నది ఒక పెద్ద చర్చ. సయ్యద్, పఠాన్, బేగ్, మొఘలాయి, షేక్, లద్దాఫ్, నూర్ బాష, పథర్ ఫోడు తదితర శాఖలు లేదా తెగల మధ్య సాంస్కృతిక నిచ్చెన మెట్ల వ్యవస్థకు ఇస్లాంలో ధార్మిక సమర్ధనలేదు.

ఇలాంటి ధార్మిక చైతన్యం ప్రభుత్వ ఉద్దీపన చర్యలకు విరుద్ధం. ఉద్దీపన చర్యలు లేకుండా మనుగడ సాగించలేని ఆర్థిక స్థితి భారత ముస్లింలది. ప్రభుత్వ ఉద్దీపన చర్యల్ని పొందాలంటే తమ సమాజంలో నిలువు అంతస్తుల వ్యవస్థ కొనసాగుతూ వుందని ప్రకటించి తీరాలి. మరో మాటల్లో చెప్పాలంటే తాము వర్ణ/ కుల వ్యవస్థను ఆచరిస్తున్నట్టు ప్రకటించాలి. బ్రాహ్మణీయ వ్యవ స్థ తను వ్యాపించిన ప్రతిచోటా తనను పోలిన సమాజాన్ని నిర్మిస్తుంది!.

ఆ నలుగురి ధర్మయుద్ధం

నలుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు దేశ న్యాయ వ్యవస్థ చరిత్రలో ఎన్నడూ లేనట్లుగా విలేకరుల గోష్టిని ఏర్పాటు చేసి ప్రధాన న్యాయమూర్తిపై ఆరోపణలు చేయడాన్ని న్యాయ వ్యవస్థకు చెందిన చాలా మంది ప్రశంసించారు. అది చరిత్రాత్మకమని అభివర్ణించారు. అయితే కొందరు ఆ న్యాయమూర్తుల ఫిర్యాదుల్లో స్పష్టత లేదని పెదిమ విరిచారు. న్యాయ వ్యవస్థలోని లోటుపాట్లను తెరమీదకు తేవడంపట్ల చాలా మంది ప్రజలు కూడా సానుకూలంగా స్పందించారు. జస్టిసెస్ జె. చలమేశ్వర్, రంజన్ గొగోయ్, మదన్ బి లోకూర్, కురియన్ జోసెఫ్ 12వ తేదీ నాడు విలేకరుల గోష్టిలో ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాపై నేరుగా ఆరోపణలు చేశారు. న్యాయాన్ని అందించడంలో, కేసులను కేటాయించడంలో ప్రభుత్వ ప్రయోజనాలకు అనుగుణంగా ప్రధాన న్యాయమూర్తి వ్యవహరిస్తున్నారన్నది వీరి ప్రధాన ఆరోపణ.

సిబిఐ జడ్జి బి.హెచ్ లోయా మృతి కేసును జూనియర్ జడ్జీలతో కూడిన బెంచ్‌కు అప్పగించడం ఇందుకు తాజా ఉదాహరణని వారు పేర్కొన్నారు. అసలు ఈ కేసుపైనే న్యాయవ్యవస్థమీద నిప్పులు చెరగడం చోటు చేసుకొంది. ఈ అంశం తుదకు న్యాయ వ్యవస్థ పరిధిలోనే పరిష్కారం కావల్సి ఉండగా ఆ న్యాయమూర్తులు అస్పష్ట ఆరోపణలను చేయడం సబబు కాదని కొందరు జడ్జీలు, న్యాయ వాదులు వ్యాఖ్యానించారు. భారత ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా సారథ్యంలోని ఐదుగురు సభ్యుల కొలీజియంలో జెస్టిసెస్ చలమేశ్వర్, గొగోయ్, లోకూర్, జోసెఫ్ ఉన్నారు. వారు జస్టిస్ మిశ్రాకు రాసిన ఒక లేఖను కూడా బయటపెట్టారు. అందులో వారు తమ ఉద్దేశాలను వెల్లడించడాన్ని చాలా మంది సీనియర్ న్యాయవాదులు ప్రశంసించారు.

జస్టిస్ లోయా మృతి కేసు కీలకం

న్యాయమూర్తి లోయా మరణంపై రేకెత్తిన అనుమానాల నివారణకు స్వతంత్ర దర్యాప్తు జరపాలని 12వ తేదీన కూడా పిటిషన్లు దాఖలయ్యాయి. 2004 నాటి సొహ్రాబుద్దీన్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో ప్రస్తుత బిజెపి జాతీయ అధ్యక్షుడు, నాటి గుజరాత్ హోం మంత్రి అమిత్ షా తో సహా అనేక మంది పోలీసు అధికార్లు నిందితులుగా ఉన్నారు. న్యాయ వ్యవస్థలో లోటుపాట్లు నలుగురు న్యాయమూర్తులు విలేకరుల గోష్ఠి పెట్టేదాకా రావడాన్ని దురదృష్టకరమైనదిగా సీనియర్ అడ్వకేట్ కామినీ జైస్వాల్ పేర్కొన్నారు. ఇది న్యాయ వ్యవస్థకు దుర్దినమని అన్నారు.

'ఇంతకాలం జడ్జీలను ఆయా ధర్మాసనాలకు వర్గీకరణ ప్రకారం నియమించడం ఆనవాయితీగా ఉంది. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి తలకిందులయింది. ముఖ్యమైన అంశాలకు సంబంధించిన అన్ని కేసులు ఒకే కోర్టుకు కేటాయించబడుతున్నాయి. ఇందులో సీనియర్ జడ్జీలను నిర్లక్ష్యం చేయడం జరుగుతోంది. ప్రతిరోజూ సీనియర్ జడ్జీలను అవమానించడం జరుగుతోంది. జస్టిస్ చలమేశ్వర్ తీవ్రంగా ఇటువంటి నిర్లక్ష్యానికి ఒక కేసులో గురయ్యారు. ఆయన ఐదుగురు సీనియర్ మోస్ట్ జడ్జీలో కూడిన రాజ్యాంగ బెంచ్ విచారించాలని అభిప్రాయపడిన కేసును తమకు తోచిన బెంచ్‌కి అప్పగించి డిస్మిస్ చేయడం జరిగింది' అని జైస్వాల్ ఉదహరించారు.

దేశ ప్రయోజనాలను పట్టించుకోకుండా ఇష్టానుసారం కేసుల అప్పగింత (రోస్టర్ అమలు) జరుగుతోందని ఆ నలుగురు న్యాయమూర్తులు సిజెఐ జస్టిస్ మిశ్రాకు రాసిన లేఖలో వెల్లడించినట్లు పేర్కొన్నారు. 'ఖాలికోపుల్ ఆత్మహత్య కేసును ఒక జూనియర్ జడ్జి కోర్టుకు అప్పగించడం జరిగింది. అది చాలా తీవ్రమైన కేసు కావడంతో అలా నీరు కార్పించారు. సహారా– బిర్లా డైరీ కేసును కూడా సీనియర్ జడ్జికి అప్పగించ లేదు. ఆ డైరీ లో అనేక మంది కీలక వ్యక్తుల ప్రమేయం ఉన్న అవినీతి ఉదంతాల వివరణ ఉంది' అని కామినీ జైస్వాల్ ఉదహరించారు. కొందరు జడ్జీలు న్యాయ వ్యవస్థ కోసం ఉండగా, మరి కొందరు తమ స్వార్థం కోసమే ఉన్నారు' అని జైస్వాల్ వివరించారు. 'ఆ వ్యవస్థ ఒత్తిళ్ల కింద పతనం అవడం ప్రస్తుతం జరుగుతోంది. ఒక ఏడాది కాలం నుంచి ఇలాగే సాగుతోంది. తన ప్రయోజనాలకు అంకితం అయి పనిచేసే న్యాయ వ్యవస్థ ప్రభుత్వానికి కావాలి. ఈ విషయాలన్నీ ఇప్పుడు ప్రజలకు బహిర్గతమయ్యాయి' అని ఆమె జడ్జీల విలేకరుల గోష్టిపై వ్యాఖ్యానించారు.

ఎంఒపి ఖరారు పట్టని సర్కార్

కేసులను వివిధ కోర్టులకు, బెంచ్‌లకు కేటాయించడంలో అనుసరించే ఎంఒపి (మెమొరాండం ఆఫ్ ప్రొసీజర్) ని ఐదుగురు న్యాయమూర్తుల కొలీజియం 2017 మార్చిలో ఖరారు చేయగా కేంద్రం ఇంత వరకు ప్రతిస్పందించకపోవడాన్ని ఆమె తప్పుబట్టారు. అసలు కేంద్ర ప్రభుత్వం ఎంఒపి ఖరారులో ప్రమేయం కల్పించుకొని ఉంటే బాగుండేదన్నారు. జస్టిస్ గొగోయ్ వచ్చే అక్టోబర్‌లో ప్రధాన న్యాయమూర్తి కానున్న పరిణామాన్ని ఆమె స్వాగతించారు. అయితే న్యాయ వ్యవస్థ దిగజారుడు ప్రమాణాలు ఘోరంగా ఉండడంతో కొన్ని నెలలు ఆగలేక తక్కిన నలుగురు జడ్జీలు విలేకరుల గోష్టి ద్వారా ప్రజల ముందుకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. ప్రస్తుత సంక్షోభాన్ని జస్టిస్ లోయ హత్య కేసు పతాక స్థాయికి చేర్చింది. ఎంఒపి ఆమోదం ప్రక్రియ పూర్తి కాకపోవడం ఆయా శాఖల ఇన్‌చార్జీలుగా ఉన్న న్యాయమూర్తుల తప్పిదమని సీనియర్ అడ్వొకేట్ అమన్ లేఖి అన్నారు. జడ్జీల మధ్య ఒకరి ముఖంలోకి ఒకరు సూటిగా చూసుకోలేని పరిస్థితులు ఉన్నాయన్నారు.

జడ్జీలకు తప్పనిసరి అయింది: ప్రశాంత్ భూషణ్

పరిస్థితి చేయిదాటిపోయే విధంగా పరిణమించడం వల్లే ఆ న్యాయమూర్తులు ప్రజల ముందకు వెళ్లారని సీనియర్ అడ్వొకేట్ ప్రశాంత్ భూషణ్ వ్యాఖ్యానించారు. దేశ ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా ఇష్టానుసారం అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. ముఖ్యంగా జస్టిస్ లోయా మృతిపై ధైర్య సాహసాలు గల దర్యాప్తు అధికారిని నియమించి విచారణ జరపాలని ఆయన కోరారు. 2017లో 'మెడికల్ కుంభకోణం' కేసులో సుప్రీం కోర్టు వ్యవహరిస్తున్న తీరుపై జస్టిస్ మిశ్రాకు భూషణ్ ఫిర్యాదు చేశారు. అటువంటిదే మరో కేసు వేరే బెంచ్‌కు ఇవ్వడం జరిగింది. తాజాగా నలుగురు జడ్జీల నిరసన మన న్యాయ వ్యవస్థపై నీలినీడలు ప్రసరింపచేసినందువల్ల తక్షణ దిద్దుబాటు చర్యలు అవసరమని ఆయన అన్నారు.

సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి కెఎస్ రామకృష్ణన్ వ్యాఖ్యానిస్తూ రోస్టర్ అధికారాలు ప్రధాన న్యాయమూర్తి వద్దనే ఉండాలని లేనిపక్షంలో అనూహ్య పర్యవసానాలు ఏర్పడతాయని హెచ్చరించారు. జస్టిస్ మిశ్రాకు ఆ నలుగురు జడ్జీలు రాసిన లేఖలో ఏ ఫిర్యాదూ స్పష్టంగా లేదని ఆయన వ్యాఖ్యానించారు. ఆ నలుగురు న్యాయమూర్తులు పూర్తి వివరాలతో ముందుకు రావాలని డిమాండ్ చేశారు. సుప్రీం న్యాయమూర్తుల విలేకరుల గోష్టితో ఎలాగూ నష్టం జరిగిపోయింది కనుక అసలు ఏమి జరిగిందో సవివరంగా ఇప్పుడైనా వివరించాలని కోరారు. ఇటీవల దారి తప్పిన జ్యుడీసియరీని మళ్లీ దారిలో పెట్టడానికి మొత్తం మీద నలుగురు సుప్రీం కోర్టు న్యాయమూర్తులు ప్రజల ఎదుటకు వచ్చి ధర్మ పీఠం దద్దరిల్లేలా చేశారు.

* అనూ భుయన్, గౌరవ్ వివేక్

ప్రతి ఆదివారం ప్రజాజీవన ప్రతిబింబం
మన తెలంగాణ
మన
www.manatelangana.news
మనపేజీ మనందరిపేజీ
హైదరాబాద్ | ఆదివారం | 14 జనవరి | 2018

చదవడం, రాయడమైనా నేర్పని

ప్రాథమిక మిథ్య

బడుగు బాలలకు శాపంగా మారిన బడులు

2016వ సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల కనీస విద్యా సామర్థ్యాల సాధన ప్రగతిని బేరీజు వేయడానికి మానిటరింగ్ బృందాలు ఏర్పడ్డాయి. ఈ బృందాలు రాష్ట్రంలోని 1368 పాఠశాలలను పరిశీలించాయి. అందులో394 ప్రాథమిక, 116 ప్రాథమికోన్నత, 401 ఉన్నత, 109 కె.జి.బి.వి.,57 ఆదర్శ, 56 రెసిడెన్షియల్, 235 ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను పరీక్షించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించాయి. 48 శాతం ప్రాథమిక, 46 శాతం ప్రాథమికోన్నత, 42 శాతం ఉన్నత పాఠశాలల విద్యార్థులకు కనీస సామర్థ్యాలు లేవని ముఖ్యంగా తెలుగు చదవడం, రాయడం రాదని ఈ నివేదిక తేల్చి చెప్పింది. ఈ బృందాలు ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు, సి.సి.ఇ., అకడమిక్ క్యాలెండరు అమలు, పాఠ్య పుస్తకాల పంపిణీ, ఉపాధ్యాయుల బోధనా అభ్యాసాల ప్రక్రియలు, ప్రధానోపాధ్యాయుల నాయకత్వ లక్షణాలు వంటి పలు అంశాలపై విశ్లేషించి తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదించాయి. అన్ని నివేదికల మాదిరిగానే ఈ నివేదికపై కూడా చర్యలు తీసుకోలేదని విద్యార్థుల కనీస సామర్థ్యాలను తాజాగా పరిశీలిస్తే రుజువవుతుంది. ఒక కొసమెరుపు ఏమిటంటే రాష్ట్రవ్యాప్తంగా పరిశీలించిన 1368 పాఠశాలలకు గాను కేవలం 37 స్కూళ్ల ఉపాధ్యాయులను అభినందించాలని కూడా నివేదికలో సూచించారు.

పిల్లలు పడుతూ లేస్తూ నడక నేరుస్తారు, మాటలు నేర్చుకుంటారు, పెద్ద అవుతున్న కొద్దీ టివి చూసి స్టెప్పు వేసి డాన్స్ నేర్చుకుంటారు, స్నేహితులతో కలసి చెట్లు ఎక్కడం తెలుసుకుంటారు, సైకిలు తొక్కడం నేర్చుకుంటారు, నేర్పుతారు కూడా, ఆటల నియమాలు తెలుసుకుంటారు. కొన్నిసార్లు వాళ్లే నియమాలను ఏర్పరుస్తారు. అమ్మ నాన్నలు, అన్నలు, అక్కల నుండి పాటలు నేర్చి ఇంకా మంచి రాగాలు అల్లుకొని పాడుతారు. తమ ఊహల ప్రపంచాన్ని బొమ్మల రూపంలో వేసి ఆనందిస్తారు. గోలీలాటలో గురి చూసి కొట్టడం, కబడ్డీ ఆటలో వొడుపుగా పట్టడం, ఎదుటి వారిని చిత్తు చేసే ఎత్తుగడ వేయడం నేర్చుకుంటారు. ఇన్ని విద్యలు నేర్వగలిగిన పిల్లలకు ముఖ్యంగా బడుగు బలహీన వర్గాలలోని అధిక శాతం పిల్లలకు మన బడులలో నిష్ణాతులైన గురువులున్నారు. అయినా ఈ పిల్లలు తెలుగు భాషను చదవడం రాయడంలో చాలా వెనుకబడుతున్నారు. గురువులు లేకున్నా ఏకలవ్యులలా అన్ని విద్యలు నేర్చిన ఈ పిల్లలు సంవత్సరాలుగా అదే పనిగా బడికి వస్తున్నా వీరికి అప్పటివరకు సుశిక్షితులైన ఉపాధ్యాయులు, రాష్ట్ర స్థాయి నుండి పాఠశాల వరకు ఎంతో అనుభవమున్న విద్యా యంత్రాంగం ఉండి కూడా వారికి సరైన చదువు నేర్పకపోవడానికి కారణం ఏమై ఉంటుందో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ఆలోచించాల్సిన అవసరం ఉంది.

బడికి కొన్ని సంవత్సరాలుగా వస్తున్న పిల్లలకు చదవడం రాయడం రావడం లేదని పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ప్రతి ఏటా ప్రభుత్వాలకు నివేదికలు సమర్పిస్తూనే ఉన్నాయి. ఈ నివేదికలు విడుదలైనప్పుడు జరిగే హడావిడి అంతా ఇంతకాదు. ఆ తర్వాత అందరూ మరిచిపోతారు. మళ్ళీ ఇంకో నివేదిక వచ్చేవరకు పాత నివేదికలలో ఉన్న లోపాలను సరి చేస్తామన్న ప్రసక్తి ఉండదు. సిఎల్ఐపి (CLIP), సిఎల్ఏపి(CLAP), ఎల్ఇపి (LEP), 3ఆర్స్ (3Rs) అని పలు పేర్లతో సంవత్సరానికి ఒక కొత్త కార్యక్రమం జరుపుతారే తప్ప రాయడం చదవడంలో వెనుకబడ్డ పిల్లలు ఆయా తరగతి సామర్థ్యాలను అందుకోవడానికి సిద్ధంగా ఉన్నారా లేదా అనే విషయాన్ని బేరీజు వేయకుండానే ఆయా తరగతుల సిలబస్ పూర్తి చేసే పనిలో యావత్ విద్యా వ్యవస్థ మునిగి ఉంటుంది పిల్లల సామర్థ్యాలను బొత్తిగా దృష్టిలో ఉంచుకోరు. ఇన్ని సంవత్సరాలు గా చదువు చెప్పడంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన విద్యా వ్యవస్థ అకస్మాత్తుగా తేరుకొని పదవ తరగతి పరీక్షల విషయంలో చేసే హడావిడి, సమీక్షలు, డైరెక్టర్ స్థాయి మొదలు కొని, కలెక్టర్లు, జిల్లా విద్యాధికారులు ఉన్నత పాఠశాల ప్రధాన అధ్యాపకుల మీద పెట్టే ఒత్తిడి అంతా ఇంతా కాదు. ఇది ప్రతి విద్యా సంవత్సరంలో జరుగుతున్న తతంగమే. ఇప్పుడు పదవ తరగతికి వచ్చిన పిల్లలు కూడా మూడు లేదా నాలుగవ తరగతి విద్యా ప్రమాణాలను సాధించలేకపోతున్నారు. లక్షలాది మంది పిల్లలు ఆత్మన్యూనతా భావానికి గురవుతున్నారు. వారిలో పుట్టుకతో వచ్చిన సృజనాత్మకత సన్నగిల్లుతున్నది. 6వ సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల కనీస విద్యా సామర్థ్యాల సాధన ప్రగతిని బేరీజు వేయడానికి మానిటరింగ్ బృందాలు ఏర్పడ్డాయి. ఈ బృందాలు రాష్ట్రంలోని 1368 పాఠశాలలను పరిశీలించాయి. అందులో394 ప్రాథమిక, 116 ప్రాథమికోన్నత, 401 ఉన్నత, 109 కె.జి.బి.వి.,57 ఆదర్శ, 56 రెసిడెన్షియల్, 235 ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను పరిశీలించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. 48 శాతం ప్రాథమిక, 46 శాతం ప్రాథమికోన్నత, 42 శాతం ఉన్నత పాఠశాలల విద్యార్థులకు కనీస సామర్థ్యాలు లేవని ముఖ్యంగా తెలుగు చదవడం, రాయడం రాదని ఈ నివేదిక తేల్చి చెప్పింది. ఈ బృందాలు ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు, సి.సి.ఇ., అకడమిక్ క్యాలెండరు అమలు, పాఠ్య పుస్తకాల పంపిణీ, ఉపాధ్యాయుల బోధనా అభ్యాసాల ప్రక్రియలు, ప్రధానోపాధ్యాయుల నాయకత్వ లక్షణాలు వంటి పలు అంశాలపై విశ్లేషించి తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదించాయి. అన్ని నివేదికల మాదిరిగానే ఈ నివేదికపై కూడా తగు చర్యలు తీసుకోలేదని విద్యార్థుల కనీస సామర్థ్యాలను తాజాగా పరిశీలిస్తే రుజువవుతుంది. ఒక కొసమెరుపు ఏమిటంటే రాష్ట్రవ్యాప్తంగా పరిశీలించిన 1368 పాఠశాలలకు గాను కేవలం 37 స్కూళ్ల ఉపాధ్యాయులను అభినందించాలని కూడా నివేదికలో సూచించారు.ఈ సంవత్సరం కూడా చదవడం, రాయడం రాని పిల్లలకు 3ఆర్స్ (రీడింగ్, రైటింగ్, అర్థమెటిక్) కార్యక్రమం చేపట్టినా అది సక్రమంగా అమలు కాలేదని ఇటీవల పాఠశాల విద్యా కమిషనర్ చేసిన సమీక్షలో తెలిసింది.

ఈ మధ్య 16 జిల్లాలలో తొమ్మిది, పది తరగతులకు చెందిన సుమారు 400 మంది విద్యార్థులకు నాలుగవ తరగతి సామర్థ్యాలు గల నమూనా పత్రాలను ఇచ్చి మూల్యాంకనం చేశారు. ఇందులో కేవలం 68 మంది విద్యార్థులు మాత్రమే రాయడం చదవడం ప్రక్రియలను చేశారు. మిగిలిన విద్యార్థులకు రాయడం చదవడం రాలేదు. ఉదాహరణకు ఈ మూల్యాంకనంలో నక్షత్రం, కంప్యూటర్ బొమ్మలు వేసి వాటి పేరు రాయమని అడిగిన ప్రశ్నకు చాలా మంది పదవ తరగతి విద్యార్థులు జవాబు రాయలేక పోవడం గమనించవలసిన అంశం. ఇది నిజంగా మన విద్యా వ్యవస్థ పతన ధోరణికి అద్దం పడుతుంది. ఈ ఒక్క ప్రయోగంలోనే కాదు రాష్ట్రం లో చాలా సార్లు జరిగిన విద్యార్థుల మూల్యాంకనాలో ఇంచు మించు ఇలాంటి ఫలితాలే వచ్చాయి.

విద్యార్థులు తమ తరగతుల స్థాయి కన్నా అతి తక్కువ స్థాయిలో ఉండడం నిజంగా చాలా బాధకరంగా తోచింది. చాలా మంది విద్యార్థులు చిన్న చిన్న బొమ్మలు చూసి వాటి పేర్లను రాయలేకపోయారు. ద్విత్వాక్షరాలతో వచ్చే పదాలను అయితే రాయడంలో చాలా ఇబ్బంది పడ్డారు. వత్తులు లేని సరళ పదాలతో కూడిన చిన్న వాక్యాలను చదువలేకపోయారు. గత తొమ్మిది సంవత్సరాలుగా ఈ పిల్లలు బడులకు వస్తూనే ఉన్నారు. వీరి మూల్యాంకనలు చేస్తూనే ఉన్నారు కానీ వీరి సామర్థ్యాలను పెంచడం లో మన విద్యా వ్యవస్థ పూర్తిగా విఫలమైందనే చెప్పాలి. రాష్ట్రంలో తెలుగు మాధ్యమంలో చదువుతున్న 24 లక్షల మంది విద్యార్థులలో అధిక శాతం మంది ఆయా తరగతులకు అవసరమైనస్థాయిలో చదవడం రాయడం రాని వారే. వారి గురించే చర్చ. ఈ పరిస్థితి ప్రభుత్వ, ప్రైవేటు బడులలో కూడా ఇలాగే ఉందని గమనించాలి. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు బడిలో ఒక బాలునికి నూటికి తొంబై మార్కులు వేస్తూ ఒక తరగతి నుండి పై తరగతికి పంపిస్తూ ఒక్కో తరగతికి ఫీజులు పెంచుతూ తల్లిదండ్రులను మోసపుచ్చిన ఉదంతం మా దృష్టిలోకి వచ్చింది. ఫీజులు అధికంగా ఉన్నాయని భరించడం లేకపోతున్నామని ఆ తల్లి తన కొడుకుని ప్రభుత్వ బడిలో ఏడవ తరగతిలో చేర్పించడానికి వెళ్ళినపుడు అక్కడి ప్రధానోపాధ్యాయుడు చిన్న పరీక్ష పెట్టారు. ఆ పరీక్షల్లో ఆ బాలుడి అజ్ఞానం, అసమర్థత బయటపడడంతో ఆ తల్లి పడిన మనోవేదన చెప్పడానికి అవివేకానది. గత ఆరు సంవత్సరాల రిపోర్టు కార్డులన్నీ తెచ్చి టీచరుకు చూపించి ఆమె చాలా బాధపడింది. అన్ని రిపోర్టు కార్డులను. ప్రభుత్వ ఉపాధ్యాయుడు పెట్టిన పరీక్ష పత్రాన్ని తీసుకొని ప్రైవేటు బడికి పోయి గట్టిగా నిలదీయగా ఆ టీచరు చెప్పిన సమాధానం తో కంగు తినడం ఆ తల్లి వంతైంది. పిల్లలందరికి 9 లేదా ఆపైననే మార్కులు వేయాలని అప్పుడే తల్లిదండ్రులు మన పాఠశాల బాగా చెపుతున్నదని భావించి ఫీజులు చెల్లిస్తారని ఉపాధ్యాయులకు యాజమాన్యం సూచించినట్లు ఆ ప్రైవేటు టీచరు చెప్పడం నిజంగా మన పిల్లలను మనం ఎంత అంధకారంలో ఉంచుతున్నామో తెలియజేస్తున్నది. ఈ పరిస్థితికి కారణాల గురించి రాష్ట్ర విద్యా శాఖ అధికారులను అడిగితే దీనికి బాధ్యులు జిల్లా అధికారులని, ఉపాధ్యాయులని కొందరు ఇంకా ఒక అడుగు ముందుకేసి పాస్ ఫెయిల్ విధానం లేనందుకేఇలా జరుగుతున్నదని సమాధానం వస్తుంది. బడికి వస్తున్న పిల్లలకు చదువు నేర్పక పోగా వారిని ఫెయిల్ చేయాలనే వాదన విచిత్రంగా ఉంటుంది. ఫెయిల్ అయిన విద్యార్థులు చదువుకు దూరమవుతారు తప్ప చదవరని గమనించాలి. అయినా ఫెయిల్ విధానాన్ని అమలుచేస్తే మన బడులు 90 శాతం ఖాళీ అవుతాయి. ఆపాటిదానికి ఇంత పెద్ద యంత్రాంగమే అవసరం లేదని భావిస్తారు. విద్యా వ్యవస్థలో ఉన్న వేల మంది అధికారులు, ఉపాధ్యాయులు ఇంటికి పోవలసిన పరిస్థితి తలెత్తుతుంది. తల్లిదండ్రులు ఈ విషయమై చాలా ఆందోళనకు గురి అవుతున్నారు. పిల్లలు అటూ ఇటూ కాకుండా పోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎవరిని అడగాలో తెలియని పరిస్థితి. ఉపాధ్యాయులను అడిగితే తమ తప్పు కాదు పిల్లల తప్పని ఇంకా గట్టిగా అడిగితే తల్లిదండ్రులుగా మీ బాధ్యత కూడా ఉందని వారు వాగ్వివాదానానికి దిగడంతో చేసేది లేక తమ బతుకులకు అంత చదువు రాదేమో అనే నిస్పృహతో తల్లిదండ్రులు వెనుదిరిగిన సంఘటనలు అనేకం. ఇంకా కొన్ని ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి ఉత్తీర్ణత శాతం పెరగాలని ప్రభుత్వ నుండి వస్తున్న ఒత్తిడి తట్టుకోలేక ప్రధాన ఉపాధ్యాయులు చదువులో వెనక బడిన పదవ తరగతి పిల్లలకు టిసిలు ఇచ్చి హాజరు పట్టిక నుండి తొలగించి ప్రైవేటుగా పరీక్షలు రాసుకోమని సెలవిస్తున్నారు. తమ ఇష్టపూర్తిగానే టిసి తీసుకుంటున్నట్లు ఒక హామీ పత్రం కూడా తల్లిదండ్రులచేత రాయించుకుంటున్నారు. పది సంవత్సరాలుగా బడికి వస్తున్నా చదవడం, రాయడం విషయంలో పట్టించుకోకుండా, నిర్లక్ష్యం వహించి ఒక్క సారిగా పదవ తరగతిలో అందరూ పాస్ కావాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచడం విచిత్రమైన విషయం. పిల్లలకు సరి అయిన బోధన అందుతుందా లేదా అనే విషయాన్ని ప్రాథమిక స్థాయిలోనే గమనించ కుండా పదవ తరగతి ఫలితాలు రావు, చదవడం రాయడంలో ప్రాథమిక తరగతులలోనే విద్యార్థికి పటిష్ఠమైన పునాది పడుతుందని నివేదికలు,పరిశోధనలు తెలుపుతున్నాయి. ఈ దుస్థితి అంతటికీ ఉపాధ్యాయులపై బోధనేతర పనుల ఒత్తిడి ఒక ముఖ్య కారణంగా బయటకు వస్తున్నది. మధ్యాహ్న భోజనం లెక్కలు, మండల సమావేశాలు, ట్రైనింగులు వంటి అన్ని పనులతో విద్యార్థుల సామర్థ్యాలను పెంచడానికి సరియిన సమయం ఉపాధ్యాయులకు దొరకడం లేదని వాపోతున్నారు. ఉపాధ్యాయులు ఎలాంటి భోదనేతర పనులు చేయరాదని విద్యాహక్కు చట్టం స్పష్టంగా పేర్కొన్నది. కేవలం ఎన్నికల నిర్వహణ, ప్రకృతి వైపరీత్యాలు, జనాభా లెక్కలు తప్ప మరే ఇతర పనులను ఉపాధ్యాయులకు అప్పగించ రాదనీ చెపుతుంది. ఎన్నికల విధులను కూడా ఉపాధ్యాయులు ఎందుకు నిర్వహించాలని పలువురు విద్యావేత్తలు అభ్యంతరాలను వ్యక్త పరుస్తూనే ఉన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి పేదవర్గాల పిల్లలే తమ తరగతులను, పాఠాలను ఎందుకు త్యాగం చేయాలో బోధపడదు. ప్రైవేటు బడులకు వెళ్ళే పిల్లలకు ఇటువంటి అంతరాయాలు లేకుండా తరగతులు నిర్వహించడం కూడా అక్కడ అభ్యాసన ఫలితాలు కొంత మెరుగుగా ఉండటానికి కొంత కారణం కావచ్చు. ఎన్నికలు అనే ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉన్నది. పంచాయతీ, జిల్లా పరిషత్, కార్పొరేషన్, శాసనసభ, పార్లమెంట్, మధ్యంతర ఎన్నికల వంటి వాటికి ఉపాధ్యాయులను బోధన బాధ్యతల నుండి తప్పించి వాడుకోవడం చూస్తే మన పాలకులకు మన పిల్లల చదువు పట్ల ఉన్న అశ్రద్ధ అర్థమవుతున్నది. ఇవే కాకుండా ప్రభుత్వం తలపెట్టిన పలు కార్యక్రమాలలో పిల్లలు, ఉపాధ్యాయులు పాలుపంచుకోవాలని ఆదేశాలు జారీచేయడం కూడా ఈ దుస్థితికి కారణం అవుతున్నది. తెలంగాణ రాష్ట్రం ఎంతో మంది త్యాగాల ఫలితంగా ఏర్పడినది. ఎన్నో కొత్త అశాలను రేకెత్తించింది. ప్రతి ఉపాధ్యాయుడు,పిల్లలు వారి తల్లిదండ్రులు అనేక ఉద్యమాలలో పాల్గొని తమ పిల్లల భవిష్యత్తు బాగు పడుతుందని ఆశించారు. ముఖ్యంగా మన విద్యావిధానం గత పాలకుల చేతిలో ధ్వంసం అయిందని పలు మార్లు ఉద్యమ సమయంలో నాయకులూ పదే పదే అభిప్రాయపడ్డారు. దానికి అనుగుణంగా విధానాలు మారాలి. మండల, జిల్లా పరిషత్ యాజమాన్యాల కింద నడుస్తున్న ప్రభుత్వ బడులలో చదువుచున్నారు. ఈ పిల్లలలో అత్యధిక శాతం మందికి చదవడం, రాయడం రాక పోతే అది తెలంగాణా అభివృద్ధికి ఒక మచ్చ లాగ ఉండిపోతుంది. రాష్ట్రవ్యాప్తంగా పిల్లలందరి సామర్థ్యాన్ని మూల్యాంకనం చేసి రాయడం చదవడం రాని పిల్లలకు ఒక ప్రత్యేక కార్యక్రమం రూపొందించాలి, ఈ ప్రక్రియను పర్యవేక్షించడానికి ఒక స్వయం ప్రతిపత్తి గల సంస్థను ఏర్పాటు చేయాలి. పిల్లలందరికీ తెలుగు రాయడం చదవడం నేర్పించే ప్రక్రియను ఎప్పటికప్పుడు మూల్యాంకనం చేసి విద్యాశాఖకు తగు సూచనలు చేయాలి. పిల్లలందరికీ అయా తరగతుల సామర్థ్యాలను అందించిన తరువాతనే విద్యా సిలబస్ ను మొదలు పెట్టాలి. ఈ ప్రక్రియలో ప్రజలను భాగస్వామ్యులను చేయాలి. ముఖ్యంగా పాఠశాల యాజమాన్య కమిటీల పాత్ర చాలా ము ఖ్యమైనదిగా గుర్తించాలి. అవసరమైతే విశ్రాంత ఉపాధ్యాయుల సేవలను తీసుకోవాలి. అప్పుడే మన పిల్లలందరూ తప్పులు లేకుండా రాయడం చదవడం సాధ్యమౌతుంది. అత్యంత వైభవంగా ప్రపంచ తెలుగు మహాసభలు జరుపుకున్న రాష్ట్రంగా ఖ్యాతి గడించిన తెలంగాణలో బడులలో ఉన్న విద్యార్థులందరికీ ధారాళంగా తెలుగు రాయడం చదవడం నేర్పే ఒక వినూత్న ప్రయోగానికి నాంది పలికి సంవత్సరాల తరబడి విద్యా వ్యవస్థను పట్టి పీడుస్తున్న ఒక జటిలమైన సమస్య పరిష్కారానికి శ్రీకారం చుట్టి ప్రభుత్వం మంచి విద్యా భవిష్యత్తు కు బాటలు వేయాలి.



ఈ దుస్థితి అంతటికీ ఉపాధ్యాయులపై బోధనేతర పనుల ఒత్తిడి ఒక ముఖ్య కారణంగా బయటకు వస్తున్నది. మధ్యాహ్న భోజనం లెక్కలు, మండల సమావేశాలు, ట్రైనింగులు వంటి అన్ని పనులతో విద్యార్థుల సామర్థ్యాలను పెంచడానికి సరియిన సమయం ఉపాధ్యాయులకు దొరకడం లేదని వాపోతున్నారు. ఉపాధ్యాయులు ఎలాంటి భోదనేతర పనులు చేయరాదని విద్యాహక్కు చట్టం స్పష్టంగా పేర్కొన్నది. కేవలం ఎన్నికల నిర్వహణ, ప్రకృతి వైపరీత్యాలు, జనాభా లెక్కలు తప్ప మరే ఇతర పనులను ఉపాధ్యాయులకు అప్పగించ రాదనీ చెపుతుంది. ఎన్నికల విధులను కూడా ఉపాధ్యాయులు ఎందుకు నిర్వహించాలని పలువురు విద్యావేత్తలు అభ్యంతరాలను వ్యక్త పరుస్తూనే ఉన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి పేదవర్గాల పిల్లలే తమ తరగతులను, పాఠాలను ఎందుకు త్యాగం చేయాలో బోధపడదు. ప్రైవేటు బడులకు వెళ్ళే పిల్లలకు ఇటువంటి అంతరాయాలు లేకుండా తరగతులు నిర్వహించడం కూడా అక్కడ అభ్యాసన ఫలితాలు కొంత మెరుగుగా ఉండటానికి కొంత కారణం కావచ్చు. ఎన్నికలు అనే ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉన్నది. పంచాయతీ, జిల్లా పరిషత్, కార్పొరేషన్, శాసనసభ, పార్లమెంట్, మధ్యంతర ఎన్నికల వంటి వాటికి ఉపాధ్యాయులను బోధన బాధ్యతల నుండి తప్పించి వాడుకోవడం చూస్తే మన పాలకులకు మన పిల్లల చదువు పట్ల ఉన్న అశ్రద్ధ అర్థమవుతున్నది. ఇవే కాకుండా ప్రభుత్వం తలపెట్టిన పలు కార్యక్రమాలలో పిల్లలు, ఉపాధ్యాయులు పాలుపంచుకోవాలని ఆదేశాలు జారీచేయడం కూడా ఈ దుస్థితికి కారణం అవుతున్నది.



రేగట్టే వెంకట్‌రెడ్డి,
సామాజిక కార్యకర్త
9949865516

మహా వేదికపైనా మహిళకు వివక్షే!

పిల్లలకు భాష నేర్పడం ఒకటే కాదు, సాహిత్య రంగంలో కూడా మహిళల కృషి అపారం గానే ఉంది. కానీ దానికి గుర్తింపు లభించడంలేదు. తొలి తెలుగు కవయిత్రి కుప్పాంబిక నుండి మొదలుకొని నేటి ఆధునిక రచయిత్రులు, కవయిత్రుల వరకు మహిళల కృషి అమోఘం. కానీ ప్రపంచ తెలుగు మహాసభల్లో మహిళలకు తగిన ప్రాతినిథ్యం ప్రాముఖ్యం లభించలేదు.

మౌఖిక సాహిత్యంలోని లాలిపాటలు, పని పాటలు, పెండ్లి పాటలు, ఉయ్యాల పాటలు, బతుకమ్మ(బొడ్డెమ్మ) పాటలు, కోలాట పాటలు, రాట్నం పాటలు, జంగం పాటలు, విసుర్రాయి పాటలు మర్పియా లాంటి స్త్రీల పాటల్లో నిక్కమైన కవిత్వం కనిపిస్తుంది. ఆటల్లో, మాటల్లో, పనుల్లో, పాటల్లో, ప్రకృతితో జరిపే ముచ్చట్లలో ఎక్కడ చూసినా స్త్రీల సాహిత్య సృజన జరుగుతూనే ఉంటుంది. స్త్రీల సాహిత్యం ఎక్కువగా మౌఖిక రూపంలోనే కనపడుతుంది. ఈ మౌఖిక సాహిత్యంలోని లాలిపాటలు, పని పాటలు, పెండ్లి పాటలు, ఉయ్యాల పాటలు, బతుకమ్మ(బొడ్డెమ్మ) పాటలు, కోలాట పాటలు, రాట్నం పాటలు, జంగం పాటలు, విసుర్రాయి పాటలు మర్పియా లాంటి స్త్రీల పాటల్లో అమ్మ కవిత్వం కనిపిస్తుంది. ఏ పని జరిగినా, కార్యం జరిగినా జీవితంలోని అనుభఃతులే పాటలు గా తల్లుల నోటి నుండి జాలువారుతాయి. పని లోకంలో పాటలు తోడై నిలుస్తాయి. రాజులను ఆశ్రయించిన కవులలో ఆరాధనలు భక్తిభావాలు ఉంటే, ఆడవాళ్ల సాహిత్యంలో జీవిత సత్యాలు ఉంటాయి. మౌఖిక సాహిత్యమే కాదు. రచనా రంగంలో కూడా మహిళల పాత్ర తక్కువేమీ లేదు. మొట్టమొదటి తెలుగు కవయిత్రి కుప్పాంబిక (12301300) మన తెలంగాణ లోని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వ్యక్తి. ఆమె భూత్పూరులో వేయించిన శాసనం నేటికీ ఉంది.

**''వనజాతాంబకుడేయు సాయకములన్ వర్జింపగా రాదు, నూ
తన బాల్యాధిక యౌవనంబు మదికిన్ ధైర్యంబు రానీయద
త్యనురక్తిన్ మిముబోంట్లకున్ దెలుప నాహా! సిగ్గుమైకోదు పా
వన వంశంబు స్వతంత్రమీయదు చెలీ! వాంఛల్ తుదల్ముట్టునే''** అంటూ ఆమె రాసిన పద్యాలు నాడు ఎంతో ప్రాశస్త్యాన్ని పొందాయి. 12వ శతాబ్దంలో కర్నాటక నుండి వచ్చి మహబూబ్‌నగర్ లో నివసించిన అక్కమహాదేవి ఎన్నో కీర్తనలు రచించింది. 16వ శతాబ్దంలోనే బాల పాపాంబ, అక్కమహాదేవి చరిత్రను యక్షగానంగా రచించింది. తెలుగులో మొట్టమొదటి యక్షగాన రచయిత్రి గా నిలిచింది. 16వ శతాబ్దంలోనే తెలుగులో రామాయణాన్ని రచించిన మొల్ల కూడా మన తెలంగాణ ఆడబిడ్డ. మౌఖిక సాహిత్యంలో నైతే ఆడవాళ్ళ పాత్ర చాలా కొనియాడదగినది. చిందు బాగోతం, శారదకాంద్రకథ, అనేక సంచార జాతులు చెప్పుకునే కథలు, పాడుకునే పాటలు ముఖ్యంగా ఆడవాళ్ళు ఆనందంగా జరుపుకొనే పూల పండుగ బతుకమ్మ పాటల ఊటగా సాహిత్య సృజన చేస్తూనే ఉంది. చిందు బాగోతాన్నీ ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన చిందు ఎల్లమ్మ మనకు ఉండనే ఉంది. నాడే కాదు నేడు కూడా అద్వితీయ సాహిత్య సృజన చేస్తున్న ఎందరో కవయిత్రులు, రచయిత్రులు, సాహితీవేత్తలు ఉన్నారు.

ప్రారంభ సభలో గానీ, ముగింపు సభలో గానీ ఒక్క మహిళ కూడా వేదిక మీద లేదు. ప్రధానమైన ఏ సభలో కూడా మహిళల పాత్ర నామమాత్రంగా కూడా లేదు. ప్రధానమైన వేదికల పేర్లలో కూడా ఎక్కడా మహిళల పేరులేదు. అవధానాలు, , పద్య పఠనాలు, కవితాపఠనాలు, సాహితీ చర్చలు అన్నీ మగవారి సభల్లాగే నడిచాయి. అడుగడుగునా వారి ఆధిపత్యమే కనపడింది.

తెలంగాణ ఉద్యమ కెరటమై ఎగసిన విమలక్క, ముదిగొండ సుజాతారెడ్డి, జూపాక సుభద్ర, గోగు శ్యామల, జాజుల గౌరి, అనిశెట్టి రజిత, కొండపల్లి నీహారిణి ఒకరేమిటి మన ప్రపంచ తెలుగు మహాసభలకు హాజరైన మూడు వందల మంది కవయిత్రులు, రచయిత్రులు, సాహితీ వేత్తలు తమ ప్రతిభతో అక్షర జల్లులను కురిపించి సాహితీ సేద్యం చేస్తున్నారు. తెలంగాణ ఖ్యాతిని జగమెల్లా చాటుతున్నారు. తెలంగాణ సాహితీ సేద్యంలో ఎన్నో సాక్షర కుసుమాలను పూయిస్తున్న మహిళామణులు వందల సంఖ్యలో ఉన్నారు. కానీ వారికి ప్రపంచ తెలుగు మహాసభలలో వివక్షే బహుమానంగా లభించింది. అడుగడుగునా ఆధిపత్య భావజాలం చాలా స్పష్టంగా కనబడింది. మొత్తం ముఖ్యమంత్రిగారి ఉపన్యాసంలో ఒక్క ముదిగొండ సుజాతా రెడ్డి గారి పేరు తప్ప ఇంకో మహిళ పేరు వినపడలేదు. ఈ వివక్ష మహాసభల ముందునుండే కనపడుతున్నది. మహాసభల నిర్వహణ కోసం వేసిన ప్రధామైన కమిటీలలో కూడా మహిళకు ప్రాతినిథ్యం లేదు. ఒకరోజు కేటాయించిన మహిళా కార్యక్రమాల నిర్వహణకు మాత్రం మహిళలతో కమిటీ వేశారు. ప్రారంభ సభలో గానీ, ముగింపు సభలో గానీ ఒక్క మహిళ కూడా వేదిక మీద లేదు. ప్రధానమైన ఏ సభలో కూడా మహిళల పాత్ర నామమాత్రంగా కూడా లేదు. ప్రధానమైన వేదికల పేర్లలో కూడా ఎక్కడా మహిళల పేరులేదు. అవధానాలు, , పద్య పఠనాలు, కవితాపఠనాలు, సాహితీ చర్చలు అన్ని మగవారి సభల్లాగే నడిచాయి. అడుగడుగునా ఆధిపత్యం కనపడింది. మహిళలు చాలా అల్ప సంతోషులు. ఒకరోజు వేదిక అప్పగించి ఇక మీ పని మీరు చేసుకోండి అనగానే ఆహా మాకు కూడా ఒకరోజు కేటాయించారని ఎంతో సంబురపడిపోయారు. 300 మంది కవితలతో సిద్ధమయ్యారు. ఆహా ఇది మా పండుగ అని మురిసిపోయారు. ముఖ్యమంత్రిగారిని కలిసి ధన్యవాదాలు కూడా చెప్పారు. కుడుమిస్తే పండుగ అనుకునే అల్పసంతోషులు మహిళలు. అలాంటి వారికి తగిన ప్రాతినిధ్యం ఇస్తే ఇంకా ఎంతో సంబురపడేవాళ్ళు.సమాజంలో సగం, ఆకాశంలో సగం మహిళలు. అలాంటి మహిళలు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కోసం పోరాడుతున్న కాలంలో ఘనంగా జరిగిన మహాసభలు మహిళలను నిరాశపర్చినాయి.

ఈ సందర్భంగా ఒక కథ గుర్తొస్తున్నది. కొడుకు తమను సరిగా చూసుకోవడం లేదు, కనీసం తిండి కూడా పెట్టడం లేదంటూ అతని తల్లిదండ్రులు కోర్టుకు వెళ్లారు. ఏమయ్యా తల్లిదండ్రులకు తిండి పెట్టక పోవడం న్యాయమా నువ్వెక్కడ కొడుకువయ్యా? అని అడుగుతడు జడ్జి. లేదు సర్, దేవతల లెక్క చూసుకుంటున్నాను అని కొడుకు సమాధానం చెప్తాడు. ఏమిటమ్మా అంత బాగా చూసుకుంటుంటే నువ్విలా కొడుకును బద్నాం చేయడం తప్పు గదమ్మ అని తల్లిని మందలిస్తాడు జడ్జి. అయ్యా మతలబంతా అక్కడే ఉంది. దేవతలకు నైవేద్యం పెట్టి భక్తులు తామే తిన్నట్టుగా మా కొడుకు కూడా మాకు నైవేద్యం పెట్టినట్లు అన్నం చూపించి మహాప్రసాదం అంటూ తానే తింటున్నాడు అని సమాధానమిస్తుంది తల్లి. ఇదిగో అచ్చం ఇలాగే ఉంది పరిస్థితి. తెలుగు తల్లి తెలంగాణా తల్లి అంటూ దండలు వేయటం, దండాలు పెట్టడంతో సరిపుచ్చారు. నిజమైన సాహితీమూర్తులైన అమ్మలను మాత్రం వివక్షకు గురి చేశారు. పాలభాషను, బాలభాషగా మార్చి అత్యంత ప్రతిభతో భాషను సహజాతి సహజంగా నేర్పగలిగిన సహజ బోధకురాలైన అమ్మకు ఈ మహాసభల్లో తగిన చోటు లభించకపోవడం బాధాకరం.



మరిపెద్ది వినుతారెడ్డి
9515405916

మన తెలంగాణ
6 హైదరాబాద్ ఆదివారం 14, జనవరి 2018
www.manatelangana.news

విద్యుత్ అవినీతిపై చర్చకు మేం సిద్ధం : షబ్బీర్ అలీ



మన తెలంగాణ / హైదరాబాద్ : విద్యుత్ అవినీతి పై ముఖ్యమంత్రి ముందుకు వస్తే చర్చించేందుకు తాను సిద్ధమని శాసనమండలి ప్రతిపక్ష నాయకులు మహ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. రాజకీయాల్లో, మంత్రి పదవుల విషయంలో ఆయనకంటే తానే సీనియర్‌ని అని చెప్పారు.నూతన పంచాయతీరాజ్ చట్టంపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాకే నిర్ణయం తీసుకోవాలని డిమండ్ చేశారు. సిఎల్‌పి కార్యాలయంలో సిఎల్‌పి ఉపనేత పొంగులేటి సుధాకర్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసలు గ్రామపంచయతీ చట్టం గురించి ఇప్పుడే ఎందుకు ఆలోచన వచ్చిందన్నారు. కొత్త చట్టం రాజకీయంగా కాకుండా పల్లె ప్రజల బతుకుల బంగారు భవిష్యత్తుకు పాటుపడే విధంగా ఉండాలని సూచించారు. పొంగులేటి మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికను పరోక్ష పద్ధతిలో నిర్వహించే ప్రయత్నం జరుగుతోందన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వారు మంత్రులుగా కొనసాగుతున్నారని అని స్వయంగా మంత్రులే చెబుతున్నారని అన్నారు.

అటకెక్కిన ఆన్‌లైన్ మూల్యాంకనం

- ప్రయోజనాలున్నా పడని ముందడుగు
- ఒక్కసారి పెట్టుబడి పెడితే దీర్ఘకాలిక ప్రయోజనాలు
- ఖర్చు ఎక్కువని వెనుకడుగు వేస్తున్న వర్సిటీలు, బోర్డులు



మన తెలంగాణ/హైదరాబాద్ : జవాబు పత్రాల ముల్యాంకనంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో రాష్ట్ర యూనివర్సిటీలు, బోర్డులు వెనుకబడుతున్నాయి. దేశంలో చాలా వర్సిటీలు, బోర్డులు విద్యార్థులకు అందించే అన్ని సేవలతోపాటు పరీక్షల అనంతరం నిర్వహించే మూల్యాంకనం కూడా ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తుండగా, మన రాష్ట్రంలో మాత్రం ఈ విషయంలో ముందడుగు పడటం లేదు. ఈ విధానం వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలున్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో వర్సిటీలు, బోర్డులు విఫలమవుతున్నాయి.

తెరపైకి తెచ్చిన ఇంటర్ బోర్డ్ : జవాబు పత్రాల మూల్యాంకనంలో పారదర్శకతకు పెద్ద పీట వేయడానికి ఆన్‌లైన్ పేపర్ వ్యాల్యుయేషన్‌ను గత ఏడాది ఇంటర్ బోర్డు తెరమీదకు తెచ్చింది. ఇప్పటికే విద్యార్థులకు అందించే అన్ని రకాల సేవలతో పాటు జూనియర్ కళాశాలల అఫిలియేషన్ ప్రక్రియను కూడా ఆన్‌లైన్‌లోకి తీసుకువచ్చిన ఇంటర్ బోర్డ్, జవాబు పత్రాల మూల్యాంకనాన్ని కూడా ఆన్‌లైన్ చేయాలని ప్రతిపాదించింది. గత ఏడాది అమలు చేయాలని ఆన్‌లైన్ మూల్యాంకనం నిర్వహించే పలు సంస్థలతో సంప్రదింపులు కూడా జరిపింది. అయితే ఈ విధానం అమలుకు ఖర్చు అధికంగా ఉండటంతో అక్కడే నిలిచిపోయింది. అయితే గత ఏడాది మార్చిలో జరిగిన ఇంటర్ వార్షిక పరీక్షలకు పున:పరిశీలన, పున:మూల్యాంకనానికి దరఖాస్తు చేసుకున్న 18 వేల మంది విద్యార్థుల మూల్యాంకనం మాత్రం ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పిజి వైద్య కోర్సులకు రెండేళ్ల నుంచి నుంచి ఆన్‌లైన్ మూల్యాంకనం అమలు చేస్తోంది.

ప్రయోజనాలున్నా పడని ముందడుగు

విదేశాలతో పాటు మనదేశంలోని దేశంలోని కొన్ని రాష్ట్రాలలోని వర్సిటీలు, బోర్డులు ఆన్‌లైన్ మూల్యాంకనం అమలు చేస్తున్నా, మన రాష్ట్రంలో ఈ విధానం అమలుపై ముందడుగు పడటం లేదు. జవాబు పత్రాలను ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేయడం ద్వారా జవాబుదారీతనం, పారదర్శకత పెరుగుతుంది. విద్యార్థులు జవాబు పత్రాలు చూసుకుని ప్రశ్నించే అవకాశం ఉన్నందున మూల్యాంకనం చేసే నిపుణులు ఒకటి రెండు సార్లు జాగ్రత్త వహించే అవకాశం ఉంటుంది. ఈ విధానం ద్వారా పున:మూల్యాంకనం, పున:పరిశీలన వచ్చే దరఖాస్తులు తగ్గిపోతాయి. జవాబు పత్రాలు అధిక మొత్తంలో ఉన్నప్పుడు అనర్హుల చేత మూల్యాంకనం చేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆన్‌లైన్ మూల్యాంకనంతో చాలావరకు ఈ సమస్యను అధిగమించే అవకాశం ఉంటుంది. ఈ విధానం ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నప్పటికీ నిర్ణయం తీసుకోవడానికి వర్సిటీలు, బోర్డులు తటపటాయిస్తున్నాయి. ఏ నిర్ణయం తీసుకుంటే ఏమవుతుందో అని ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ మూల్యాంకనంలో జవాబు పత్రాలను స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. అనంతరం ఆ జవాబులను సంబంధిత సబ్జెక్టు నిపుణులకు పంపిస్తారు. ఖాళీ సమయంలో వారు జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి ఆన్‌లైన్‌లోనే సంబంధిత వర్సిటీ లేదా బోర్డుకు పంపిస్తారు. లేదంటే సబ్జెక్టు నిపుణులే మూల్యాంకన కేంద్రాలకు వచ్చిన ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేస్తారు. ఒరిస్సా, కర్ణాటకతోపాటు మరికొన్ని రాష్ట్రాలలో అమలవుతున్న ఆన్‌లైన్ మూల్యాంకనం విధానంలో సబ్జెక్టు నిపుణులే కేంద్రాలకు వచ్చి ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేస్తున్నారు.

నిధుల కొరతతో వెనుకడగుడు

రాష్ట్రంలోని యూనివర్సిటీలు, బోర్డులలో ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్షలకు ఫీజులు తక్కువగా ఉండటంతో ఆన్‌లైన్ మూల్యాంకనం నిర్వహించలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు. పరీక్ష ఫీజులు పెంచితే విద్యార్థుల నుంచి వ్యతిరేకత వస్తుందని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్‌లో మూల్యాంకనం నిర్వహించాలంటే పెద్ద మొత్తంలో స్కానర్లు, కంప్యూటర్లు అవసరమవుతాయి. ఒకసారి పెట్టుబడి పెట్టి వీటిని సమకూర్చుకోగలిగితే నిరంతరం ఆన్‌లైన్ మూల్యాంకనం కొనసాగించే అవకాశం ఉంటుంది. ఇలాంటి ప్రత్యామ్నాయాలపై వర్సిటీలు, బోర్డులు అంతగా దృష్టి సారించడం లేదు. నిధుల కొరత కారణంగా కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో వెనుకబడిపోతున్నాయి.

ఫిబ్రవరి 3 లేదా 4న కోదండరామ్ రాజకీయ పార్టీ

- త్వరలోనే ఢిల్లీకి ముఖ్యనేతలు
- టచ్‌లో వివిధ రాజకీయ పార్టీల నేతలు



మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ జెఎసి చైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ నేతృత్వంలో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు ముహూర్తం దాదాపు ఖరారైనట్టు తెలిసింది. ఫిబ్రవరి 3 లేదా 4వ తేదీన జెఎసి విస్తృతస్థాయి సమావేశంలో పార్టీ ఏర్పాటు గురించి కోదండరామ్ అధికారిక ప్రకటన చేసే అవకాశాలున్నాయి. మరోవైపు రాజకీయ పార్టీ ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ వేగవంతమైంది. కేంద్ర ఎన్నికల సంఘం వద్ద పార్టీ రిజిస్ట్రేషన్ గురించి జెఎసిలోని కొందరు ముఖ్యనేతలు త్వరలోనే ఢిల్లీకి వెళ్ళనున్నారు. కాగా తెలంగాణ జెఎసి, రాజకీయ పార్టీ రెండూ వేర్వేరుగా కొనసాగాలని భావిస్తున్నారు. రైతు సమస్యలు, నిరుద్యోగం, ఉపాధి కల్పన, భూ నిర్వాసితుల సమస్యలే పార్టీ ప్రధాన ఎజెండాగా ఉంబోతున్నట్లు జెఎసి నేతలు చెబుతున్నారు. గత కొంత కాలంగా జెఎసి ప్రతినిధుల బృందం క్షేత్ర స్థాయి పరిస్థితులను అధ్యయనం చేశారు. ఇదే క్రమంలో రాజకీయ పార్టీ ఏర్పాటుపై కూడా చర్చ జరిగింది. వివిధ జిల్లాలోని కొందరు రాజకీయ ముఖ్యనేతలతో జెఎసి ప్రతినిధులు చర్చించారు. ఎన్నికలకు గడువు దగ్గర పడడం, మరో వైపు పార్టీ ఏర్పాటుపై జెఎసి శ్రేణులు, విద్యార్థి సంఘాల నుంచి కోదండరామ్‌పై తీవ్ర ఒత్తిడి వస్తున్న నేపథ్యంలో త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన చేయాలని ఆయన భావిస్తున్నారు. ఇంతకు ముందు వరకు జరిగిన స్టీరింగ్ కమిటీ సమావేశంలోనే పార్టీ పెడుతున్నట్టు జెఎసి శ్రేణులకు కోదండరామ్ సంకేతాలు అందజేసిన విషయం తెలిసిందే. రాజకీయ పార్టీ విధి విధానాలు, తదితర అంశాలపై పలువురు ముఖ్యులతో ఆయన చర్చిస్తున్నారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నాయకులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన కొందరు నేతలు ఇది వరకే కోదండరామ్‌తో చర్చలు జరిపారు. అధికార టిఆర్‌ఎస్‌కు చెందిన కొందరు నేతలు కూడా కోదండరామ్ ఏర్పాటు చేసే పార్టీలో చేరే అవకాశాలు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉండగా టిజెఎసి స్టీరింగ్ కమిటీ సమావేశం ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని జెఎసి కార్యాలయంలో శనివారం జరిగింది. టిజెఎసి రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశాన్ని ఫిబ్రవరి 3 లేదా 4వ తేదీలో హైదరాబాద్‌లో నిర్వహించాలని స్టీరింగ్ కమిటీ నిర్ణయించింది. ఈ సమావేశంలో తాజా పరిణామాలు, క్షేత్ర స్థాయి అధ్యయనంలో వెల్లడైన అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యచరణను ప్రకటించాలని తీర్మానించారు. జెఎసి స్టీరింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు కె.రఘు, ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, గురిజాల రవీందర్, బి.ఎన్.రెడ్డి, బైరి రమేష్, అంబటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెఎసి నిర్మాణం, రైతు అధ్యయన యాత్రలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలతో పాటు స్టీరింగ్ కమిటీ సభ్యులు గోపాల్‌శర్మ అరెస్టు పరిణామాలపై వారు చర్చించారు.రైతు అధ్యయన యాత్రలు దాదాపుగా పూర్తయ్యాయని, మిగిలిన కొన్ని ప్రాంతాల్లో కూడాఈ నెల 20 తేదీ లోపు పూర్తి చేయాలని, ఈ నెల 22 నుంచి30వరకు ఉమ్మడి పది జిల్లాలో అధ్యయనంలో తేలిన అంశాలపై చర్చించేందుకు సదస్సులను నిర్వహించాలని స్టీరింగ్ కమిటీ తీర్మానించింది.

గోపాల్‌శర్మను దోషిగా చిత్రీకరించే ప్రయత్నం

కంపెనీకి సంబంధించిన కమర్షియల్ ట్యాక్స్ చెల్లింపులకు సంబంధించిన బకాయిల కేసు విషయమై న్యాయ సలహాదారునిగా వ్యవహరిస్తున్న తెలంగాణ జెఎసి స్టీరింగ్ కమిటీ సభ్యులు గోపాల్‌శర్మ తన వృత్తి ధర్మాన్ని నిర్వర్తించడాన్ని కూడా నేరంగా చిత్రీకరించడాన్ని తెలంగాణ జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ ఖండించారు.తన క్లయింట్ తరపున వెళ్లిన న్యాయవాదిని దోషిగా చిత్రీకరించడం అన్యాయమని శనివారం కోదండరామ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసు విషయంలో న్యాయవాదిగా గోపాల్‌శర్మ నిర్వర్తించిన బాధ్యతను కూడా అధికార పార్టీకి చెందిన పత్రిక ఒక నేరంగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు.

ఏజెంట్లపై పిడి చట్టం

(మొదటిపేజీ తరువాయి)



వారు సమావేశమయ్యారు. ప్రభుత్వ హెచ్చరికలు ఖాతరు చేయకుండా పదే పదే వీసాల మోసాలకు పాల్పడే నకిలీ ఏజెంట్లపై పిడి చట్టాలను ప్రయోగించి కేసులు పెట్టాలని ఇదే సమావేశంలో పాల్గొన్న డిజిపి , ఇతర పోలీసు ఉన్నతాధికారులకు మంత్రులు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు డిజిపి మహెందర్ రెడ్డి స్పందిస్తూ శాఖ పరంగా తగు మార్గదర్శకాలు జారీ చేసి చట్ట పరంగా ముందుకు వెళ్తామన్నారు. మైగ్రేట్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకునేందుకు ఏజెంట్లకు నెల రోజుల సమయం ఇవ్వనున్నామని, అయినా కూడా నమోదు చేసుకోని వారందరినీ అక్రమ ఏజెంట్లుగా పరిగణిస్తామని కెటిఆర్ , నాయిని ఈ సందర్భంగా హెచ్చరించారు. రిజిస్టర్ చేసుకోని అక్రమ ఏజెంట్లను ఉపేక్షించే ప్రసక్తే లేదని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. అక్రమ ఏజెంట్లపై చర్యలు తీసుకునే విషయంలో పోలీసులకు ప్రజలు కూడా సహకరించాలని మంత్రులు విజ్ఞప్తి చేశారు. ఉపాధి కోసం విదేశాలకు వెళ్లే వారికి టాంకాం ద్వారా సరైన అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. వీసాల మోసాలకు గురై తెలంగాణ బిడ్డలు విదేశాల్లో ఇబ్బందులు పడొద్దన్నారు. సురక్షితంగా వెళ్లండి, సుశిక్షుతలై వెళ్లండి అనే కేంద్ర ప్రభుత్వ విదేశాంగ నినాదానికి అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వ టామ్‌కామ్ సంస్థ ద్వారా చట్ట పరంగానే విదేశాలకు వెళ్తే మంచిదన్నారు. టామ్ కామ్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర రిజిస్టర్డ్ ఏజెంట్ల ద్వారానే వెళ్లాలని మంత్రులు కోరారు.

విదేశీ భవన్‌కు వచ్చే నెలలో శంకుస్థాపన : హైదరాబాద్‌లో ఫిబ్రవరి రెండో వారంలో విదేశీ భవన్‌కు శంకుస్థాపన చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రులు ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో పాటు ఎన్‌ఆర్‌ఐ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్‌ఆర్‌ఐలకు, వలస కార్మికుల కోసం చేపడుతున్న చర్యలను ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలని మంత్రి కెటిఆర్ తెలిపారు. గల్ఫ్ దేశాలకు మహిళల అక్రమ రవాణా, మోసపూరిత ఎన్‌ఆర్‌ఐ వివాహాలపై మరింత కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ విషయంలో రాష్ట్ర పోలీస్ శాఖ గత కొంతకాలంగా తీసుకుంటున్న చర్యలను మంత్రి అభినందించారు. ఇలాంటి మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో కార్మిక శాఖ, ఎన్‌ఆర్‌ఐ, పోలీసు, మైనారిటీ సంక్షేమ శాఖలు సంయుక్తంగా సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఇక్కడ పోలీసుల చర్యలతో ముంబయి, కలకత్తా వంటి ప్రాంతాల నుండి ఇలాంటి ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో ఆయా రాష్ట్రాల అధికారుల సహకారం తీసుకోవాలని సూచించారు. ఈ మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఏజెంట్లపై ఒక కన్నేసి ఉంచాలని, పాస్‌పోర్ట్ కార్యాలయాల సహకారం ఇందుకు తీసుకోవాలని సూచించారు.

విషవాయువు లీక్

(మొదటిపేజీ తరువాయి)

చెందిన వెంకటరమణ (38) విధులు నిర్వర్తిస్తుండగా హైడ్రోజన్ సల్ఫేడ్ వాయువు లీక్ అయింది. తోటి ఉద్యోగులు అశ్వాపురంలోని ఆసుపత్రికి చికిత్స కోసం తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. కర్మాగారం జిఎం ఆసుపత్రికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లనే వెంకటరమణ ప్రాణాలుకోల్పోయాడని ఆయన బంధువులు ఆసుపత్రి బయట ఆందోళన నిర్వహించారు. సమాచారం అందుకున్న అశ్వాపురం సిఐ ఆలం నరేందర్ సిబ్బందితో అక్కడి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకుని ఆందోళనను విరమింపజేశారు. భారజల కర్మాగార అధికారుల నిర్లక్ష్యమే వెంకటరమణ మృతికి కారణమని, ప్రభుత్వం భారజల కర్మాగార అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో మొండికుంట, మల్లెలమడుగు గ్రామాలలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

తెలంగాణ తొలి వీణ చెన్నా

(మొదటిపేజీ తరువాయి)

నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మర్రి చెన్నారెడ్డి చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి మాట్లాడుతూ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఉద్యమానికి ఏనాడు నష్టం చేయలేదన్నారు. నెంబర్ వన్ మొనగాడుగా అభివర్ణించారు. 1969లో తెలంగాణ ఉద్యమానికి బాటలు వేశారని, అది 2001లో కేసిఆర్ స్ఫూర్తిగా తీసుకున్నారని ఆయన నాయకత్వంలో కల సాకారం అయిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కట్టుబడి ఇచ్చిన మాటలకు నిలబడి సోనియాగాంధీనే తెలంగాణ ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమానికి మర్రి చెన్నారెడ్డి కుమారుడు మర్రి రవీందర్ రెడ్డి అధ్యక్షత వహించగా, సమావేశంలో మాజీ మంత్రి మర్రి శశీధర్‌రెడ్డి, ఎంపి బండారు దత్తాత్రేయ, టిఎస్ శాసనమండలి ప్రతిపక్ష నేత షబ్బీర్ అలీ, మాజీ ఎమ్మెల్యే బద్దం బాల్‌రెడ్డి, మాజీ ఎంపి రవీంద్రనాయక్, కొండ విశ్వేశ్వరరావు, సమరసింహారెడ్డి, సుబ్బరాంరెడ్డి, అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమన్న ఆఫ్రికా

(మొదటిపేజీ తరువాయి)

(ఆఫ్రికన్ యూనియన్) అధికార ప్రతినిధి కలండో విమర్శించారు. అమెరికాకు చరిత్ర చీకటి రోజుల్లో ఎంతమంది బానిసలుగా ఆఫ్రికా నుంచి వచ్చారు అన్న వాస్తవం కంటే ట్రంప్ తాజా వ్యాఖ్య తీవ్ర అభ్యంతరకరమని ఆమె అన్నారు. అమెరికా వలసలతో ఏర్పడిన దేశానికి ఒక ఉదాహరణని గుర్తు చేశారు. సిట్ హోల్ దేశాల వారి వలసలను అమెరికా ఎందుకు అనుమతించాలో చెప్పాలని అంటూ ట్రంప్ ఆ వ్యాఖ్య చేసినట్లు తెలిసింది. ఆఫ్రికా దేశాల నుంచి వలసలు రాకుండా రక్షణ కావాలని కాంగ్రెస్ సభ్యులు ప్రస్తావించినప్పుడు ట్రంప్ ఆ వ్యాఖ్య చేశారు. అయితే ట్రంప్ వ్యాఖ్యలో భాష అదికాదని తర్వాత ట్వీట్ చేశారు. ఐక్యరాజ్య సమితి ట్రంప్ చేశారంటున్న 'సిట్ హోల్' వ్యాఖ్యను తీవ్రంగా ఖండించింది. ఆ వ్యాఖ్య జాత్యహంకారంతో కూడిన సిగ్గుమాలిన వ్యాఖ్య అని దిగ్భ్రాంతి ప్రకటించింది. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కార్యాలయం ప్రతినిధి రూపెర్ట్ కోల్ విల్లీ కూడా తీవ్రంగా ట్రంప్ వ్యాఖ్యను ఖండించారు. ఒక ఖండంలోని దేశాలన్నిటినీ కలిపి ఒకే పదంతో అసహ్యంగా అనడం తప్పన్నారు. అమెరికా రాయబారిని బోట్స్ వానా రప్పించి ట్రంప్ వ్యాఖ్యపై వివరణ కోరింది. సెనెగల్ కూడా అదే చేసినట్లు విదేశాంగ మంత్రి సిద్ధికి కాబా చెప్పారు. తమ ప్రభుత్వం ఆ వ్యాఖ్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఆఫ్రికా ఖండం ప్రజల బాధలకు అమెరికా చరిత్రలో ఎలా కారణం అయింది చాలా మంది ఆఫ్రికన్ నాయకులు గుర్తు చేశారు. 30 మిలియన్ మంది ఆఫ్రికా బానిసలను 42 కోటలలో బందించారని, కొట్టారని, మందలు మందలుగా వేరే చోట్లకు తరలించారని వారు వాపోయారు.

భూనవశకం

(మొదటిపేజీ తరువాయి)

కొత్త రిజిస్ట్రేషన్ విధానాన్ని తీసుకొస్తున్నామని, పూర్తి స్థాయి సంస్కరణలతో వస్తున్న కొత్త రిజిస్ట్రేషన్ విధానాన్ని మార్చి 11 నుంచే అమలు చేస్తామని సిఎం ప్రకటించారు. అదే రోజు మండల రెవెన్యూ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు ప్రారంభిస్తామన్నారు. రెవెన్యూ శాఖ పరిధిలోనే ఇకపై భూముల నిర్వహణ, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరుగుతుందని, రెండు శాఖల మధ్య మరింత సమన్వయం సాధించడానికి ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌గా కొనసాగుతున్న వాకాటి కరుణకే రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు సిఎం చెప్పారు. కొత్త పాస్ పుస్తకాల జారీ, రిజిస్ట్రేషన్ విధానంలో సంస్కరణలపై ప్రగతి భవన్‌లో దాదాపు 8 గంటల పాటు శనివారం సుదీర్ఘ సమీక్ష జరిగింది. ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, సిఎం ముఖ్య కార్యదర్శులు ఎస్.నర్సింగ్ రావు, శాంత కుమారి, కార్యదర్శి స్మితా సభర్వాల్, రెవెన్యూ ముఖ్య కార్యదర్శి రాజేశ్వర్ తివారి, మీ సేవా కమిషనర్ జిటి వెంకటేశ్వరరావు, నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ స్మార్ట్ గవర్నమెంట్ జిఎం డి.శ్రీధర్, సీనియర్ మేనేజర్ సుధీర్ గోలి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నిర్వహించిన సమగ్ర భూ ప్రక్షాళన ద్వారా వచ్చిన ఫలితాలను ఈ సమావేశంలో విశ్లేషించారు.

తెలంగాణ భూ భాగం వివరాలు:

–1,12,077 చదరపు కిలోమీటర్లు : తెలంగాణ రాష్ట్ర మొత్తం భూభాగం
–2.80 కోట్ల ఎకరాలు: తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం భూభాగం
–1.42 కోట్ల ఎకరాలు: ఎలాంటి వివాదాలు లేని వ్యవసాయ భూమి
–17.89 లక్షల ఎకరాలు : కోర్టుకేసులు,వివాదాలు,చిక్కులు కలిగిన భూములు
11.95 లక్షల ఎకరాలు: రైతుల వద్ద ఉన్న వ్యవసాయేతర భూములు
84.00 లక్షల ఎకరాలు: చెరువులు, కుంటలు, కాలువలు, రైల్వే లైన్లు, సబ్ స్టేషన్లు, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, ఇతర ప్రభుత్వ ఆస్తుల కింద భూములు, కోర్టు కేసుల్లోని అటవీభూములు.
24 లక్షల ఎకరాలు: నగరాలు, పట్టణాలు, గ్రామాల నివాస ప్రాంతాలు, వివాదాలు లేని అటవీభూమి

'పార్ట్ ఎ' విజయవంతం, త్వరలో 'పార్ట్ బి': తెలంగాణ వ్యాప్తంగా వంద రోజుల పాటు నిర్వహించిన భూ రికార్డుల ప్రక్షాళన పార్ట్ ఎ విజయవంతమైందని సిఎం కెసిఆర్ చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని దాదాపు 90 శాతానికి పైగా భూముల విషయంలో స్పష్టత వచ్చిందని, ఏ భూమికి ఎవరు యజమానో తేలిందని సిఎం తెలిపారు. ఈ వివరాల ఆధారంగానే కొత్త పాస్ పుస్తకాల జారీ,పంట పెట్టుబడి మద్దతు పథకం అమలు చేస్తామన్నారు. కోర్టు కేసులు,ఇతర వివాదాలు, అభ్యంతరాలు కలిగిన భూములను పార్ట్ బిలో పరిష్కరిస్తామన్నారు. పార్ట్ బి చేపట్టడానికి వీలుగా ప్రభుత్వం కొన్ని విధాన నిర్ణయాలు తీసుకునేందుకు త్వరలోనే మంత్రివర్గ సమావేశం నిర్వహిస్తామన్నారు. అనంతరం పార్ట్ బి ప్రక్షాళన కూడా చేపడతామన్నారు. పార్ట్ ఎ ద్వారా లెక్కతేలిన భూములకు సంబంధించిన వ్యవసాయ ఖాతాలు దాదాపు 71 లక్షలున్నాయని, వారందరికీ కొత్త పాస్ పుస్తకాలు ఇస్తామన్నారు.

కోర్ బ్యాంకింగ్ తరహాలో 'ధరణి' నిర్వహణ: రాష్ట్రంలోని ప్రతీ ఎకరం భూభాగం వివరాలు పొందుపరుస్తూ, ఎప్పటికప్పుడు చోటు చేసుకునే మార్పులను కూడా నమోదు చేసుకుంటూ ప్రభుత్వం భూ రికార్డుల వెబ్ సైట్ 'ధరణి'ని కోర్ బ్యాంకింగ్ తరహాలో నిర్వహించనున్నట్లు సిఎం వెల్లడించారు. దీనికోసం ప్రత్యేకంగా ఐటి విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రిజిస్ట్రేషన్ వివరాలు, పేరు మార్పిడి వివరాలు అదే రోజు ఈ ధరణిలో నమోదు అవుతాయన్నారు. విదేశాల్లో ఉన్న వారు ధరణి ద్వారా అందే సమాచారంతో క్రయ, విక్రయాలు జరుపుకోవచ్చని వెల్లడించారు.

ఎమ్మార్వోలకు సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు: రైతులు, ఇతర ప్రజలకు అందుబాటులో ఉండేందుకు వీలుగా ప్రతీ మండల రెవెన్యూ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ''రాష్ట్రంలో మొత్తం 584 మండలాలున్నాయి. ప్రస్తుతం 141 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వాటిని యధావిధిగా కొనసాగిస్తారు. ఈ 141 సబ్ రిజిస్ట్రార్ల పరిధి వారి కార్యాలయమున్న మండలానికే పరిమితం అవుతుంది. మిగతా 443 చోట్ల ఎమ్మార్వోలకు సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు అప్పగిస్తారు. ఎమ్మార్వోలు తామిచ్చిన అపాయింట్మెంట్ తేదీలకు అనుగుణంగా శని, ఆదివారాలు, ఇతర సెలవులు మినహాయించి వారానికి ఐదు రోజులు ఉదయం పూట రిజిస్ట్రేషన్ బాధ్యతలు నిర్వర్తిస్తారు. అత్యవసర పరిస్థితుల్లో ఎమ్మార్వోలు హాజరుకాలేకపోతే, ఆ బాధ్యతలను డిప్యూటీ తహసిల్దార్లకు అప్పగిస్తారు'' అని సిఎం వివరించారు.

అవినీతి, నకిలీలు, ఇబ్బంది తొలగించడమే లక్ష్యం: భూముల క్రయ విక్రయాలు, రిజిస్ట్రేషన్లు, భూ రికార్డుల నిర్వహణలో వందకు వంద శాతం పారదర్శకత సాధించడం, అవినీతి నిరోధించడం, నకిలీ పాస్ పుస్తకాలను అరికట్టడం లాంటి లక్ష్యాలతో సంస్కరణలు తీసుకొస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.'రైతులు, ఇతర ప్రజలు తరచూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే బాధ తప్పాలి. కేవలం ఒకే సారి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి రావాలి. పాస్ పుస్తకం వారి ఇంటికే కొరియర్ ద్వారా చేరాలి. ఎవరి వద్దకూ వెళ్లకుండానే తమ పని ఒక్కరోజులో పూర్తికావాలి. అవినీతికి ఆస్కారం లేకుండా రిజిస్ట్రేషన్ల విధానం ఉండాలి. నూటికి నూరుశాతం పారదర్శకంగా పనులు జరగాలి.నకిలీ పాసుపుస్తకాలు,ఇతర డాక్యుమెంట్లు సృష్టించడం పరిపాటి అయింది. నకిలీ పాసుపుస్తకాల ద్వారా రుణాలు పొంది ప్రభుత్వాన్ని కూడా మోసం చేసిన దాఖలాలున్నాయి. భూ రికార్డుల నిర్వహణను ప్రభుత్వం కట్టుదిట్టంగా చేస్తుంది. అందుకే సంస్కరణలు తీసుకొస్తున్నాం. ప్రతీ విషయం 'ధరణి'లో నమోదవుతుందని సిఎం వివరించారు.

కమిటీ నివేదిక (మొదటిపేజీ తరువాయి)

ఉప సంఘాలు శనివారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావుకు తమ సిఫారసులు అందించాయి. పంట పెట్టుబడి మద్దతు పథకంపై పోచారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన సంఘం, పంచాయితీ రాజ్ పై ఏర్పాటైన జూపల్లి కృష్ణారావు నాయకత్వంలోని సంఘం పలు సూచనలు, సిఫారసులు చేశాయి. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మంత్రివర్గ ఉపసంఘాల సభ్యులు ఈటెల రాజెందర్, హరీష్ రావు, కెటి రామారావు, తుమ్మల నాగేశ్వర్ రావు, ఇంద్రకరణ్ రెడ్డి తదితరులున్నారు.

టిఆర్‌ఎస్ స్వీప్

(మొదటిపేజీ తరువాయి)

కె.జానారెడ్డి స్వంత నియోజకవర్గం ఎర్రబెల్లి ఎంపిటిసి స్థానంలో టిఆర్‌ఎస్ 563 ఓట్ల మెజారిటీతో కైవసం చేసుకుంది.గత ఎన్నికల్లో ఈ స్థానం నుండి కాంగ్రెస్ గెలుపొందింది. అదే జిల్లా మునుగోడు నియోజవర్గంలోని కిష్టాపూర్ ఎంపిటిసిని కూడా టిఆర్‌ఎస్ దక్కించుకుంది. అలాగే రంగారెడ్డి జిల్లాలోని రెండు స్థానాలను కూడా కాంగ్రెస్ కోల్పోయింది. మరో వైపు వివాదాల్లో ఇరుకున్న అధికార పార్టీ ఎంఎల్‌ఎ ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న జనగామ నియోజకవర్గంలోని ఆకునూరు–1 స్థానాన్ని టిఆర్‌ఎస్ కోల్పోయింది. ఇక్కడ కాంగ్రెస్ గెలుపొందింది. కరీంనగర్ జిల్లా అచ్చంపల్లి స్థానాన్ని కాంగ్రెస్ 600 పైచీలుకు మెజారిటీతో టిఆర్‌ఎస్ నుండి దక్కించుకుంది. ఇదే జిల్లాలోని గంగాధర, కామారెడ్డి జిల్లాలోని మద్నూర్–2 స్థానాలను బిజెపి తిరిగి నిలబెట్టుకుంది. కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని నేత్నూర్(ఏకగ్రీవం), కౌటాల స్థానాలలో, రాజన్న సిరిసిల్ల జిల్లా అంకుషాపూర్(ఏకగ్రీవం) స్థానం, భద్రాచలం కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం–7, కూసుమంచి స్థానాలలో టిఆర్‌ఎస్ జయకేతనం ఎగురవేసింది. మహబూబ్‌నగర్ జిల్లాలోని కనమనూరు, గోపాలదిన్నె స్థానాలల్లో టిఆర్‌ఎస్ గెలుపొందారు. రంగారెడ్డి జిల్లా కొత్వాలగూడ(ఏకగ్రీవం), మహబూబ్‌నగర్ జిల్లా లింగపల్లిలో స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. గతంలో టిడిపి గెలుపొందిన రెండు చోట్ల ఈ సారి టిఆర్‌ఎస్ అభ్యర్థులే విజయం సాధించారు.

నెలకు రూ.500

(మొదటిపేజీ తరువాయి)

ఖర్చులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. శనివారం కేంద్ర ఆరోగ్య శాఖకు చెందిన ఒక కీలక అధికారి ఈ విషయాన్ని తెలిపారు.తాము పంపిన ప్రతిపాదనలకు ఫైనాన్స్ కమిటీ ఆమోద ముద్ర వేసిందని ఆ అధికారి తెలిపారు. 2025 నాటికి టిబిని దేశం నుంచి తరిమివేయాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్న కేంద్రం రోగులకు మరింత ఉపశమనం కలిగించేలా చర్యలు చేపడుతోంది.

కాంగ్రెస్ డీలా

(మొదటిపేజీ తరువాయి)

కొత్త చట్టం విషయంలో అఖిలపక్ష సమావేశం ఎందుకని, శాసనసభలో బిల్లు పెట్టినప్పుడు చర్చించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కొత్త చట్టం విషయమై ప్రత్యేకంగా శాసనసభ సమావేశాలు జరిగే అవకాశాలు ఉన్నాయ న్నారు.సచివాలయంలో శనివారం మంత్రి కెటిఆర్ పాత్రికేయులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. వ్యవసాయానికి 24 గంటల కరెంట్ సరఫరా విజయవంతం కావడంతో కాంగ్రెస్ పార్టీ కడుపుమండుతోందని రాష్ట్రంలో టిఆర్‌ఎస్ బలపడితే భవిష్యత్తులో తాము ఎప్పటికీ అధికరాంలోకి రాలేమనే భయంంతో కాంగ్రెస్ నేతలు రగిలిపోతున్నారని వ్యాఖ్యానించారు.ముందస్తు ఎన్నికలకు వెళ్లే ధైర్యం కేంద్రానికి ఉన్నదా అని ప్రశ్నించిన మంత్రి కెటిఆర్, తమది పనిచేసే ప్రభుత్వమని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా తాము సిద్ధంగానే ఉన్నామని స్పష్టం చేశారు.ఇసుక తవ్వకాలపై ప్రభుత్వం ముందుగానే గవర్నర్‌కు నివేదించిందని, వాస్తవాలు తెలిసే కాంగ్రెస్ నేతలతో గవర్నర్ మాట్లాడారని, గవర్నర్ నేరుగా కలెక్టర్, ఎస్‌పిలను సంప్రదించి సమాచారాన్ని తెప్పించుకున్నారని వివరించారు.

పెద్ద పేచీ కాదు

(మొదటిపేజీ తరువాయి)

అంశంపై లేఖ రాయనున్నట్లు చెప్పారు. ఇదేం ప్రజల్లోకి తీసుకురావాల్సినంత పెద్ద విషయం కాదు అని అన్నారు.

మన తెలంగాణ
7
హైదరాబాద్
ఆదివారం
14, జనవరి 2018
www.manatelangana.news



కాంగ్రెస్‌వి అమలుకాని హామీలు : గుత్తా

మన తెలంగాణ/నల్లగొండ: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రజలకు ఇస్తున్న హామీలు ఆచరణ సాధ్యం కావని ఎంపి గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్ర మంత్రులు, మిగతా రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అభినందిస్తుంటే కనీస అవగాహన లేకుండా ఇక్కడి కాంగ్రెస్ నేతలు విమర్శలు చేయడాన్ని తప్పుబట్టారు. రైతుల కరెంట్ కష్టాలను తరిమికొట్టేందుకు ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇస్తుంటే కాంగ్రెస్‌కు కడుపుమంట ఎక్కువైందన్నారు. విద్యుత్‌పై ప్రతిపక్షాలు నోటికి వచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. కొద్ది రోజులుగా పవర్‌ప్లాంట్ ఏర్పాటు, విద్యుత్ కొనుగోళ్లలో సిఎం కెసిఆర్‌ని విమర్శిస్తున్న కాంగ్రెస్ నేతలు రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై మండిపడ్డారు. బిహెచ్ఇఎల్ ద్వారా యాదాద్రి పవర్ ప్లాంట్ ఒప్పందం చేసుకోవడం సంతోషకరమైన విషయమని, దానిపై విష ప్రచారం చేస్తున్నారన్నారు. థర్మల్ పవర్ ప్లాంట్ కేటాయింపులన్నీ పారదర్శకంగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ద్వారానే జరిగాయన్నారు. గత ప్రభుత్వాలు సాధించలేని ఎన్నో పనులను తెలంగాణ ప్రభుత్వం కేవలం మూడున్నర ఏళ్లలో చేసిందని వివరించారు.

ప్రాణం తీసిన కుటుంబ కలహాలు

- రైలు కిందపడి ఇద్దరు కొడుకులు సహా తండ్రి ఆత్మహత్య

మన తెలంగాణ/ఖమ్మం క్రైం: కుటుంబ కలహాలతో ఓ తండ్రి తన ఇద్దరు కొడుకులతో సహా ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఖమ్మం జిల్లా వెంకటగిరిలో విషాదం నింపింది. రైల్వే సిఐ చంద్రభాను చెప్పిన వివరాల ప్రకారం.. కృష్ణాజిల్లా తిరువూరు ప్రాంతానికి చెందిన నెరెళ్ల కాశీవిశ్వనాథ్ కల్లూరు మండలంలో నివాసముంటున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కొడుకులున్నారు. 2007లో హోంగార్డు విధుల్లో చేరిన కాశీవిశ్వనాథ్ ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్‌పి కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. కుటుంబ కలహాలు, భార్యతో ఉన్న వివాదంతో ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించామన్నారు. శనివారం ఉదయం 9.10 గంటల ప్రాంతంలో వెంకటగిరి రైల్వే గేటు సమీపంలో కాశీవిశ్వనాథ్ (38), అతని కొడుకులు జయంత్(13), అజయ్‌కుమార్ (11) ఆత్మహత్య చేసుకున్నారని సిఐ తెలిపారు. ఇద్దరు కుమారులు కల్లూరులోని తెలంగాణ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నట్లు చెప్పారు. భార్య కల్లూరులో కిరాణం దుకాణం నిర్వహిస్తుందని వివరించారు. ఘటనపై రైల్వే ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల రిలే నిరాహార దీక్ష



మన తెలంగాణ/టేకుమట్ల: పాఠశాలకు చెందిన పట్టా భూమి అన్యాక్రాంత మవుతుందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎంపేడ్ గ్రామంలో శనివా రం పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్ద లు రిలే దీక్షలను ప్రారంభించా రు. గతంలో స్పీకర్ హామీ ఇచ్చి వారం గడుస్తున్నా అధికారులు మాత్రం ఎలాంటి సర్వేలు చేయలేదని, పాఠశాల స్థలంలోనే డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణ పనులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు దీక్ష కొనసాగి స్తామని తేల్చి చెప్పారు. దీక్షలో కోటగిరి సతీష్ గౌడ్, శ్రీపతి రమాకాంత్, నల్లగొని చిరంజీవి, రాగుల కిషోర్, బండారి శ్రీనివాస్, శ్రీపతి శివకుమార్, పొనగంటి రమేశ్, వైస్ ఎంపిపి సట్ల కొమురయ్య, గ్రా మ పెద్దలు సుమారు 50మంది పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని విమర్శిస్తే సహించం

మన తెలంగాణ/నల్లగొండ టౌన్: విద్యుత్ కొనుగోళ్లలో అవినీతి జరిగిందని, నిరూపిస్తా చెబుతున్న కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డికి ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు లేదని టిఆర్‌ఎస్‌వి రాష్ట్ర కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున హెచ్చరించారు. నల్లగొండ పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో టిఆర్‌ఎస్‌వి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వంపై విమర్శలు చేస్తే సహించేదిలేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో టిఆర్‌ఎస్‌వి పట్టణాధ్యక్షుడు పెరిక దివాకర్, నాయకులు చింత గణేశ్, మహ్మద్ షోయెబ్, కొంపల్లి సత్యనారాయణ, మహేశ్, అంజనేయులు, ఆనంద్, శంకర్, గిరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపిటిసి ఎన్నికల్లో టిఆర్ఎస్ స్వీప్

మన తెలంగాణ/ఖమ్మం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో జరిగిన మండల పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గ ఉప ఎన్నికల్లో టిఆర్‌ఎస్ గెలుపొందింది. భద్రాచలం మండలంలోని ఏడో సెగ్మెంట్‌తో పాటు కూసుమంచి మండలం జక్కేపల్లి ఎంపిటిసి స్థానానికి ఈనెల 11న ఉప ఎన్నికలు జరిగాయి. శనివారం ఓట్ల లెక్కింపు జరిగింది. జక్కేపల్లిలో టిఆర్‌ఎస్, సిపిఎం అభ్యర్థుల మధ్య ముఖాముఖి పోటీ జరుగగా 227 ఓట్ల మెజార్టీతో టిఆర్‌ఎస్ గెలుపొందింది. సిపిఎం అభ్యర్థిని బానోత్ భారతికి 858 ఓట్లుగా రాగా టిఆర్‌ఎస్ అభ్యర్థిని వీరభద్రమ్మకు 1085 ఓట్లు వచ్చాయి. నోటాకు 51 ఓట్లు పోలయ్యాయి. జక్కేపల్లిలోని రెండు పోలింగ్ స్టేషన్లలో టిఆర్‌ఎస్‌కు మెజార్టీ రాగా మల్లుపల్లిలో సిపిఎంకు స్వల్ప ఆధిక్యత లభించింది. భద్రాచలం 7 సెగ్మెంట్‌కు జరిగిన ఎన్నికల్లో టిఆర్‌ఎస్, టిడిపి, సిపిఎం, బిజెపి అభ్యర్థులు పోటీపడగా సిపిఎం అభ్యర్థిపై టిఆర్‌ఎస్ గెలుపొందింది. టిఆర్‌ఎస్‌కు 636 ఓట్లు రాగా సిపిఎంకు 562, టిడిపి376, బిజెపి203 ఓట్లు వచ్చాయి. నోటాకు 30 ఓట్లు పోలయ్యాయి. టిఆర్‌ఎస్ అభ్యర్థిని ఇస్లావత్ స్వరూప 74 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు అధికారులు ప్రకటించారు. ఇచ్చట మొత్తం 3302 ఓట్లకు 1807 ఓట్లు పోలయ్యాయి.

ఆకునూరులో కాంగ్రెస్ విజయం

మన తెలంగాణ/కొమురవెల్లి: సిద్దిపేట జిల్లా ఆకునూరులోని ఎంపిటిసి (1)కు గురువారం జరిగిన ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి 94 ఓట్ల ఆధిక్యతను పొంది విజయాన్ని సొంతం చేసుకున్నారు. గతంలో ప్రాతినిథ్యం వహించిన సభ్యుడు చిగుళ్ల బాలమల్లు అనారోగ్యంతో మృతిచెందగా ఈ ఎన్నిక జరిగింది. ఈ స్థానంలో మొత్తం 2208 ఓట్లు ఉండగా, 1620 ఓట్లు పోలైనవి. స్పెషల్ ఆఫీసర్ నర్సయ్య ఆధ్వర్యంలో శనివారం ఓట్లను మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో లెక్కించగా, కాంగ్రెస్ అభ్యర్థి తాటికొండ వేణుగోపాల్‌కు 755, టిఆర్‌ఎస్ అభ్యర్థి చిగుళ్ల నర్సమ్మకు 661, బిజెపి అభ్యర్థి అవ్వల్ శ్రీనివాస్‌కు 73, సిపిఐ అభ్యర్థి కంతుల రాజుకు 71, సిపిఎం అభ్యర్థి స్వర్గం శ్రీకాంత్‌కు 34 ఓట్లు లభించగా, 26 నోటా ఓట్లు పోలైనవి. కాగా తమ పార్టీ అభ్యర్థి విజయాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నాయి.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

మన తెలంగాణ/దోమకొండ: నిజామాబాద్ జిల్లా దోమకొండ మండలం అంచనూర్ గ్రామ శివారులో ఎడ్లకట్ట వాగు నుంచి శుక్రవారం అర్ధ రాత్రి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. గ్రామానికి చెందిన సిద్ద రాములు, సంగమేశ్వర్ గ్రామానికి చెందిన దయాకర్‌కు చెందిన ఇసుక ట్రాక్టర్లు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తుండగా శుక్రవారం రాత్రి తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నట్లు తెలిపారు.



రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి

- తీవ్రంగా గాయపడిన మరో నలుగురు
- వేర్వేరు జిల్లాల్లో ఘటన





జిల్లాల నుంచి మన తెలంగాణ ప్రతినిధులు: రాష్ట్రంలో శనివారం జరిగినరోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికుల చెప్పిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మంగపేట మండలం శనగకుంటకు చెందిన తోలెం మునలయ్య(35) బొడ్డు యుగేంధర్(40) శనివారం రాజుపేటలో సొంత పనుల నిమిత్తం వెళ్లి తిరిగి వస్తుండగా రమణక్కపేట వద్ద పాల్వంచకు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో మునలయ్య అక్కడికక్కడే మృతి చెందగా, యుగేంధర్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఏటూరు నాగారం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఖమ్మం జిల్లా గోపాలపురం సమీపంలో కారు ప్రమాదవశాత్తూ చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఇల్లందుకు చెందిన శ్రీపతి సుమన్‌గాంధీ, ఎండి షహేల, తరుణ్, రవితో పాటు డ్రైవర్ ఎం.రాజు కలిసి వైరా నుంచి ఖమ్మం వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ఎం.రాజు (23) అ క్కడికక్కడే మృతి చెందగా, సుమన్ గాంధీ, షహేల, తరు ణ్, రవి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. క్షతగాత్రు ల్లో తరుణ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్సకు హైదరాబాద్ తరలించినట్లు బంధువులు తెలిపారు. అయితే ఈ ప్రమాదానికి మతాంతర వివాహమే కారణమని తెలుస్తోంది. ఇల్లందుకు చెందిన సుమన్‌గాంధీ, షహేల కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరి ప్రే మను పెద్దలు అంగీకరించకపోవడంతో శుక్రవారం మహబూబాబాద్ జిల్లా అనంతారం గ్రామంలో వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత ఇల్లందుకు వచ్చి పోలీసులను ఆశ్రయించారు. అక్కడి నుంచి కొత్తగూడెం, ఆ తర్వాత హైదరాబాద్ వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అయితే ఈ విషయం తెలిసిన అమ్మాయి తరఫు బంధువులు వీరు వెళ్తున్న కారును వెంబడించడంతోనే ప్రమాదవశాత్తూ కారు చెట్టును ఢీకొన్నట్లు క్షతగాత్రులు చెబుతున్నారు.

రెండు కార్లు ఢీ: మెదక్ జిల్లా నార్సింగి మండలం కాస్లాపూర్ వద్ద రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో హుజూరాబాద్ మండలానికి చెందిన నర్సింగరావు (45), బొంత శ్రీనివాస్(44) మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. వీరు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తూప్రాన్ డిఎస్‌పి తెలిపారు. గాయపడిన మహిళ కవిత ఆందోళనకరంగా ఉందన్నారు.

నేను నిప్పు రవ్వనే

- ఎంఎల్‌ఎ రేవంత్ రెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్: తప్పుడు ఆరోపణలు చేస్తే జైల్లో పెడతామని శాసనసభలో స్వయంగా ముఖ్యమంత్రి అన్నారని, దమ్ముంటే విద్యుత్ విషయంలో తాను చేసిన ఆరోపణలను తప్పు అని అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ నాయకుడు, ఎంఎల్‌ఎ ఎ.రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. రేవంత్‌రెడ్డి రవ్వంత అని ఎంపి బాల్క సుమన్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ తాను నిప్పు రవ్వనే అని, ఒక్క నిప్పు రవ్వ చాలు టిఆర్‌ఎస్ కొంప తగులబెట్టేందుకు అని చెప్పారు. గాంధీభవన్‌లో పిసిసి ప్రధాన కార్యదర్శి దాసోజు శ్రవణ్, ఎంఎల్‌ఎ ఎస్.ఎ. సంపత్ కుమార్‌లతో కలిసి శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన సమంలో 53.8 శాతం విద్యుత్ తెలంగాణకు కేటాయించినందునే ప్రస్తుతం విద్యుత్ కొరత లేదన్నారు. భద్రాద్రి ప్లాంట్ విషయంలో అధికారులపై ఎఫ్ఐఆర్ బుక్ అయిందని సుమన్ చెప్పడం ద్వారా ముఖ్యమంత్రి కెసిఆర్ తప్పు చేసినట్లు అంగీకరించి నట్లయిందని చెప్పారు. సిఎం కెసిఆర్‌ను ఇరికించేందుకే సుమన్ ఈ వ్యాఖ్యలు చేశాడన్నారు. మిగులు విద్యుత్, తక్కువ ధరకే విద్యుత్ అందుబాటులో ఉన్నట్లయితే గృహ వినియోగదారులకు తక్కువ ధరకే విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అమరుల స్తూపానికి పాలాభిషేకం

గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపం టిఆర్‌ఎస్‌వి అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. విద్యుత్ చర్చ పేరుతు కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి అక్కడికి రావడంతో అమర వీరుల స్థూపం అపవిత్రమైందని, అందుకే తాము పాలాభిషేకం చేశామని తెలిపారు.



పోచంపల్లికి అమెరికన్ కౌన్సులేట్ జనరల్

మన తెలంగాణ/భూదాన్ పోచంపల్లి: అమెరికా కౌన్సులేట్ జనరల్ (హైదరాబాద్) కేథ్రీన్ బీ హద్దా శనివారం పోచంపల్లిని సందర్శించారు. నల్లగొండ జిల్లాలోని కనుముక్కుల గ్రామ శివార్లలోని పోచంపల్లి హైండ్లూమ్ పార్కులో చేనేత వస్త్ర ఉత్పత్తులను పరిశీలించి, ఆసక్తిగా మగ్గం నేశారు. పార్కు అధ్యక్షుడు దేవేందర్, డైరెక్టర్ లవకుమార్ పార్కులో ఉత్పత్తుల వివరాలు, మార్కెటింగ్ విధానాన్ని వివరించారు. అనంతరం కేథ్రీన్ బీ హద్దా మహిళల పొదుపు ఆర్థిక లావాదేవిలు గురించి బ్యాంకు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే చేనేత పట్టు చీరలు డ్రస్ మెటీరియల్స్‌తో పాటు వివిధ చేనేత ఉత్పత్తులను పరిశీలించారు. అక్కడి నుంచి చేనేత కార్మికుల గృహాలకు వెళ్లిన టై అండ్ డై వార్పు గ్రాఫిక్ నేత మగ్గం మహిళా కార్మికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కార్మికుల నైపుణ్యతకు ముగ్దులై ప్రశంసించారు.

విరసం నుంచే ప్రశ్నించేతత్వం

- 26వ మహాసభల్లో ప్రొ.ఆనంద్ తెల్‌తుమ్డే, హరగోపాల్





మన తెలంగాణ/మహబూబ్‌నగర్: ప్రశ్నించేతత్వం విరసం నుంచే వచ్చిందని, విప్లవ రాజకీయాలకు పునాది వేసిందీ విరసమేనని ప్రొ. ఆనంద్ తెల్‌తుమ్డే, హరగోపాల్‌లు అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని క్రౌన్ గార్డెన్ ఫంక్షన్ హాలులో విప్లవ రచయిత సంఘం (విరసం) 26వ మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రొ.ఆనంద్ తెల్‌తుమ్డే మాట్లాడుతూ బిజెపి హిందూ భావజాలంతో ముందుకు సాగుతుందని, మతాల మధ్య చిచ్చుపెట్టేందుకు ప్రయత్నిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ మరో హిట్లర్‌గా అవతరించారని విమర్శించారు. మతాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని బిజెపి భావిస్తుందని, విరసం, మావోయిస్టు పార్టీలు దానిని అడ్డుకోవడానికి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. మరో ప్రొ. హరగోపాల్ మాట్లాడుతూ విప్లవ రచయిత సం ఘం లేనిదే తెలుగు సాహిత్యం లేదని, తెలుగు సాహిత్యాన్ని నిలబెట్టింది విరసం అని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన విప్లవ రచయిత సంఘంపై తెలంగాణ ప్రభుత్వం నిర్బంధం విధించిందన్నారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో కెసిఆర్ పాలన హిట్లర్‌ను గుర్తు చేస్తుందన్నారు. ప్రశ్నించిన గొంతును నొక్కేయడం సమంజసం కాదన్నారు. విమలక్క మాట్లాడుతూ దేశంలో బ్రాహ్మణిజం శక్తివంతమైన ఆధిపత్య భావజాలంగా తయారై ఫాసిజం పెరుగుతుందని, ఫాసిజం బ్రాహ్మణీయ హిందుత్వ రూపంలో వస్తోందన్నారు. ఫాసిజం గురించి చర్చించేందుకే విరసం మహాసభలను నిర్వహించడం జరుగుతుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన వారిపై కెసిఆర్ అణచివేత ధోరణితో ముందుకు సాగుతున్నారని, తెలంగాణ ఉద్యమానికి వెన్నెముక నిలిచిన విద్యార్థులపై ఈనాడు ఆంక్షలు విధిస్తూ వారిపై కనికరం లేకుండా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. విరసం నేత వరవరరావు మాట్లాడుతూ బిజెపి కేంద్రంలో అధికారంలోకి రాగానే బ్రాహ్మణీయ హిందూ ఫాసిజం శక్తివంతంగా తయారైందన్నారు. మోడీ ప్రభుత్వం హిందూ భావజాలంతో ముందుకు సాగుతుందన్నారు. ఇది దేశానికి ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఎబివిపి, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు ప్రగతిశీల సంఘాలపై దాడులకు పాల్పడుతున్నారని, ప్రశ్నించిన వారిపై ప్రభుత్వాలు నిర్బంధాలు విధిస్తూ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నాయని తెలిపారు. అంతకుముందు విరసం మహాసభల ప్రాంగణానికి నల్లమల అమరుల ప్రాంగణంగా నామకరణం చేశారు. సభా జరిగే హాలుకు సివి హాల్‌గా, సభా వేదికకు గౌరీ లంకేష్ పేరును పెట్టారు. మహాసభల ప్రారంభానికి ముందు పతాకావిష్కరణ చేసిన అనంతరం ప్రొ.ఆనంద్‌తెల్‌తుమ్డే ప్రారంభోపన్యాసం చేయగా, ప్రొ.హరగోపాల్ ఆహ్వానోపన్యాసం చేశారు. విరసం కార్యదర్శి వరలక్ష్మి నివేదికలను చదివి వినిపించారు. ఈ మహాసభల్లో 20 పుస్తకాలను ఆవిష్కరించారు. ప్రజా కళామండలి, విరసం, అరుణోదయ సంస్థ కళాజాత బృందాలతో ఆట, పాటలను ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణంలో బుక్‌స్టాళ్లను ఏర్పాటు చేశారు. మహాసభల్లో విరసం నాయకులు వరలక్ష్మి, ఇక్బాల్, బాసిత్, అరసవెల్లి కృష్ణ, ఉదయభాను, ప్రసాద్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

130 మంది గల్ఫ్ ఏజెంట్లపై కేసులు

- సిరిసిల్ల ఎస్‌పి విశ్వజిత్



మన తెలంగాణ/సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో 130మంది గల్ఫ్ ఏజెంట్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌పి విశ్వజిత్ శనివారం వెల్లడించారు. మంత్రి కెటిఆర్‌తో శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో గల్ఫ్ ఏజెంట్లపై ఉక్కుపాదం మోపామని దీంతో పక్క జిల్లాలకు వెళ్లి అక్కడ ఇంటర్వ్యూలు నిర్వ హిస్తున్నారని వివరించారు. నకిలీ ఏజెంట్లపై ఇమిగ్రేషన్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తున్నామన్నారు. మళ్లీ అవే మోసాలకు పాల్పడితే పిడి చట్టం కింద కేసు లు నమోదు చేయాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు.

తెలుగు ప్రజలకు గవర్నర్ సంక్రాంతి శుభాకాంక్షలు

మన తెలంగాణ/హైదరాబాద్: సంక్రాంతి సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు గవర్నర్ ఇఎస్ఎల్ నర్సింహన్ శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. సుఖ సంతోషాలతో అందరూ సంక్రాంతి పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఉద్యోగాలు ఇచ్చేవరకూ పోరాటం

- యూనివర్సిటీ నిరుద్యోగ సంఘాల ఉన్నతస్థాయి సమావేశం హెచ్చరిక




మన తెలంగాణ/ హైదరాబాద్/ ముషీరాబాద్: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2లక్షల ఉ ద్యోగాలు భర్తీ చేసే వరకూ పోరాటం చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్ బిసి భవన్‌లో రాష్ట్ర నిరుద్యోగ జాక్ ఆధ్వర్యంలో 'నిరుద్యోగ ఉద్యమం'పై సమీక్ష జరిగింది. ఈ సమావేశంలో ఉస్మానియా, కాకతీయ, శాతవాహన, తెలంగాణ యూనివర్శిటీ విద్యార్థి నాయకులు, తెలంగాణ జాక్, నిరుద్యోగ సంఘర్షణ సమితి, రాష్ట్ర బిసి యువజన సంఘం, నిరుద్యోగ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు. నిరుద్యోగ సమస్యపై మూడేళ్లుగా జరిగిన ఉద్యమం, భవిష్యత్తులో చేయవలసిన ఉద్యమంపై సుదీర్ఘంగా సమీక్ష జరిపారు. ఇకముందు జరిగే ఉద్యమాలన్నీ జాయింట్ ఉద్యమాలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు గడిచినా ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకుండా 14 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. ఇప్పటికి అన్ని ప్రభుత్వ ఆఫీసులలో ఖాళీ కుర్చీలు కనిపిస్తున్నాయన్నారు. చాలాచోట్ల టీచర్లు లేక పాఠశాలలు మూత పడుతున్నాయని, ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర నిరుద్యోగ జాక్ అధ్యక్షుడు నీల వెంకటేశ్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, బిసి విద్యార్థి సంఘం జాతీయ కోఆర్డినేటర్ డా. ర్యాగ అరుణ్, మన్నె వెంకటేష్, జి.రమేష్, సి.రాజేందర్, భిక్షపతి, జి.రామకృష్ణ ముదిరాజ్, సిలిముల అశోక్, గంగనబోయిన రాంబాబు, ఎం.మహేందర్ గౌడ్, జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ, ఒంటేరుకు నాయకుల పరామర్శ

మన తెలంగాణ/హైదరాబాద్/ మాదన్నపేట్: ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేసి జైలులో నిర్బంధించిన టిడిపి, రైతు నాయకుడైన ఒంటేరు ప్రతాప్‌రెడ్డి సంక్రాంతి పండుగ రోజున జైలులో ఉపవాస దీక్ష చేపడుతున్నట్లు టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. రమణ తెలిపారు. చంచల్‌గూడ జైలులో ఉన్న మందకృష్ణ మాదిగ, ఒంటేరు ప్రతాప్ రెడ్డిలను శనివారం కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి, టిడిపి నాయకులు రమణ, మోత్కుపల్లి నర్సింహులు, పెద్దిరెడ్డి,రావుల చంద్రశేఖర్, శోభారాణిలు పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా హక్కుల కోసం పోరాడే నాయకులపై కెసిఆర్ ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేసి జైలులో పెట్టడం దారుణమన్నారు. ఒంటేరు ప్రతాప్ రెడ్డి ఒంటరి వాడు కాదని,అతనికి టిడిపి అండగా ఉందన్నారు. అక్రమ కేసుల విషయంపై గవర్నర్‌ను కలిశామని తెలిపారు. త్వరలో కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌ను కలిసి రాష్ట్ర పరిస్థితులను తెలియజేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే కెసిఆర్‌కు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. కెసిఆర్ ప్రగతిభవన్ నుంచి ఫాంహౌస్‌కు వెళ్లడానికి సమయం దగ్గరలో ఉందన్నారు. వెంటనే వారిని ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యలపై ప్రభుత్వం సరైన విధంగా స్పందించనప్పుడు నిరసన తెలిపే హక్కు కలదని, కానీ రాష్ట్రంలో ప్రాథమిక హక్కులను ముఖ్యమంత్రి కాలరాస్తున్నారన్నారు. హక్కుల కోసం పోరాడే నాయకులను కెసిఆర్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి జైలులో పెట్టడం అప్రజాస్వామికమన్నారు. మంద కృష్ణపై పిడి యాక్ట్ నమోదు చేయడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతుందని తెలిపారు. రాజయ్యను ఉపముఖ్య మంత్రి పదవీ నుంచి తొలగించి కెసిఆర్ దళితులను అవమానించారు. మాదిగలను,మాదిగ ఉపకుల వర్గీకరణ విషయంలో కెసిఆర్ పక్షపాత ధోరణిగా వ్యవహరిస్తున్నారు. ఒంటేరు ప్రతాప్‌రెడ్డి కెసిఆర్‌పై పోటీ చేసినందున కక్ష కట్టి జైలులో పెట్టడం జరిగిందని పేర్కొన్నారు.





స్పోర్ట్స్ బేస్డ్ సినిమాకు సన్నాహాలు



బుల్లితెర నుంచి వెండితెరకు వచ్చిన యాంకర్ ఓంకార్ సినీ దర్శకుడిగా స్థిరపడినట్లే కనిపిస్తోంది. హార్రర్ కామెడీ ట్రాక్‌తో వచ్చిన 'రాజుగారి గది' సినిమాతో మంచి హిట్‌ను అందుకున్న ఆయన ఆతర్వాత దానికి సీక్వెల్ కూడా తీసి పర్వాలేదని అనిపించుకున్నాడు. ప్రస్తుతం ఓంకార్ మాస్, క్లాస్ తరహాలో ఉండే స్పోర్ట్స్ బేస్డ్ స్టోరీతో సినిమాను తెరకెక్కించడానికి సిద్ధమవుతున్నాడట. ఈ సినిమాలో బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా నటించనున్నాడు. కొన్ని నెలల క్రితం వచ్చిన 'జయ జానకి నాయక' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న శ్రీనివాస్ ప్రస్తుతం 'సాక్ష్యం' సినిమాలో నటిస్తున్నాడు. ఇప్పటికే ఈ చిత్రం షూటింగ్ సగం పూర్తయింది. అయితే ఈ సినిమా పూర్తికాకముందే ఓంకార్ సినిమాను ఓకే చేశాడు. ఓంకార్ వినిపించిన స్టోరీ లైన్ బాగా నచ్చేయడంతో ఫుల్ స్క్రిప్ట్‌ను సిద్ధం చేయమని అన్నాడట. దీంతో ఓంకార్ మాస్ అంశాలతో పాటు కొన్ని కామెడీ సన్నివేశాలు ఉండేలా కథను అల్లుతున్నాడట. వీలైనంత తొందరగా ఈ స్క్రిప్ట్‌ను పూర్తిచేసే పనిలో ఉన్నాడు.



చిరంజీవి

కొత్త లుక్‌తో షాకిచ్చిన చిరు

150 సినిమాల్లో నటించిన మెగాస్టార్ చిరంజీవి ఏనాడు కనిపించిన స్టైల్‌లోనే మళ్లీ కనిపించలేదు. ఆరు పదుల వయసొచ్చినా కూడా చిరంజీవిలో గ్లామర్ ఏమాత్రం తగ్గలేదు. అయితే ప్రస్తుతం మెగాస్టార్ లుక్‌ను చూసి అందరూ షాక్ అవుతున్నారు. ఖైదీ నంబర్ 150 చిత్రం అయిపోగానే ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కథకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన చిరంజీవి మొదటి నుంచి వెరైటీ లుక్‌తో కనిపించాడు. 'సైరా.. నరసింహారెడ్డి' చిత్రం కోసం కొత్త లుక్‌తో దర్శనమిచ్చాడు. మీసాలు , గడ్డం పెంచి కొత్తగా కనిపించి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పాత్రకు తగ్గట్టు సిద్ధమయ్యాడు. కానీ ఇటీవల క్లీన్‌షేవ్‌తో దర్శనమిచ్చి అందరినీ ఆశ్చర్యపరిచాడు. అయితే సినిమా గ్రాఫిక్స్, త్రీడీ ఇమేజ్ కోసమే చిరంజీవి ఈ విధంగా సిద్ధమైనట్లు సమాచారం. మరికొన్ని రోజుల్లో 'సైరా...' చిత్రం రెండో షెడ్యూల్‌ను దర్శకుడు సురేందర్‌రెడ్డి పొల్లాచ్చిలో ప్రారంభించనున్నాడు. తొలి తెలుగు స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితంపై తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని చిరంజీవి తనయుడు రామ్‌చరణ్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాడు.



బాలయ్య కసితో చేశారు

నందమూరి బాలకృష్ణ హీరోగా కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'జైసింహా'. సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సి.కళ్యాణ్ నిర్మించిన ఈ చిత్రం తాజాగా విడుదలై హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో దర్శకుడు కె.ఎస్.రవికుమార్ విలేకరులతో ముచ్చటిస్తూ చెప్పిన విశేషాలు.



కె.ఎస్.రవికుమార్

- **ఎంతగానో సహకరించారు..**

ఈ సినిమా చేయడానికి ముందు హీరో బాలకృష్ణకు చాలా కోపం వస్తుందని పలువురు నాతో అన్నారు. కానీ ఆయనతో కలిసి ఈ సినిమా చేసినప్పుడు నాకు ఎంతగానో సహకరించారు. ఆయనకు కోపమే రాలేదు. నాకే పని వత్తిడి వల్ల కొన్నిసార్లు కోపమొచ్చింది.
ఏం చెబితే అది చేశారు...

- **స్టార్ హీరో అయినప్పటికీ అందరితో ఎంతో స్నేహంగా ఉంటారు బాలకృష్ణ.**

తనకు ఏం చెబితే అది చేసుకుంటూ పోయారు. కొన్నిసార్లు ఆయనకు నేను నటించి చూపించాను. అది చూసి ఆయన తన బాడీ లాంగ్వేజ్‌కు అనుగుణంగా నటించారు. ఎంతో కసితో బాలకృష్ణ ఈ సినిమా చేశారు. ఒక సంవత్సరం బాబుతో కలిసి బాలయ్య అన్ని సీన్లలో చక్కగా నటించారు. ఆ బాబుతో కలిసి ఫైట్ సీన్స్ కూడా చేశారు.

- **వెంటనే ఒప్పకుంది..**

స్టార్ హీరోయిన్ నయనతారకు అర గంట పాటు ఈ సినిమా కథ చెప్పాను. సబ్జెక్ట్ బాగుందని వెంటనే ఈ సినిమాలో నటించేందుకు ఆమె ఒప్పుకుంది. ప్రకాష్ రాజ్ సెకండాఫ్‌లోని సీన్లలో అద్భుతంగా నటించారు. ఫస్టాఫ్‌లో బ్రహ్మానందం కామెడీతో అలరించారు.

- **మంచి ట్యూన్స్ ఇచ్చారు...**

మ్యూజిక్ డైరెక్టర్ చిరంతన్‌భట్‌తో మొదటిసారి కలిసి పనిచేశాను. ఆయన తెలుగులో ఇదివరకే రెండు సినిమాలు చేశారు. బాలీవుడ్‌లో కూడా కొన్ని సినిమాలకు మంచి సంగీతాన్ని అందించారు. 'జై సింహా'కు చిరంతన్ భట్ మంచి ట్యూన్స్ ఇచ్చారు. కొంత సమయంలోనే ఆయన సంగీతాన్ని సమకూర్చారు.

- **ఎంతో ఆనందంగా ఉంది...**

'జై సింహా'కు మంచి స్పందన వస్తుండడం ఎంతో ఆనందంగా ఉంది. సెంటిమెంట్‌తో కూడిన ఈ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకులు ఎంతగానో ఆదరిస్తున్నారు. నా కెరీర్‌లో ఓ మంచి సినిమాగా నిలిచిపోయింది.

స్వీట్ లవ్‌లీ ఫిల్మ్ 'రంగులరాట్నం'

అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై రాజ్‌తరుణ్, చిత్ర శుక్లా హీరోహీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం 'రంగులరాట్నం'. ఈ చిత్రం ద్వారా శ్రీరంజని దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. ఈ చిత్రాన్ని సంక్రాంతి పండుగ కానుకగా ఆదివారం విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నాగార్జున మాట్లాడుతూ ''రంగులరాట్నం చిత్రం మా అన్నపూర్ణ స్టూడియో వాళ్లు వడ్డించే సంక్రాంతి పొంగలి అని మేం అనుకుంటున్నాం. నేను ఈ సినిమా చూశాను. సినిమా బొబ్బట్టులాగా ఉంటుంది. ఒక రియల్ ఫిల్మ్ ఇది. తల్లీ కొడుకుల మధ్య ఎమోషన్స్, ఒక కుర్రాడికి, అతనికి కాబోయే భార్యకు మధ్య వచ్చే సన్నివేశాలను చూస్తుంటే నా కళ్ల ముందే పాత్రలన్నీ కదులుతున్నట్టు అనిపించింది. నెల రోజుల క్రితమే సినిమాను సిద్ధం చేశాం. అదృవశాత్తు సంక్రాంతికి రిలీజ్ డేట్ దొరికింది. కుటుంబమంతా కలిసి చూడదగ్గ సినిమా ఇది. నవ్వుకుంటూ, అప్పుడప్పుడు కొంచెం కంటతడి పెడుతూ ప్రేక్షకులు ఈ సినిమా చూస్తారు. శ్రీరంజనికి దర్శకురాలిగా తొలి చిత్రమిది. సినిమాలో భావోద్వేగాలను ఆమె చక్కగా చూపించారు. మేము రాజ్‌తరుణ్‌తో 'ఉయ్యాల జంపాల' చేశాం. అతను సహజమైన నటుడు. ఈ సినిమాలో చక్కగా నటించాడు. తల్లిని ప్రేమించే అబ్బాయిగా అద్భుతంగా నటించాడు. మా నాయిక చిత్ర సినిమాలోనూ చాలా అందంగా ఉంది. ప్రియదర్శి చాలా బాగా చేశాడు. సితార తల్లి పాత్రలో నటించారు. సితార, రాజ్‌తరుణ్‌ల మధ్య తల్లీ కొడుకుల అనుబంధం చాలా బాగా పండింది. ఈ సంక్రాంతికి 'రంగులరాట్నం' స్వీట్ లవ్‌లీ ఫిల్మ్ అవుతుంది''అని అన్నారు.



'రంగులరాట్నం' చిత్రబృందంతో నాగార్జున

శ్రియా అమాయకురాలు



శ్రియా

శ్రియా ముఖ్య పాత్రలో కొత్త చిత్రం ప్రారంభమైంది. సుజన దర్శకురాలిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని కంచె, గౌతమి పుత్ర శాతకర్ణి వంటి చిత్రాలకు సినిమాటోగ్రాఫర్‌గా చేసిన జ్ఞానశేఖర్ నిర్మిస్తున్నాడు. ఈ చిత్రంలో పేద కుటుంబానికి చెందిన అమాయకురాలైన యువతిగా శ్రియా నటించనుంది. ఇదివరకు 'మిడ్ నైట్ చిల్డ్రన్' అనే హాలీవుడ్ చిత్రంలో ఆమె ఈ తరహా పాత్రలో కనిపించింది. సంగీతం ప్రధానంగా సాగే ఈ చిత్రానికి లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఇళయరాజా సంగీతాన్ని అందిస్తారు. సాయిమాధవ్ బుర్రా ఈ చిత్రానికి మాటలు రాస్తుండటం విశేషం. ప్రీప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రం మార్చి నెలలో సెట్స్‌పైకి వెళ్లనుంది.

తుపాకులు, బుల్లెట్‌లతో వినూత్నంగా..

సంక్రాంతి పండుగ సందర్భంగా నటుడు, రచయిత అడివి శేష్ కొత్త చిత్రం 'గూఢచారి' ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. క్షణం, అమీతుమీ వంటి విభిన్న చిత్రాలతో మంచి విజయాలను అందుకున్న ఆయన ఈసారి స్పై థ్రిల్లర్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. శశికిరణ్ తిక్క ఈ చిత్రానికి దర్శకుడు. తుపాకులు, బుల్లెట్‌లతో వినూత్నంగా డిజైన్ చేసిన 'గూఢచారి' ఫస్ట్‌లుక్ పోస్టర్ చిత్రంపై ఆసక్తిని పెంచుతోంది. ఓ మంచి కాన్సెప్ట్ మూవీగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో అడివి శేష్ గూఢచారిగా కనిపిస్తారు. శోభిత దూళిపాళ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని అభిషేక్ పిక్చర్స్, విస్టా డ్రీమ్ మర్చంట్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ చిత్రాన్ని వేసవిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: షానియల్ డియో, సంగీతం: శ్రీచరణ్ పాకాల, మాటలు: అబ్బూరి రవి, కథ: అడివి శేష్, ఎడిటర్: గ్యారీ బి.హెచ్.



అడివి శేష్

అన్నదమ్ముల అనుబంధానికి ప్రతీకగా 'జువ్వ'

రంజిత్, పాలక్ లల్వానీ జంటగా త్రికోటి పేట దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'జువ్వ'. ఎస్.వి.రమణ సమర్పణలో సొమ్మి ఫిలింస్ బ్యానర్‌పై డా.భరత్ సోమి నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్, టీజర్‌ను హైదరాబాద్‌లో మెగాస్టార్ చిరంజీవి విడుదల చేశారు. అనంతరం చిరంజీవి మాట్లాడుతూ ''హీరో రంజిత్, నిర్మాత భరత్ అన్నదమ్ములు. వీళ్ల నాన్నగారితో నాకు మంచి పరిచయం ఉంది. స్వతహాగా భరత్ డాక్టర్. సాధారణంగా యాక్టర్ కాబోయి డాక్టర్ అయ్యామనే మాటలు వింటుంటాం. కానీ తమ్ముడి కోసం డాక్టర్ భరత్ నిర్మాత అయ్యాడు. ఆవిధంగా అన్నదమ్ముల అనుబంధానికి ప్రతీకగా ఈ సినిమా నిలబడింది. టీజర్‌లో రంజిత్ డైనమిక్‌గా, హుషారుగా కనిపించాడు. క్యారెక్టర్ పరంగా పక్కా మాస్ అని అర్థమవుతోంది. హీరోయిన్ పాలక్ లల్వానీ రొమాంటిక్‌గా, అందంగా కనిపించింది. రాజమౌళి శిష్యుడు త్రికోటి దర్శకత్వం వహించిన ఈ సినిమాను తప్పకుండా చూస్తా''అని అన్నారు. హీరో రంజిత్ మాట్లాడుతూ ''చిరంజీవి నటన అంటే నాకెంతో ఇష్టం. ఈరోజు నేను హీరోగా పరిచయమవుతున్న సినిమా టీజర్‌ను ఆయన విడుదల చేయడం ఎంతో ఆనందంగా ఉంది''అని చెప్పారు. దర్శకుడు త్రికోటి మాట్లాడుతూ ''ప్రేమ కథతో రూపొందిన సినిమా ఇది. చిన్న చిన్న థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఇందులో ఉంటాయి''అని తెలిపారు. నిర్మాత భరత్ మాట్లాడుతూ ''గత ఏడాది మా సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ నెలాఖరున ఆడియో, ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం''అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సినిమాటోగ్రాఫర్ సురేష్ పాల్గొన్నారు.



పాలక్ లల్వానీ, రంజిత్, చిరంజీవి, డా.భరత్, త్రికోటి

మంచు లక్ష్మి సంక్రాంతి సంబురాలు

ప్రముఖ సినీ నటి, నిర్మాత మంచు లక్ష్మి ఫిల్మ్‌నగర్‌లోని తన నివాసంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి సంక్రాంతి సంబురాలను జరుపుకున్నారు. టీచ్ ఫర్ ఛేంజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జంట నగరాలలోని 38 ప్రభుత్వ పాఠశాలల నుంచి సుమారు 50 మంది విద్యార్థులు మంచు లక్ష్మి నివాసానికి చేరుకొని సందడి చేశారు. తమ ప్రతిభా పాటవాలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో పాటు టీచ్ ఫర్ ఛేంజ్ వాలంటీర్లకు మంచు లక్ష్మి సంక్రాంతి విందు భోజనాన్ని వడ్డించారు. ప్రతి సంవత్సరం పండుగల సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఫైవ్‌స్టార్ హోటల్‌కు తీసుకెళ్లి వేడుకలను జరుపుకునేవారమని, ఈ సంక్రాంతికి తన నివాసంలో సంబురాలను చేసుకోవడం ఆనందంగా ఉందని మంచు లక్ష్మి పేర్కొన్నారు. పేద, ధనిక అంతరాన్ని విద్యార్థుల్లో రానివ్వకుండా చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచు మనోజ్, టీచ్ ఫర్ ఛేంజ్ వ్యవస్థాపకుడు చైతన్యతో పాటు 25 మందికి పైగా వాలంటీర్లు పాల్గొన్నారు.





తమన్నా

బాలీవుడ్ బ్యూటీ కంగనారనౌత్ నటనకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టిన చిత్రం 'క్వీన్' ఈ సినిమా తర్వాత ఆమెకు హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమాల ఆఫర్లు పెరిగాయి. బాలీవుడ్‌లో ఈ సినిమా వచ్చి ఐదేళ్లు అవుతోంది. ప్రస్తుతం సౌత్‌లోని నాలుగు బాషల్లో ఈ సినిమా రీమేక్ అవుతోంది. 'క్వీన్' మలయాళం, తెలుగు వర్షన్లను ఒకే డైరెక్టర్ తెరకెక్కిస్తున్నాడు. 'మిస్సమ్మ'లాంటి సినిమాతో తన టాలెంట్‌ను నిరూపించుకున్న దర్శకుడు నీలకంఠ రెండు భాషల్లో ఈ సినిమాను రూపొందిస్తున్నాడు. తెలుగు వర్షన్‌లో తమన్నా హీరోయిన్‌గా చేస్తుండగా... మలయాళంలో మంజిమా మోహన్ నటిస్తోంది. తెలుగులో తొలి షెడ్యూల్ ఇప్పటికే పూర్తయింది. అయితే ఈ సినిమా

తమన్నా దెబ్బకు తప్పుకున్నాడు

తెలుగు వర్షన్ దర్శకత్వ బాధ్యతల నుంచి నీలకంఠ పక్కకు తప్పుకున్నట్టు తెలిసింది. హీరోయిన్ తమన్నాతో తేడా రావడంతో ఆయన ఈ సినిమా నుంచి తప్పుకున్నాడని సమాచారం. ఇక్కడ విశేషం ఏమిటంటే స్వతహాగా తెలుగువాడైన నీలకంఠ ఈ సినిమా మలయాళ వర్షన్‌కు మాత్రం దర్శకత్వం వహిస్తున్నాడట. అయితే తెలుగు వర్షన్‌కు దర్శకత్వ బాధ్యతలు ఎవరు తీసుకుంటారు... లేదా నిర్మాతలు నీలకంఠను ఒప్పించి తిరిగి దర్శకత్వం చేయమంటారా అనేది కొన్ని రోజుల్లో తెలిసిపోతుంది.



కాజల్

సౌత్‌లో స్టార్ హీరోయిన్‌గా నిలదొక్కుకోవడమంటే చాలా కష్టమైన పని. యంగ్ హీరోయిన్‌ల నుంచి పోటీ ఎక్కువైపోవడంతో సీనియర్ హీరోయిన్‌లు కొంచెం భయపడిపోతున్నారు. కానీ సీనియర్ స్టార్ కాజల్

ఆ విషయంలో కొంచెం తగ్గింది

మాత్రం గత కొన్నేళ్లుగా సినిమాల రిజల్ట్‌తో సంబంధం లేకుండా వరుసగా కొత్త సినిమాలు చేసేస్తోంది. అమ్మడు ప్రస్తుతం టాలీవుడ్, కోలీవుడ్‌లోని స్టార్ హీరోలు అందరితో నటించింది. ప్రస్తుతం ఈ భామ కళ్యాణ్‌రామ్ 'ఎంఎల్‌ఎ' సినిమాలో నటిస్తోంది. దీంతో పాటు కోలీవుడ్‌లో 'పారిస్ పారిస్' సినిమా చేస్తోంది. ఆ సినిమా బాలీవుడ్ 'క్వీన్' చిత్రానికి రీమేక్. అయితే కాజల్ మొన్నటి వరకు సినిమా ఏదైనా సరే రెమ్యునరేషన్ విషయంలో తేడా రానిచ్చేది కాదు. కానీ ఇప్పుడు ఆ విషయంలో ఆమె కొంచెం తగ్గింది. కొంచెం తక్కువ రెమ్యునరేషన్ తీసుకుంటూ యంగ్ హీరోలతో కూడా సినిమాలు చేయడానికి సిద్ధమైంది. ప్రస్తుతం శర్వానంద్ హీరోగా సుధీర్‌వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాలో హీరోయిన్‌గా కాజల్ ఓకే అయింది. అలాగే వెంకటేష్‌తేజ కాంబినేషన్‌లో వస్తున్న మూవీలో కూడా నటించడానికి కాజల్ సరేనంది. ఈ సినిమాలు కొంచెం తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కేవే కాబట్టి రెమ్యునరేషన్ తక్కువగా తీసుకోందట కాజల్. రాబోయే రోజుల్లో ఈ భామ యంగ్ హీరోలతో కలిసి సినిమాలు చేస్తుందట.



రికార్డు స్థాయికి విదేశీ మారక నిల్వలు

న్యూఢిల్లీ : గత వారంలో దేశీయ ఫారెక్స్(విదేశీ మారక) నిల్వలు భారీగా పెరిగాయి. జనవరి 5 నాటికి విదేశీ మారక నిల్వలు 1.758 బిలియన్ డాలర్లు పెరిగి 411.124 బిలియన్ డాలర్లకు చేరాయని ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) వెల్లడించింది. దీంతో ఫారెక్స్ నిల్వలు సరికొత్త రికార్డును నెలకొల్పాయి. గత వారంలో విదేశీయ మారక నిల్వలు 4.444 బిలియన్ డాలర్లు పెరిగి 409.366 బిలియన్ డాలర్లకు జంప్ చేశాయి. 2017 సెప్టెంబర్ 8 నాటి వారంలో తొలిసారిగా ఫారెక్స్ నిల్వలు 400 బిలియన్ డాలర్ల మార్క్‌ను క్రాస్ చేశాయి. అయితే ఈ మార్క్ నుంచి అటు ఇటుగా మారుతూనే ఉన్నాయి. విదేశీ కరెన్సీ ఆస్తుల్లో పెరుగుదల కారణంగా నిల్వలు వృద్ధిని సాధించాయి. విదేశీ కరెన్సీ ఆస్తులు 2.045 బిలియన్ డాలర్లు పెరిగి 387.149 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. గత కొద్ది వారాలు నిలకడగా ఉన్నప్పటికీ బంగారం నిల్వలు స్వల్పంగా 294.4 మిలియన్ డాలర్లు క్షీణించి 20.421 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇంటర్నేషనల్ మోనెటరీ ఫండ్ 3.2 మిలియన్ డాలర్లు పెరిగి 1.514 బిలియన్ డాలర్లకు చేరింది. దేశీయ నిల్వల స్థానం 4.2 మిలియన్ డాలర్లు పెరిగి 2.039 బిలియన్ డాలర్లకు చేరిందని ఆర్‌బిఐ వెల్లడించింది.

ఐడిఎఫ్‌సి–క్యాపిటల్ ఫస్ట్ విలీనం

• ఇరు సంస్థల మధ్య 1.5 బిలియన్ డాలర్ల ఒప్పందం • విలీన సంస్థ సిఇఒగా వి వైద్యనాథన్

న్యూఢిల్లీ : దేశంలో కొత్తగా వచ్చిన రెండు బ్యాంకుల్లో ఒకటైన ఐడిఎఫ్‌సి బ్యాంక్ తాజాగా నాన్ బ్యాంక్ ఫైనాన్స్ సంస్థ క్యాపిటల్ ఫస్ట్‌ను సొంతం చేసుకోనుంది. ఈమేరకు ఇరు సంస్థల మధ్య 1.5 బిలియన్ డాలర్ల ఒప్పంద కుదిరించింది. ఐడీఎఫ్‌సీ బ్యాంక్, క్యాపిటల్ ఫస్ట్ విలీనంపై గత కొంత కాలంగా జరుగుతున్న చర్చలు కొలిక్కివచ్చాయి. ఈ వీలీనం ద్వారా ఒక జాయింట్ వెంచర్‌గా ఏర్పడనున్నట్టు ఇరు సంస్థలు వెల్లడించాయి. ఆర్‌బిఐ, రెగ్యులేటరీ సంస్థల ఆమోదం మేరకు ఈ ఒప్పందం కుదిరింది. అన్ని అనుమతులను లభించిన తరువాత 64 లక్షల మంది వినియోగదారులు రూ. 1.4 కోట్ల ఆస్తులతో ఈ జాయింట్ సంస్థ ఏర్పడనుంది. ఈ కంపెనీకి బిపిల్ జెమానీ మధ్యంతర సిఇఒగా ఉండనున్న నేపథ్యంలో ఆయన ఐడిఎఫ్‌సి బ్యాంక్ సిఎఫ్‌ఒ పదవికి రాజీనామా చేశారు. అలాగే క్యాపిటల్ ఫస్ట్ వ్యవస్థాపకులు వైద్య నాథన్ కొత్త సంస్థకు ఎండి, సిఇఒగా, ఐడిఎఫ్‌సికు చెందిన రాజీవ్ లాల్ నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఉంటారు. ఈ ఒప్పందం ప్రకారం 10 క్యాపిటల్ ఫస్ట్ షేర్లకు గాను, ఐడిఎఫ్‌సి 139 షేర్లు దక్కనున్నాయి. కొత్త ఇటీవల శ్రీరామ్ సిటీ యూనియన్‌తో విలీనాన్ని రద్దు చేసుకున్న ఐడిఎఫ్‌సి ఇదే విధంగా క్యాపిటల్ ఫస్ట్‌తో విలీనాన్ని కూడా రద్దు చేసుకోనుందని వార్తలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో కంపెనీ అధికారిక ప్రకటన ప్రాధాన్యతను సంతరించుకుంది. శుక్రవారం క్యాపిటల్ ఫస్ట్ షేరు 1.11 శాతం పడిపోయి రూ.845 వద్ద ఉంది.



ఐడిఎఫ్‌సి బ్యాంక్–క్యాపిటల్ ఫస్ట్ విలీనం

విలీన సంస్థ వాటా వివరాలు

	వాటాలు	శాతం
ఐడిఎఫ్‌సి బ్యాంక్ ప్రమోటర్లు	1,79,75,12,668	37.6 శాతం
ఐడిఎఫ్‌సి బ్యాంక్ పబ్లిక్ షేర్‌హోల్డర్లు	1,60,51,63,460	33.6 శాతం
క్యాపిటల్ ఫస్ట్ ప్రమోటర్లు	48,90,72,777	10.2 శాతం
క్యాపిటల్ ఫస్ట్ పబ్లిక్ షేర్‌హోల్డర్లు	88,54,99,390	18.5 శాతం
మొత్తం	477,72,48,296	

మళ్లీ నాణేల తయారీ ప్రారంభం

మింట్ కేంద్రాలకు ప్రభుత్వం ఆదేశాలు



కోల్‌కతా: నాణేల తయారీని ఆపేయాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. దేశవ్యాప్తంగా నాలుగు మింట్ కేంద్రాల్లో తయారీని ప్రారంభించనున్నట్లు, ఈ ప్రక్రియ కొనసాగించనున్నట్టు కేంద్రం పేర్కొంది. బ్యాంకుల్లో స్థలం లేక నాణేల తయారీని నిలిపివేయాల్సిందిగా ఇటీవల ప్రభుత్వం ఆదేశాలిచ్చిన విషయం తెలిసిందే. మళ్లీ నాణేల తయారీని పునరుద్ధరించాల్సిందిగా సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎస్‌పిఎంసిఐఎల్)కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కోల్‌కతా, ముంబయి, నోయిడా, హైదరబాద్‌లో ఈ తయారీ కేంద్రాలు(మింట్) ఉన్నాయి. నాణేల తయారీని మళ్లీ ప్రారంభించామని, చలామణీలో ఉన్న అన్ని నాణేలను తయారు చేస్తున్నామని కోల్‌కతా మింట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బిజన్ డే తెలిపారు. 7,712 మిలియన్ నాణేలను తయారు చేయాల్సిందిగా గతంలో ఆర్‌బిఐ మింట్‌లను ఆదేశించగా, ఇప్పటికే ఈ కేంద్రాల్లో 5,900 మిలియన్ నాణేలను తయారు చేశారు. ఇక మిగతావి తయారు చేయడానికి రెండున్నర నెలల సమయం పట్టే అవకాశం ఉందని ఆయన అన్నారు. మార్కెట్‌లో పంపిణీకి మింట్‌ల నుంచి నాణేలు, బ్యాంక్ నోట్లను ఆర్‌బిఐ అందుకుంటుంది. ఉద్యోగులు రెండు షిఫ్టుల్లో కాకుండా ఒకే షిఫ్ట్‌లో పనియాల్సిందిగా ప్రభుత్వం నోటీసుల్లో పేర్కొందన్నారు. బ్యాంకుల్లో నాణేలను భద్రపరిచేందుకు స్థలం లేదని నాణేల తయారీని నిలిపివేయాల్సిందిగా ఈనెల 9న ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన విషయం తెలిసిందే. 2016 నవంబర్‌లో రూ.500, రూ.1000నోట్లను రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత చిల్లర కోసం ప్రజలు నానా తంటాలు పడ్డారు. భారీగా పాతనోట్లు బ్యాంకుల్లోకి వచ్చి చేరాయి. దీంతో బ్యాంకు వాల్టులన్నీ పాత నోట్లతో నిండిపోయాయి. నాణేలు దాచేందుకు స్థలం లేకపోయింది. ఈ ఏడాది జనవరి 8 వరకు ప్రభుత్వ మింట్‌లలో 2,528 మిలియన్ల నాణేలు ఉన్నాయి.

రూ.8,000 కోట్లకు అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు



న్యూఢిల్లీ: బ్యాంక్ ఖాతాదారుల అన్‌క్లెయిమ్డ్(అప్రకటిత) డిపాజిట్లు రూ.8వేల కోట్లు దాటాయని ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) పేర్కొంది. ఆ బ్యాంకు డిపాజిట్లకు సంబంధించిన వ్యక్తులు, వారసులకు సంబంధించిన కెవైసి వివరాలేవీ అధికారుల దగ్గర లేవని వెల్లడించింది. ఆర్‌బిఐ విడుదల చేసిన నివేదిక ప్రకారం, 2016 డిసెంబర్ నాటికి అన్ని బ్యాంకుల్లో మొత్తం 2.63 కోట్ల ఖాతాలకు సంబంధించిన వివరాలేవు, అయితే వారి డిపాజిట్లు మాత్రం రూ.8,864.6 కోట్లు ఉన్నాయి. 2012 నుంచి 2016 వరకు ఈ అప్రకటిత బ్యాంకు డిపాజిట్లలోని నగదు రెట్టింపయ్యింది. బ్యాంకుల్లో ఏళ్ల తరబడి డిపాజిట్లు చేసి, వాటిని తీసుకోవడానికి ఎవరూ రాకపోవడం లేదా ఆ డిపాజిట్‌దారులకు సంబంధించిన పూర్తి సమాచారం లేకపోవడంతో అవి అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లుగా మారిపోతాయి. అన్‌క్లెయిమ్డ్ బ్యాంకు డిపాజిట్లు అత్యధికంగా ఉన్న బ్యాంకు జాబితాలో ఎస్‌బిఐ మొదటి స్థానంలో నిలిచింది. దాదాపు 47 లక్షల ఇన్‌యాక్టివ్ ఖాతాల్లో మొత్తం రూ.1,036 కోట్ల నగదు ఉంది. తర్వాతి స్థానంలో కెనరా బ్యాంక్.. 47 లక్షల ఇన్‌యాక్టివ్ బ్యాంకు ఖాతాల్లో రూ.995కోట్ల నగదు ఉంది. ఇక పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో 23లక్షల ఇన్‌యాక్టివ్ ఖాతాలు ఉండగా, ఈ ఖాతాల్లో రూ.829కోట్లు ఉన్నాయి. అప్రకటిత బ్యాంకు ఖాతాల సంఖ్య 2012లో 1.32 కోట్లు ఉండగా, 2016 నాటికి అది రెట్టింపై 2.63 కోట్లకు చేరింది.

అదే సమయంలో వారి డిపాజిట్లు రెట్టింపు అయ్యాయి. రూ.3,598కోట్ల నుంచి రూ. 8,864.6కోట్లకు చేరాయి. అన్‌క్లెయిమ్డ్ బ్యాంకు డిపాజిట్‌దారుల వివరాలను బ్యాంకు అధికారులు తమ అధికారిక వెబ్‌సైట్‌లలో ఉంచాలని ఆర్‌బిఐ సూచించింది. ఈ జాబితాలో తప్పకుం డా ఆ డిపాజిట్ చేసిన ఖాతాదారుని పూర్తి పేరు, వివరాలు పొందుపరచాల్సిందిగా ఆర్‌బిఐ సలహా ఇచ్చింది.



రైల్వే విస్తరణ దిశగా అడుగులు

న్యూఢిల్లీ: రైల్వేకు సంబంధించి అనేక ప్రణాళికలు ఉన్నాయని, వాటిని కార్యరూపం దాల్చేందుకు ప్రయత్నిస్తామని కేంద్ర రైల్వే మంత్రి పియుష్ గోయల్ పేర్కొన్నారు. శనివారం ముంబైలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ వద్ద మనీలైఫ్ ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఎస్‌ఇ హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీ మ్యూచువల్ ఫండ్‌ను ఆయన ప్రారంభించారు.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్





బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	28690	30684.49	0.67%
ముంబై	29270	31304.81	0.52%
ఢిల్లీ	29000	31016.04	0.69%
కోల్‌కతా	29470	31518.72	1.41%
కేరళ	27750	29679.14	0.73%
బెంగళూరు	28050	30000.00	0.36%
హైదరాబాద్	28690	30684.49	0.77%
గల్ఫ్	1402.73	1500.25	0%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	బుధవారం	మంగళవారం	మార్పు (%)
చెన్నై	41900.00	42000.00	0.24
ముంబై	41900.00	42000.00	0.24
ఢిల్లీ	41900.00	42000.00	0.24
కోల్‌కతా	41900.00	42000.00	0.24
హైదరాబాద్	41900.00	42000.00	0.24



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	402	విశాఖపట్నం	402
వరంగల్	404	చిత్తూరు	398
విజయవాడ	404	చెన్నై	405
గోదావరి	404	బెంగళూరు	405

జనవరిలో ద్రవ్యోల్బణం తగ్గనుంది

ఎస్‌బిఐకి చెందిన రీసెర్చ్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: దేశీయ రిటైల్ ద్రవ్యోల్బణం డిసెంబర్‌లో 17 నెలల గరిష్ఠానికి చేరింది. ఆహార పదార్థాలు, కూరగాయలు ప్రియం కావడంతో గత నెలలో వినియోగ వస్తు ధరల సూచీ(సిపిఐ) 5.21శాతానికి చేరింది. దీంతో వచ్చే సమీక్షలో ఆర్‌బిఐ(రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా) కీలక వడ్డీ రేట్లను తగ్గించే అవకాశాలు తక్కువేనని నిపుణులు పేర్కొంటున్నారు. అదే సమయంలో ద్రవ్యోల్బణంపై ఎస్‌బిఐ(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) సానుకూలంగా స్పందించింది. జనవరి నెలలో ద్రవ్యోల్బణం తగ్గే అవకాశం ఉందని ఎస్‌బిఐ అంచనా వేస్తోంది. ఈ మేరకు ఎస్‌బిఐకి చెందిన ఎకనమిక్ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ తయారుచేసిన నివేదికలో పేర్కొంది. అంచనాలకు తగిన విధంగానే రిటైల్ ద్రవ్యోల్బణం 2017 డిసెంబరు నెలలో 17 నెలల గరిష్ఠానికి చేరి 5.21 శాతంగా ఉంది. నవంబరులో ఇది 4.88 శాతం మాత్రమే. దీని గురించి ఆందోళన పడాల్సిన అవసరం లేదని, ద్రవ్యోల్బణం నెలవారీ పెరుగుదల గతంతో పోలిస్తే తగ్గిందని పేర్కొంది. జనవరిలో కూరగాయల ధరలు తగ్గుముఖం పట్టనున్నాయని, రీటైల్ ద్రవ్యోల్బణం డిసెంబరు కంటే తగ్గే అవకాశం ఉందని నివేదికలో తెలిపారు. అయితే జనవరి తర్వాత నుంచి జూన్ వరకు మళ్లీ ద్రవ్యోల్బణం పెరిగే అవకాశాలు ఉన్నాయని, సగటున ద్రవ్యోల్బణం 5.5శాతం ఉండనున్నట్లు అంచనా వేస్తోంది. జులై తర్వాత నుంచి డిసెంబరు వరకు మాత్రం మళ్లీ తగ్గుముఖం పట్టి 4 శాతానికి దిగివచ్చే అవకాశముందని నివేదిక పేర్కొంది. కేంద్ర గణక కార్యాలయం విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం 4.96 శాతం పెరిగింది. డిసెంబరులో ఇది 4.42 శాతం తగ్గింది. గుడ్లు, కూరగాయలు, పండ్లు ధరల్లో పెరుగుదల ఉండగా, పప్పులు, తృణ ధాన్యాల ద్రవ్యోల్బణం రేటు తగ్గుముఖం పట్టింది.

ఫలితాలే ట్రెండ్‌ను నిర్దేశిస్తాయి



న్యూఢిల్లీ: ఐటీ కంపెనీల క్యూ3(అక్టోబర్–డిసెంబర్) ఫలితాలతో జోష్‌తో గత వారం స్టాక్‌మార్కెట్లు లాభాలతో దూసుకెళ్లాయి. వచ్చే వారం కూడా కార్పొరేట్ ఫలితాలే ప్రధానంగా ట్రెండ్‌ను నిర్దేశిస్తాయని విశ్లేషకులు చెబుతున్నారు. కొద్ది రోజుల్లో కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్నప్పటికీ ప్రస్తుతానికి సెంటిమెంటును ప్రభావితం చేసే అంశాల్లో క్యూ3 ఫలితాలే కీలకం కానున్నాయి. దీంతో ఇన్వెస్టర్లు కంపెనీల క్యూ3 ఫలితాలపైనే ప్రధానంగా దృష్టిపెట్టనున్నారు. గత వారాంతం శుక్రవారం మార్కెట్లు ముగిశాక సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్ క్యూ3 పనితీరును వెల్లడించింది. పటిష్ఠ ఫలితాలతోపాటు ఆశావహ గైడెన్స్ ప్రకటించింది. ఈ ఫలితాల ప్రభావం సోమవారం కనిపించనుందని నిపుణులు పేర్కొంటున్నారు.

వచ్చే వారం క్యూ3 ఫలితాలు వెల్లడించనున్న కంపెనీ జాబితాలో భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌యుఎల్, జి, అల్ట్రాటెక్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐటిసి, కొటక్ మహీంద్రా బ్యాంక్, విప్రో, అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్, యస్ బ్యాంక్ తదితర కంపెనీలు ఉన్నాయి. డిసెంబర్ నెలకు టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యూపిఐ) గణాంకాలను ప్రభుత్వం సోమవారం విడుదల చేయనుంది. నవంబర్‌లో డబ్ల్యుపిఐ 3.9 శాతాన్ని తాకి 8 నెలల గరిష్టంలో ఉంది. డిసెంబర్ నెలకు రిటైల్ ధరల ద్రవ్యోల్బణం(పిసిఐ) 5.21 శాతానికి పెరిగింది. ఇది మార్కెట్లకు ప్రతికూలంగా మారనుంది. పారిశ్రామి కోత్పత్తి(ఐఐపి) నవంబర్‌లో 8.4 శాతానికి పుంజుకోవడం సానుకూల పరిణామమని విశ్లేషకులు పేర్కొన్నారు. అంతర్జాతీయ మార్కెట్లలో ఇప్పటికే మూడేళ్ల గరిష్టానికి చేరిన ముడిచమురు ధరలు మార్కెట్‌ను ప్రభావితం చేయనున్నాయి. అలాగే, విదేశీ పెట్టుబడులు, డాలరుతో మారకంలో రూపాయి కదలికలు వంటి పలు అంశాలను గమనించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఏడు వారాల గరిష్ఠానికి బంగారం ధర

న్యూఢిల్లీ : వరుసగా మూడో రోజు బంగారం ధరలు పెరిగాయి. పండుగ సీజన్‌లో బంగారానికి డిమాండ్ పెరగడం, అంతర్జాతీయ సంకేతాలతో రేటు పెరిగింది. బులియన్ ట్రేడింగ్‌లో 10 గ్రాముల బంగారం ధర ఏడు వారాల గరిష్ఠానికి చేరింది. వంద రూపాయలు పెరిగి 30,750 రూపాయలుగా నమోదైంది. అంతర్జాతీయంగా సానుకూల పరిస్థితులు, డాలర్ విలువ పడిపోవడం, స్థానిక నగల వ్యాపారుల నుంచి కొనుగోళ్లు బంగారం ధరలను పెంచుతున్నాయని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అంతర్జాతీయంగా చూస్తే ఔన్స్ బంగారం ధర 1.17 శాతం పెరిగి 1,337.40 డాలర్లుగా నమోదైంది. మరోవైపు వెండి ధరలు కూడా 1.44 శాతం లాభపడి ఔన్స్‌కు 17.21 డాలర్లకు పెరిగింది. దేశ రాజధాని ఢిల్లీలో 99.9 శాతం, 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధరలు 10 గ్రాములకు 30,750 రూపాయలుగా, రూ.30,600 గాఉన్నాయి. వెండి ధరలు కూడా దేశీయం గా 100 రూపాయలు లాభపడి కిలో రూ.39,900కు పెరిగాయి. పారిశ్రామిక యూనిట్లు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్ల మద్దతుతో వెండి ధరలు పెరిగాయని మార్కెట్ వర్గాలు తెలిపాయి.



మన తెలంగాణ
10 హైదరాబాద్
ఆదివారం
14, జనవరి 2018
www.manatelangana.news

తమిళ గేయ రచయిత వైరముత్తుపై కేసు



చెన్నై: తమిళ సినీ గేయ రచయిత, జాతీయ అవార్డు గ్రహీత వైరముత్తుపై తమిళనాడులోని రాజపాలెం శనివారం కేసు నమోదైంది. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో 12 ఆళ్వారు సన్యాసుల్లో ఒకరైన, 7వ శతాబ్దానికి చెందిన శ్రీ ఆండాళ్‌కు వ్యతిరేకంగా వైరముత్తు వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. హిందూ మున్నానీ కార్యకర్త ఫిర్యాదు మేరకు వైరముత్తుపై కేసు నమోదు చేశామని..దీనిపై విచారణ చేపడతామని పోలీసులు తెలిపారు. హిందువులు ఆరాధించే శ్రీ అండాళ్ గురించి వైరముత్తు చేసిన వ్యాఖ్యలు ఆమె భక్తుల్ని బాధించిందని హిందూ మున్నానీ కార్యకర్త ఫిర్యాదులో పేర్కొన్నారు. వైరముత్తు 1980లో దర్శకుడు భారతీరాజా సినిమా 'నిళల్‌గల్'తో తమిళ సినీపరిశ్రమలోకి గేయ రచయితగా పరిచయం అయ్యారు. వైరముత్తు, ఇళయరాజా కాంబినేషన్‌లో వచ్చిన పాటలకు 1980లలో తమిళనాట విపరీతమైన క్రేజ్ ఉండేది. ఆయన ఉత్తమ గేయ రచయితగా ఇప్పటివరకు ఏడు జాతీయ అవార్డులను సొంతం చేసుకున్నారు. 2003లో వైరముత్తు తమిళంలో రాసిన 'కళ్లికట్టు ఐతికాసమ్' నవలకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. అదే ఏడాది కేంద్రప్రభుత్వం ఆయనకు 'పద్మశ్రీ' అవార్డు ఇవ్వగా...2014లో పద్మభూషణ్‌తో సత్కరించింది. వైరముత్తు కుమారుడు మదన్ కార్కీ ప్రస్తుతం తమిళ సినీ పరిశ్రమలో గేయ రచయితగా కొనసాగుతున్నాడు.

కార్తీ చిదంబరం కార్యాలయాలపై ఇడి దాడులు



న్యూఢిల్లీ: ఎయిర్‌సెల్ మాక్సిస్ మనీలాండరింగ్ కేసులో కేంద్ర మాజీ మంత్రి చిదంబరం కుమారుడు కార్తి చిదంబరం కార్యాలయాలపై శనివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు (ఇడి) దాడులు నిర్వహించారు. ఎయిర్‌సెల్ మాక్సిస్ మనీలాండరింగ్ కేసులో భాగంగానే ఢిల్లీ, చెన్నై ప్రాంతాల్లోని కార్తి కార్యాలయాలపై అధికారులు ఈ ఆకస్మిక దాడులు చేశారు. గత నెలలో కూడా ఇదే విధంగా చిదంబరం బంధువుల ఇళ్లపై ఏకకాలంలో ఇడి దాడులు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణలో భాగంగా ఇడి ఎదుట హాజరుకావాల్సిందిగా కార్తీ చిదంబరానికి సమన్లు జారీ చేసిన రెండో రోజే దాడులు జరగడం గమనార్హం. ఐఎన్ఎక్స్ మీడియా సంస్థలో విదేశీ పెట్టుబడులకు అనుమతి ఇచ్చిన కేసులో ఈనెల 16న విచారణకు హాజరు కావాలని కార్తీ చిదంబరానికి ఈడీ గురువారం సమన్లు పంపిన విషయం తెలిసిందే. 2009 ఆగస్టులో కేంద్ర ఆర్థికశాఖ మంత్రిగా ఉన్న చిదంబరం తన అధికారాలను దుర్వినియోగం చేసి ఐఎన్ఎక్స్ మీడియా అనే సంస్థ విదేశీ పెట్టుబడులు పొందేందుకు అనుమతి ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే కార్తి చిదంబరం, ఐఎన్ఎక్స్ మీడియా సంచాలకులు పీటర్ ముఖర్జీ, ఇంద్రాణి ముఖర్జీలపై ఇడి కేసు నమోదు చేసింది. ఈ కేసులో కార్తి చిదంబరంపై లుక్ ఔట్ నోటీసు కూడా జారీ అయింది.

ముంబై తీరంలో కూలిన హెలికాప్టర్

ముంబయి: ఓఎన్‌జిసి (ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్) ఉద్యోగులతో ప్రయాణిస్తున్న పవన్ హాన్స్ హెలికాప్టర్ శనివారం ఉదయం కూలిపోయంది. ముంబయిలోని జుహు విమానాశ్రయం నుంచి ఉదయం 10.20గం. టేకాఫ్ అయిన హెలికాప్టర్ షెడ్యూల్ ప్రకారం 10.58 గంటలకు గమ్యస్థానానికి చేరుకోవాల్సి ఉంది. కాని 10.30 గంటల సమయంలో హెలికాప్టర్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఎటిఎస్)తో సంబంధాలు తెగిపోయింది. ఇందులో ఐదుగురు ఓఎన్‌జిసి ఉద్యోగులు, ఇద్దరు పైలట్లు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఓఎన్‌జిసి అధికారులు వెంటనే ఇండియన్ కోస్ట్ గార్డు సిబ్బందికి సమాచారం అందించారు. గాలింపు చేపట్టిన సిబ్బంది కూలిపోయినట్లు గుర్తించారు. హెలికాప్టర్ శకలాలను గుర్తించినట్లు చెప్పారు. నలుగురి మృతదేహాలు లభ్యంకాగా.. మిగతావారి కోసం గాలింపు చేపట్టారు

చెన్నై విమానాశ్రయానికి 'భోగి' సెగ

చెన్నై: సంక్రాంతి ముందురోజు వేసుకొనే భోగి మంటలు చెన్నై విమానాశ్రయానికి పొగ పెట్టాయి. దట్టమైన పొగ చుట్టుముట్టడంతో విమానాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. దేశవిదేశాలనుంచి వస్తున్న విమానాలను దారి మళ్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. చెన్నై విమానాశ్రయానికి కువైట్, షార్జా, ఢిల్లీ నుంచి వస్తున్న 18 విమానాలను దారి మళ్లించి హైదరాబాద్, బెంగళూరు పంపించారు. దీంతో విమాన ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనదారుల మీద కూడా ఈ ప్రభావం పడింది. దారికనబడక వాహనదారులు హెడ్‌లైట్ల వెలుతురులోనే వాహనాలను నడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. పర్యావరణహితంగా పండగ జరపుకోవాలని ప్రభుత్వం ముందుగానే అవగాహన కార్యక్రమాలు చేపట్టినా ప్రయోజనం లేకపోయింది. ప్రస్తుతానికి పరిస్థితి కొంతమేర మెరుగుపడిందని అధికారులు వెల్లడించారు.


నివాస ప్రాంతాల్లోకి చిరుత

ముంబయి: మహారాష్ట్రలో చిరుత దాడిలో ఆరుగురు గాయపడ్డారు. శనివారం ఉదయం 7.15 గంటలకు సబర్బన్ ములుండ్‌లోని నానిపదలో నివాస ప్రాంతాల్లోకి వచ్చిన చిరుత ఆరుగురిపై దాడి చేసిందని సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు.నానిపద చుట్టు పక్కల కొండలు, అడవులు ఉన్నాయని ఆయన తెలిపారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు, అటవీశాఖ సిబ్బంది ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారని తెలిపారు. చిరుతను పట్టుకునేందుకు యత్నిస్తున్నామని ఏడో జోన్ డిప్యూటీ కమిషనర్ అఖిలేష్‌సింగ్ తెలిపారు.

కృత్రిమ మేధస్సుపై ఎంటెక్ కోర్సు

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో తొలిసారిగా ఇంద్రప్రస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ)లో కృత్రిమ మేధస్సుపై ఎంటెక్ కోర్సు ప్రారంభం కానుంది. ఈ ఏడాది జులై నుంచి ఇది ఆరంభమవుతుంది. ఇది పరిశోధన దృక్కోణంలోను, కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాసనంలో పురోగతి ఆధారంగా చేసుకొని సాగుతుందని అధికారులు తెలిపారు. కృత్రిమ మేధస్సు ద్వారా నవకల్పన, సమస్య పరిష్కారం అంశాల్లో పరిశ్రమల్లో కెరీర్‌లు నిర్మించుకోవచ్చని వివరించారు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయని, 20 మంది విద్యార్థులతో ఇది ప్రారంభమవుతుందని చెప్పారు. ఐఐఐటీ.. ఢిల్లీ ప్రభుత్వ చట్టం ద్వారా ఏర్పాటైంది.

'పద్మావత్' అనుమతించబోం



ముంబయి: రాజపుత్ సమాజానికి అభ్యంతరకరమైన దృశ్యాలను తొల గించే వరకు 'పద్మావత్' సినిమా విడుదలకు అనుమతించబోమని శని వారం కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖ మంత్రి రాందాస్ అథవాలే పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి త్వరలో కేంద్ర సెన్సార్ బోర్డు (సిబిఎఫ్‌సి) అధ్యక్షుడు ప్రసూన్ జోషిని కలుస్తానన్నారు. సినిమా పేరు మాత్రమే మార్చారని, కథ, సన్నివేశాలు మార్చలేదని ఆయన పేర్కొన్నారు. సినిమా విడుదలకు ముందే అలాంటి సన్నివేశాలను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

శశికళ గదిలో రహస్య లేఖ

చెన్నై: గుట్కా స్కాంకు సంబంధించిన రహస్య లేఖ ఒకటి జయలలిత నిచ్చెలి శశికళ గదిలో లభించింది. గత నవంబర్ (2017)లో ఆదాయ పన్ను శాఖ అధికారులు నిర్వహించిన సోదాల్లో ఇది బయటపడింది. ఈ మేరకు మద్రాసు హైకోర్టుకు ఐటి వారు ఇచ్చిన అఫిడవిట్ ఐటి ప్రిన్సిపల్ డైరెక్టర్ సుసీ బాబు వర్గీస్ పేర్కొన్నారు. గుట్కా స్కాంపై వెంటనే సిబిఐ దర్యాప్తు నిర్వహించాలని డిఎంకె ఎమ్మెల్యే అంబజగన్ ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశారు. దీంతో కోర్టు ఆదేశాల మేరకు ఐటి అధికారులు పోయెస్ గార్డెన్‌లోని వేద నిలయంలో సోదాలు నిర్వహించగా శశికళ గదిలో ఓ లేఖ లభించింది. వర్గీస్ తెలిపిన ప్రకారం.. ఆ లేఖ ఆగస్టు 11న 2016న నాటి ఐటి ప్రిన్సిపల్ డైరెక్టర్ ముఖ్యమంత్రి జయలలితకు, నాటి డిజిపికి లేఖ రాశారు. ఈ కుంభకోణంలో ఓ రాష్ట్ర మంత్రితో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు సంబంధాలు కలిగి ఉన్నారని, పోలీసులకు కూడా సంబంధం ఉందని పేర్కొన్నారు. అలాగే, ప్రభుత్వంతో సంబంధం కలిగి ఉన్న పార్టీలన్నింటికీ కూడా ముడుపులు పోయినట్లు వెల్లడించారు. వెంటనే దీనిపై స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో పేర్కొన్నారు.

19 గంటలు కాలినడకన!

- అరుణాచల్ సరిహద్దుల్లో మెరుగుపడని సౌకర్యాలు
- ఇబ్బందుల నడుమ చేరుకున్న జవాన్లు



న్యూఢిల్లీ : ఈశాన్య రాష్ట్రాల్లో ఇప్పటికీ అభివృద్ధి అంతంత మాత్రమే. ఇక సరిహద్దుల గురించైతే ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇప్పటికే సరిహద్దు గ్రామాల్లో కనీసం రోడ్డు మార్గం కూడా లేదు. ఇలాంటి పరిస్థితుల వల్ల అక్కడి ప్రజలతో పాటు దేశ రక్షణ కోసం అహర్నిశలు విధులు నిర్వహిస్తున్న జవాన్లు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరిహద్దుకు వెళ్లాలంటే కాలినడక తప్ప మరో మార్గం లేకపోవడంతో గంటల పాటు నడుస్తున్నారు. మరోవైపు పొరుగుదేశం చైనాలో మాత్రం పరిస్థితులు ఇందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. చైనా బలగాలు సరిహద్దుల వద్దకు నేరుగా వాహనాల్లో వచ్చేందుకు అక్కడ మెరుగైన రోడ్డు సదుపాయాలున్నాయి. ఇటీవల ఇరు దేశాల మధ్య చోటుచేసుకున్న ఘటనే ఇందుకు నిదర్శనం. భారత్‌చైనా మధ్య గతేడాది డోక్లాం వివాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. దాదాపు రెండున్నర నెలల పాటు నెలకొన్న ఆ ప్రతిష్టంభన గత ఆగస్టులో తొలగిపోయింది. అయితే డోక్లాం తర్వాత మరో ప్రాంతంలోనూ ఇలాంటి వివాదానికి తెరతీసే ప్రయత్నం చేసింది చైనా. అందుకోసం ఇరు దేశాల మధ్య ఎప్పటి నుంచో వివాదాస్పద ప్రాంతంగా ఉన్న అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాన్ని ఎంచుకుంది. ట్యూటింగ్ ప్రాంతంలోని బిషింగ్ గ్రామం వద్ద చైనా రోడ్డు నిర్మాణాన్ని చేపట్టేందుకు ప్రయత్నించింది. దీంతో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే ఇరు దేశాల అధికారుల చొరవతో ఆ సమస్య పరిష్కారమైంది. ఇదిలా ఉండగా.. బిషింగ్ గ్రామం వద్ద ఉన్న సరిహద్దు వద్దకు చైనా తమ సామగ్రితో వాహనంలో చేరుకుంది. ఇది గుర్తించిన ఓ స్థానికుడు వెంటనే భారత సైన్యానికి సమాచారమిచ్చాడు. దీంతో అప్రమత్తమైన ఉన్నతాధికారులు వెనువెంటనే 120 మంది సిబ్బందిని ఆ ప్రాంతానికి వెళ్లమని ఆదేశించారు. నెలరోజుల పాటు అక్కడే ఉండేలా సరకులు కూడా తీసుకెళ్లమని చెప్పారు. అంతా బాగానే ఉంది కానీ.. మరి అక్కడకు వెళ్లడం ఎలా? బిషింగ్ ఓ మారుమూల ప్రాంతం. రోడ్డు సదుపాయం లేదు. అక్కడికి చేరుకోవాలంటే ఎంతో ప్రయాస. కాలినడక తప్ప మరో మార్గం ఉండదు. చేసేదేంలేని పరిస్థితుల్లో భారత జవాన్లు నడకబాట పట్టారు. మరి సరుకుల పరిస్థితి? 120 మంది 30 రోజుల పా టు ఉండాలంటే చాలా సరకులు కావాలి. దీంతో పోర్ట ర్లను ఏర్పాటు చేశారు. ఒక్కొక్కరు 10 నుంచి 15 కిలోల చొప్పున మోసుకుంటూ దాదాపు 300 మంది పోర్టర్లు సరిహద్దుకు వెళ్లారు. అలా దాదాపు 19 గంటల పాటు నడిచి సరిహద్దుకు చేరుకున్నారు. రక్షణశాఖ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారమే ఈ విషయాలన్నీ తెలిశాయి. అయితే సరిహద్దుల్లో రోడ్ల నిర్మాణాలకు సంబంధిం చి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది.

దేశవ్యాప్తంగా పలుచోట్ల దుర్ఘటనలు

రోడ్డు, అగ్ని ప్రమాదాల్లో 20మంది మృతి

ముంబై: దేశ వ్యాప్తంగా శనివారం వివిధ ప్రాంతాల్లో జరిగిన దుర్ఘటనల్లో 20మంది ప్రాణాలు కోల్పోయారు. రోడ్డు ప్రమాదం, అగ్నిప్రమాదం, బోటు ప్రమాదం వంటి ఘటనలు వారి పాలిట శాపంగా మారాయి. వారి బంధువులకు, ఆప్తులకు శోకాన్ని మిగిల్చాయి.

మహారాష్ట్రలో రోడ్డు ప్రమాదం..

కోడేగాం సాంగ్లీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు చనిపోయారు. చనిపోయిన వారిలో ఐదుగురు మల్లయోధులు కూడా ఉన్నారు. వీరు ప్రయాణిస్తున్న ఎస్‌యువి వాహనాన్ని వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఒక స్థానిక మల్లయుద్ధ పోటీలో పాల్గొని తిరుగు ప్రయాణం అవుతున్న వారిని మృత్యువు పలకరించింది. ప్రమాదంలో ఆరుగురు చనిపోయారని, ఏడుగురు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ఐపిసిలో సెక్షన్ల ప్రకారం, మోటారు వాహన చట్టంలో సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు. పరారీలో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

జైపూర్‌లో గ్యాస్ సిలండర్ పేలుడు..

జైపూర్‌లో విద్యానగర్‌లో జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి చెందారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో గ్యాస్ సిలండర్ పేలడంతో ఆ ఫ్లోర్‌లో ఉన్న ముగ్గురు వ్యక్తులు మరణించారు. ఆ మంటలు మొదటి అంతస్థుకు వ్యాపించడంతో అక్కడ ఉన్న మరో ఇద్దరు ప్రాణాలను కోల్పోయారు. మొదటి అంతస్తులో ఉన్న వారు ఊపిరి ఆడకపోవడంతో ప్రాణాలను కోల్పోయినట్లు అదనపు డిసిపి రాజేష్ మీల్ తెలిపారు. అగ్నిమాపక దళాలు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆపివేశారు.

చత్తీస్‌గఢ్‌లో రోడ్డు ప్రమాదం..

వేగంగా వస్తున్న ఒక ట్రక్కు ఎదురుగా వస్తున్న మోటారు సైకిలును ఢీకొనడంతో నలుగురు మృతి చెందారు. మరణించిన వారిలో ముగ్గురు విద్యార్థులు ఉన్నారు. ఈ దుర్ఘటన గుర్దా గ్రామంలో కార్సియా పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. విద్యార్థులంతా పాఠశాల నుంచి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడి కక్కడే వారంతా మృతి చెందారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రక్కు డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ దుర్ఘటనకు సంబంధించి కేసు నమోదు చేశారు.

గుజరాత్‌లో అగ్ని ప్రమాదం..

రాజ్‌కోట్‌కు సమీపంలో ఓ ఆధ్యాత్రిక కార్యక్రమంలో విషాదం చోటు చేసుకుంది. శిబిరంలోని మహిళా విభాగంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దీంతో శిబిరంలో ఉన్న ముగ్గురు యువతులు చనిపోయారు. 15 మంది గాయాల పాలయ్యారు. స్వామి ధర్మ బంధూజీ నిర్వహించిన ఈ కార్యక్రమం గుజరాత్ రాష్ట్రంలో ఎంతో ప్రసిద్ధి చెందినది. హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ తదితరులు ఈ కార్యక్రమానికి గతంలో హాజరయ్యారు.

కేరళలో విద్యార్థి మృతి..

పాఠశాల ఆవరణలో ఉన్న టాయిలెట్ గోడ ఆరేళ్ల బాలుడి పట్ల మృత్యువుగా మారింది. ఇంటర్వెల్ సమయంలో టాయిలెట్‌కు వెళ్లిన ఆ బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. గోడ కూలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లిన ప్రయోజనం లేకపోయింది.కేరళలో జరిగిన ఈ ఘటన ప్రభుత్వ పాఠశాలల అధ్వాన్న స్థితిని మరోసారి ప్రపంచానికి చాటింది. ప్రభుత్వ పాఠశాల్లో సదుపాయాలపై మరోసారి చర్చకు దారితీసింది.

మహారాష్ట్రలో పడవ ప్రమాదం..

పాల్‌గర్ జిల్లాలో ధాను తీరంలో జరిగిన పడవ ప్రమాదంలో ఇద్దరు గల్లంతయ్యారు. 32మంది సురక్షితంగా బయటపడ్డారు. విహార యాత్ర వారి జీవితంలో విషాదయాత్రగా మిగిలింది. పొండా పాఠశాలకు చెందిన విద్యార్థులు, పార్నాకా జూనియర్ కాలేజీ విద్యార్థులు విహార యాత్రకు బయలు దేరారు. ప్రయివేటు బోటులో శికారు చేసేందుకు సమాయత్తం అయ్యారు. ధాను తీరం నుంచి 20 మైళ్ల దూరంలో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు కోస్ట్‌గార్డ్ అధికార ప్రతినిధి ఒక తెలిపారు. గాలింపు చర్యలు వేగంగా జరుగుతున్నాయి. కోస్ట్‌గార్డ్‌కి చెందిన ఓడలు, ఎయిర్ క్రాఫ్ట్ లు రంగంలో దిగడంతో సహాయక చర్యలు వేగవంతంగా జరిగాయి.

ముంబై విమానాశ్రయం వద్ద అగ్ని ప్రమాదం..

ముంబై విమానాశ్రయంలోని డొమెస్టిక్ టెర్మినల్ బి 1 వద్ద స్వల్ప అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మొదటి అంతస్థులోని కాన్ఫరెన్స్ హాలు వద్ద మంటలు అంటుకున్నాయి. అక్కడి నుంచి అవి వ్యాపించి మొదటి అంతస్థులో ఉన్న లాంజ్ వరకు వ్యాపించాయి. ఇది ఎయిర్‌పోర్ట్ గేట్ నెంబర్ 9 వద్ద ఉంది.అగ్నిమాపక దళాలు 8 ఇంజన్లతో రంగంలో దిగి మంటలను ఆర్పివేశాయి.

ఉత్తర ప్రదేశ్‌లో పట్టాలు తప్పిన రైలు..

ముజఫర్‌నగర్‌లో ఒక ప్యాసింజర్ రైలు పట్టాలు తప్పింది. షామ్లీ జిల్లాలో శనివారం ఉదయం ఈ సంఘటన జరిగింది. ప్రమాదంలో ఎటువంటి ప్రాణహానీ జరగలేదు. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనపై రైల్వే అధికారులు దర్యాప్తుకు ఆదేశించారు.

సిద్ధమవుతున్న అణుక్షిపణి అగ్ని5

న్యూఢిల్లీ: అణు క్షిపణి అగ్ని5ను పరీక్షించేందుకు భారత్ సన్నాహాలను ముమ్మరం చేసింది. అన్నీ అనుకూలంగా ఉంటే ఈ నెల 18, 19 తేదీల్లో ఒక రోజు అగ్ని క్షిపణని పరీక్షించవచ్చని నిపుణులు భావిస్తున్నారు. ఈ పరీక్షలను భారత సైన్యానికి చెందిన వ్యూహాత్మక దళాల కమాండ్ నిర్వహించనుంది. ఇప్పటికే ఈ క్షిపణి పనితీరును ట్రాక్ చేయడానికి అవసరమైన పరికరాలను సిద్ధం చేశారు. కేవలం సంక్షోభ సమయంలో ఎంత త్వరగా ఈ క్షిపణిని ప్రయోగించగలమనేది తెలుసుకునేందుకు ఈ పరీక్ష నిర్వహించన్నట్లు సమాచారం. 17 మీటర్ల పొడవు.. రెండు మీటర్ల చుట్టుకొలత ఉండే క్షిపణి 1.5 టన్నుల వార్ హెడ్‌ను మోసుకెళ్లగలదు. క్షిపణి మొత్తం బరువు 50టన్నులు. ఈ క్షిపణి ప్రత్యర్థుల రాడార్లకు అందకుండా ప్రయాణించగలదు. ఇది ఏకకాలంలో పలు లక్ష్యాలపై దాడి చేసే విధంగా దీనిని ప్రస్తుతం అభివృద్ధి చేస్తున్నారు. ఈ క్షిపణికి దాదాపు 5,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం ఉండటంతో పరీక్ష సమయంలో ఇండోనేషియా, ఆస్ట్రేలియాలను అప్రమత్తం చేయడంతో పాటు, వాయు మార్గం, జల మార్గాలను కూడా నియంత్రించనున్నారు.

సోమవారానికి సర్దుకుంటాయి

అటార్నీ జనరల్ వేణుగోపాల్

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సీనియర్ న్యాయమూర్తుల మధ్య ఏర్పడిన విభేదాలు సోమవారం నాటికి సర్దుకుంటాయని అటార్నీ జనరల్ వేణుగోపాల్ అన్నారు. శనివారం ఆయన ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) తీరుపై సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ గొగోయ్, జస్టిస్ మదన్ బి.లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంలో అటార్నీ జనరల్ వేణుగోపాల్ మాట్లాడుతూ 'సోమవారం నాటికి సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తుల మధ్య సఖ్యత ఏర్పడుతుంది. దీన్ని మరింత పొడిగించాలని అనుకోవడం లేదు' అని ఆయన స్పష్టం చేశారు. నిన్న మీడియా సమావేశం నిర్వహించిన నలుగురు సీనియర్ న్యాయమూర్తులతో ప్రధాన న్యాయమూర్తి ఆదివారం భేటీ అయ్యే అవకాశం ఉంది. భారత దేశ న్యాయవ్యవస్థ చరిత్రలోనే తొలిసారిగా నలుగురు సీనియర్ న్యాయమూర్తులు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడిన విషయం తెలిసిందే. సీజేఐ పనితీరుపై వాళ్లు మాట్లాడారు. గత కొన్ని రోజులుగా సర్వోన్నత న్యాయస్థానంలో పాలన వ్యవహారాలు సవ్యంగా జరగడం లేదని, వాటిని సరిదిద్దేలా సీజేఐని ఒప్పించడంలో తాము విఫలమయ్యామని నలుగురు సీనియర్ న్యాయమూర్తులు చెప్పారు. అందువల్ల విధిలేని పరిస్థితుల్లో ప్రజల ముందుకు వచ్చి వాస్తవాలను వెల్లడించాల్సి వస్తోందన్నారు.



సంకాంత్రి పండుగ సందర్భంగా బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. వరుస సెలవులు రావడంతో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు సైతం ఊరి బాట పట్టడంతో శనివారం బస్, రైల్వేస్టేషన్లలో జనం కిక్కిరిసిపోయారు.

ఓటేయలేదని సామూహిక 'హత్యా'చారం

రాంచీ: జార్ఖండ్‌లో దారుణం చోటు చేసుకుంది. ఎన్నికల్లో తన భార్యకు మద్దతు ఇవ్వలేదని ఓ వ్యక్తి ఒక కుటుంబంపై పగ పెంచుకుని దాష్టీకానికి పాల్పడ్డాడు. ఆ కుటుంబంలోని 13ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడి.. కిరాతకంగా హత్య చేశాడు. ఈ ఘటన రాష్ట్రంలో సంచలనంగా మారింది. అసలేం జరిగిందంటే... పాకూరు జిల్లా లిట్టిపారా గ్రామ పంచాయతీలో 'ముఖియా' పదవి కోసం కొన్నాళ్ల క్రితం ఎన్నికలు జరిగాయి. ప్రేమ్‌లాల్ హంసద అనే వ్యక్తి భార్య ఈ ఎన్నికల్లో పోటీ చేశారు. అయితే బాధిత కుటుంబ సభ్యులు మాత్రం ఆమెకు ఓటు వేయలేదు. దీంతో వారి మూలంగానే తన భార్య ఓడిపోయిందన్న కోపంతో ప్రేమ్‌లాల్ రగిలిపోయాడు. జనవరి 8న బహిర్భూమికని వెళ్లిన బాలికను తన సోదరుల సహకారంతో అపహరించాడు. ఆపై వారంతా కలిసి ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడి, ప్రాణాలు తీశారు. చివరకు బాలిక మృత దేహాన్ని సమీపంలోని బ్లైవాన్ అటవీ ప్రాంతంలో పడేశారు. బాలిక కనిపించకుండా పోయే సరికి ఆందోళన చెందిన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానంతో వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. వారిచ్చిన సమాచారం మేరకు బాలిక శవాన్ని స్వాధీనపరుచుకున్నారు. ఆపై నిందితులపై తల్లిదండ్రుల ఫిర్యాదు చేయటంతో వారిని అరెస్ట్ చేశారు. కాగా, నిందితులు రాజకీయంగా కాస్త పలుకుబడి ఉన్నవారు కావడంతో తొలుత కేసు నమోదు చేసుకునేందుకు పోలీసులు తటపటాయించారు. అయితే ప్రతిపక్షాల ఆందోళన, తల్లిదండ్రుల నిరసన ప్ర దర్శనతో పోలీసులపై విమర్శలు గుప్పించారు. దీంతో ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించి.. తక్షణమే వారిని అరెస్ట్ చేయాలని పోలీస్ శాఖకు ఆదేశాలు జారీ చేసింది.




ఎట్టకేలకు నిందితులను అరెస్ట్ చేసి మీడియా ముందు ప్రవేశపె ట్టారు. ఈ కేసులో ఎలాంటి తమపై ఎలాంటి ఒత్తిళ్లు రాలేదని.. సాక్ష్యాలు సేకరించటంలో జాప్యం మూలంగానే అరెస్ట్ ఆలస్యం అ యిందని పాకూరు జిల్లా ఎస్పీ శైలేంద్ర బర్న్ వాల్ వెల్లడించటం విశేషం. నిందితులు ప్రేమ్‌లాల్, శ్యామూల్, కథి, శిశు హొందలు నేరాన్ని ఒప్పుకోవటంతో వారిని రిమాండ్‌కు తరలించినట్లు వారు వివరించారు.

రికార్డు సృష్టించిన ఢిల్లీ హైకోర్టు

- ఐదేళ్ల కేసుకు 3 గంటల్లో పరిష్కారం
- హత్య కేసులో నిర్దోషిగా తేలిన మోసిన్



న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టు శనివారం అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. ఐదేళ్లుగా నానుతూ వస్తున్న కేసును కేవలం మూడు గంటల్లో పరిష్కరించింది. నిందితుడిని నిర్దోషిగా తేల్చింది. ఎస్ మురళీధరన్, ఐఎస్ మెహతాలతో కూడిన బెంచ్ ఈ కేసును పరిశీలించింది. మోసిన్ అనే 29 ఏళ్ల వ్యక్తి తన సవతి కొడుకును చంపాడనే అభియోగంతో అతడిని అరెస్ట్ చేశారు. తలపై రాయితో మోది హత్య చేసి ఉండవచ్చని అనుమానించిన ట్రయిల్ కోర్టు 2017 సెప్టెంబర్‌లో అతడికి యావజ్జీవ శిక్ష విధించింది. ట్రయల్ కోర్టు తీర్పును సవాలు చేస్తూ మోసిన్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాడు. మోసిన్ తరపున సుమీత్ వర్మ న్యాయవాదిగా తన వాదనలు వినిపించారు. మోసిన్ నిర్దోషి అని బలమైన వాదనను వినిపించారు. ఢిల్లీ హైకోర్టు కూడా ట్రయిల్ కోర్టు తొందర పడిందని వ్యాఖ్యానించింది. బాలుడు చనిపోయిన రోజు వారు పడుకున్న గదిలో నుంచి గడియ పెట్టలేదని, ఆ విషయాన్ని ట్రయిల్ కోర్టు గుర్తించలేదని ఢిల్లీ హైకోర్టు తెలిపింది. బాలుడి తలకు తగిలిన గాయం వేరే విధంగా కూడా జరిగేందుకు అవకాశముందని ఢిల్లీ హైకోర్టు తెలిపింది.



గ్లోబల్ వార్మింగ్‌కు ఆ దేశాలే బాధితులు

ఐక్యరాజ్యసమితి : ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్‌కు ఆఫ్రికా దేశాలే ప్రధాన బాధితులని యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గట్టర్స్ అన్నారు. ఈక్వెడార్‌లో నిర్వహించిన 'జీ77 దేశాలు –చైనా'సమావేశంలో ప్రపంచ వ్యాప్తంగా పెరిగిపోతున్న గ్లోబల్ వార్మింగ్ పై చర్చించారు. మేము మారుతున్న వాతావరణం చేతిలో ఓడిపోలేదు..అలాగని దీనికోసం జరుగుతున్న యుద్ధంలో గెలవనూ లేదని గట్టర్స్ పేర్కొన్నారు. దీనిపై పోరాడటానికి తీవ్రంగా కృషి చేస్తున్నట్లు ప్రకటించారు. గ్లోబల్ వార్మింగ్ వలన ముఖ్యంగా జీ77 దేశాలు, ఆఫ్రికన్ దేశాలు కరవుతో ఇబ్బందిపడుతున్నాయన్నారు. అదేవిధంగా చిన్నచిన్న ద్వీపాలు సైతం భారీ హరికేన్లతో ముంపునకు గురవుతున్నాయని అభిప్రాయపడ్డారు. మరోవైపు ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలైన చైనా, భారత్ మాత్రం గ్లోబల్ వార్మింగ్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. ఇతర దేశాల దీని పట్ల అశ్రద్ధ చూపినప్పుడు ఈ రెండు దేశాలు ముందుండి ఎదుర్కొంటున్నాని కొనియాడారు.

ఇరాన్‌పై అమెరికా ఆఖరి విడత ఆంక్షలు

వాషింగ్టన్: ఇరాన్‌పై తాజా ఆంక్షలు విధించకుండా 2015 నాటి అణు ఒప్పందాన్ని సజీవంగా ఉంచాలని ఒక ప్రక్క అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శనివారం ప్రకటించగా, మరోప్రక్క ఆయన పాలనా యంత్రాంగం మరో విడత కఠిన ఆంక్షలను ఆ దేశంపై ప్రకటించింది. మొత్తం 14 మంది వ్యక్తులు, సంస్థలపై తాజా ఆంక్షలను ప్రకటించింది. అమెరికా ఆ ఒప్పం దం ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ మరి ఆరు ప్రపంచ శక్తిమంతమైన దేశా ల మధ్య కుదిరిన తర్వాత 2015లో ఆ దేశంపై ఆంక్షలను ఎత్తివేసిందని పాలనాధికార్లు వివరించారు. ప్రస్తుతం ప్రకటించినవి ఆఖరి విడత ఆంక్షల ని వివరించారు. ఇరాన్ ప్రభుత్వం ఖండాంతర క్షిపణులు తయారు చేయకుండా కట్టడి చేయడం కోసం ఇతర యూరోపియన్ భాగస్వాములతో చర్చించాలని ట్రంప్ యోచిస్తున్నట్లు వారు చెప్పారు.

సౌదీ మహిళలకు మరో స్వేచ్ఛ

ఫుడ్ బాల్ స్టేడియంకు అనుమతి

జెద్దా: ఇదే తొలిసారిగా మహిళలను ఫుడ్ బాల్ స్టేడియంలోనికి సౌదీ అరేబియా అనుమతించింది. శుక్రవారం నాడు ఆ మహిళలు ప్రత్యక్షంగా ఒక ఫుడ్ బాల్ మ్యాచ్‌ను తిలకించారు. అత్యంత మితవాద దేశమైన సౌదీ దశాబ్దాల కిందటి స్త్రీ పురుష భేదాలకు స్వస్తి పలుకుతోంది. మహిళలపై కఠిన ఆంక్షలకు పేరుబడిన సౌదీ ప్రభుత్వం మహిళల డ్రైవింగ్ పై గల నిషేధాన్ని కొంత కాలం క్రితం తొలగించింది. అలాగే వారికి సినిమా హాళ్లను తెరిచింది. ఇప్పుడు ఫుడ్ బాల్ క్రీడను తిలకించే అవకాశం కల్పించింది. సాంప్రదాయక నల్ల దుస్తుల్లో మహిళలు నిన్నటి మ్యాచ్ తిలకించడానికి ముందే చేరుకున్నారు.

రాజకీయ ఉపన్యాసంపై హార్దిక్ పటేల్‌పై కేసు

జాంనగర్: విద్యా, రైతు సంక్షేమ కార్యక్రమానికి అనుమతి తీసుకుని రాజకీయ ఉపన్యాసం చేశారనే ఆరోపణలతో పాటిదార్ ఉద్యమ నేత హార్దిక్ పటేల్‌పై కేసు నమోదు చేశామని శనివారం పోలీసులు తెలిపారు. రెండు నెలల క్రితం గుజరాత్‌లోని జామ్‌నగర్ జిల్లాలోని ధుతార్‌పర్ గ్రామంలో కార్యక్రమం నిర్వహించేందుకు అనుమతిచ్చామన్నారు. హార్దిక్ పటేల్ ప్రసంగంతో ఈ కార్యక్రమం రాజకీయ కార్యక్రమంగా మారిందని జామ్‌నగర్ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ఆర్‌కె పటేల్ తెలిపారు. కార్యక్రమానికి అనుమతి తీసుకునేటప్పుడు ఇచ్చిన షరతులను హార్దిక్ పటేల్, మరో నాయకుడు అంకిత్ ధాడియా ఉల్లంఘించారని ఫిర్యాదు అందిందని పోలీసులు తెలిపారు. ఆయనపై జామ్‌నగర్ ఎ డివిజన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదు అయింది.

ఢిల్లీలో సంక్రాంతి సంబరాలు

మన తెలంగాణ/న్యూఢిల్లీ : సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే రీతిలో ఢిల్లీని రెండు తెలుగు రాష్ట్రాల ఉమ్మడి భవన్‌లో సంక్రాంతి సంబరాలు శనివారం వేడుకగా ప్రారంభమయ్యాయి. జానపద కళారూపాలు, హరిదాసులు, జంగందేవర, బుడబుక్కల వేషదారులు, పగటి వేషాలను రాజమండ్రికి చెందిన శాంతి వినోద్, వి. కృష్ణ బృందం ప్రదర్శించిన ప్రదర్శనలు ఎంతో అలరింప చేశాయి. కృష్ణా జిల్లా పెదకళ్ళేపల్లి గ్రామానికి చెందిన డప్పు కళాకారులు బి. వెంకటేశ్వర రావు బృందం ప్రదర్శించిన కనక తప్పెట్ల విన్యాసం, జానపద సంస్కృతికి అద్దంపట్టింది. కీర్తిశేషులు పద్మభూషణ్ డా. వెంపటి చినసత్యం విరచితమైన కొలువైతివా రంగశాయి, బృందావన నిలయే కూచిపూడి నృత్యాన్నితన అభినయంతో కుమారి ఎం.ఎస్.వి. వైష్ణవి ప్రేక్షకులను మెప్పింప చేసింది. శ్రీమతి అపర్ణ రాజా రామన్ బాలాజీ, వీరి శిష్య బృందం ప్రదర్శించిన భరతనాట్యం ఆహూతులను అలరింప చేశాయి. సిద్ధార్ధ కృష్ణ బృందం ప్రదర్శించిన అస్సాం రాష్ట్రంలో సంప్రదాయంగా చేసుకొనే భిహు నృత్యం ఆరాష్ట్ర సంస్కృతిని తెలియ చేసింది. ఆదిలీలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గులు (రంగవల్లులు) పోటీలలో చిన్నారులు, యువతులు ఉత్సాహంగా పాల్గొని ఉమ్మడి భవన్ ప్రాంగణాన్ని రంగవల్లులతో తీర్చిదిద్దారు. ఈ పోటీల్లో కుమారి మౌనిక ప్రథమ స్థానం కుమారి రుచిక ద్వితీయ స్థానం పూజ, పూర్ణిమలు తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచారు. తేవా మహిళా మణులు ప్రదర్శించిన హాస్యవల్లరి ఆహూతులను ఆద్యంతం నవ్వులలో ముంచెత్తాయి.

షెరిన్ హత్య కేసులో పెంపుడు తండ్రిపై అభియోగాలు నమోదు



హ్యూస్టన్ : అమెరికాలో షెరిన్ మాథ్యూస్ అనే మూడేళ్ల భారత చిన్నారి హత్యకు గురైన కేసు లో.. ఆమె పెంపుడు తండ్రి వెస్లీ మాథ్యూస్‌పై డల్లాస్ కౌంటీ గ్రాండ్ జ్యూరీ (విచారణకర్తలు) అభియోగాలను మోపింది. గత అక్టోబర్ 7న పాలు తాగనందుకు శిక్షగా షెరిన్‌ను తాను ఇం టి బయట నిలబెట్టానని.. తర్వాత ఆమె అదృశ్యమైందని వెస్లీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చిన్నారి కోసం పోలీసులు విస్తృత గాలింపు చేపట్టగా.. రెండు వారాల అనంతరం వెస్లీ ఇంటికి కి.మీ. దూరంలోని ఓ కల్వర్టు వద్ద షెరిన్ మృతదేహం అనుమానస్పద స్థితిలో లభించింది. తాను బలవంతంగా పాలు తాగించడంతో.. ఊపిరాడక షెరిన్ మృతిచెందిందని వెస్లీ అప్పుడు మాట మార్చాడు. శవపరీక్ష ఫలితాలు మారణాయుధంతోనే షెరిన్‌ను హత్య చేసినట్లుగా వెల్లడిస్తున్నాయని తాజాగా గ్రాండ్ జ్యూరీ పేర్కొం ది. హత్య, చిన్నారిని నిర్దాక్షిణ్యంగా వదిలిపెట్టడం, సాక్ష్యాలను తారుమారు చేయడం తదితర అభియోగాలను వెస్లీపై మోపింది. వెస్లీ భార్య సిని మాథ్యూస్‌పై కూడా చిన్నారిని నిర్దాక్షిణ్యంగా వదిలివేసిన ఆరోపణను మోపింది. ఈ భారతీయ అమెరికన్ దంపతులిద్దరూ ప్రస్తుతం జైల్లోనే ఉన్నారు. సొంత కుమార్తెకు సంబంధించి వారికి ఉన్న సంరక్షణ హక్కులను డల్లాస్ కౌంటీ కోర్టు తాత్కాలికంగా రద్దుచేసింది. అభియోగాలు రుజువైతే గరిష్ఠంగా వెస్లీకి మరణశిక్ష, సినికి 20ఏళ్ల వరకు జైలుశిక్ష పడే అవకాశాలున్నాయి.

ట్రంప్ యుకె పర్యటన రద్దు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ యూకే పర్యటనను రద్దు చేసుకున్నారు. లండన్‌లో వచ్చే నెలలో నూతన ఎంబసీ కార్యాలయాన్ని అధికారికంగా ప్రారంభించడానికి వెళ్లాల్సి ఉండగా ట్రంప్ వెళ్లడంలేదు. గత ఒబామా ప్రభుత్వం సెంట్రల్ లండన్‌లో ఉన్న అమెరికా ఎంబసీ కార్యాలయాన్ని దూరంగా వేరే చోటుకు తరలించడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఒబామా లండన్ ఎంబసీని పల్లీలకు అమ్మేశారని, ఇది చాలా చెత్త డీల్ అని ట్వీట్ చేశారు. అందుకే తాను కొత్త కార్యాలయం ప్రారంభించేందుకు వెళ్లడం లేదని చెప్పుకొచ్చారు. ఒబామా హయాంలో ఎంబసీని లండన్‌లోని గ్రోస్‌వెనార్ స్క్వేర్ నుంచి థేమ్స్ నది తీరంలోని నైన్ ఎల్మ్ ప్రాంతానికి తరలించారు. 'లండన్ పర్యటన రద్దు చేసుకోవడానికి కారణం.. లండన్‌లో మంచి ప్రాంతంలో ఉన్న ఎంబసీని పల్లీలకు అమ్మేసిన ఒబామా అడ్మినిస్ట్రేషన్‌కు నేనేమీ అభిమానిని కాదు, దూర ప్రాంతంలో భవనం కట్టడానికి కేవలం 1.2 బిలియన్ డాలర్లకు అమ్మేశారు. చెత్త డీల్. నన్ను వచ్చి రిబ్బన్ కట్ చేయమన్నారు..నో' అని ట్రంప్ ట్వీట్ చేశారు. లండన్‌లో జనవరి 16న కొత్త కార్యాలయ భవనాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి యూఎస్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ రెక్స్ టిల్లర్‌సన్ వెళ్లనున్నారు. ట్రంప్ ఫిబ్రవరిలో లండన్ వెళ్లాల్సి ఉండగా పర్యటనను రద్దు చేశారు. ట్రంప్ లండన్ వస్తే పెద్ద ఎత్తున నిరసన చేపట్టేందుకు ఆయన వ్యతిరేకులు సన్నాహాలు చేశారు. లండన్ పర్యటనలోట్రంప్ బ్రిటన్ ప్రధాని థెరిసా మేతో కూడా సమావేశం కావాల్సి ఉంది. ట్రంప్ పర్యటన రద్దు చేసుకోవడంతో ఇరు దేశాల సంబంధాలపై ప్రభావం పడే అవకాశం ఉంది.

పదాతి దళంతో యుద్ధానికి

అమెరికా సన్నాహాలు!



వాషింగ్టన్ : ఉత్తర కొరియాతో యుద్ధానికి సిద్ధమవ్వడానికి అమెరికా శక్తియుక్తులను కూడదీసుకుంటోంది. ఇప్పటి వరకు వైమానిక దాడులు చేస్తామన్నట్లు ఎంతో హడావుడి చేసిన అమెరికా తాజాగా అందిన వేగుల సమాచారం ఆధారంగా రూటు మార్చుకొంది. ఆకాశ యుద్ధం చేయడం వల్ల ఉత్తర కొరియా అణుబాంబులను భద్రపర్చిన ప్రదేశాలను గుర్తించలేమని నిపుణులు నివేదికలు ఇవ్వడంతో పదాతి దళంతో యుద్ధానికి దిగాలని నిర్ణయించుకుంది. అయితే, ఉత్తర కొరియా మొత్తం భారీగా సొరంగాలు ఉన్నాయని సైనిక నిఘా వర్గాలు ధ్రువీకరించుకున్నాయి. ఉత్తర కొరియా సరిహద్దుల్లోనే దాదాపు 5వేల సొరంగాలు ఉన్నట్లు అమెరికా సైనిక వర్గాలు గుర్తించాయి. దీంతో వేలసంఖ్యలో అమెరికా సైనికులకు ప్రత్యేక శిక్షణను ప్రారంభించారు. సొరంగాల్లో ఏ విధంగా యుద్ధం చేయాలో ఈ శిక్షణలో నేర్పిస్తున్నారు. దీనికోసం పెంటగాన్ పెద్ద ఎత్తున సైన్యానికి ఉపయోగపడే పరికరాలను కొనుగోలు చేసింది. ప్రస్తుతం శిక్షణ పొందుతున్న సైనికులకు తోడు వాయుసేనలోని 101 ఎయిర్‌బార్న్ డివిజన్, 82వ ఎయిర్‌బార్న్ డివిజన్‌లకు కూడా ఈ శిక్షణ ఉండవచ్చని భావిస్తున్నారు. సాధారణంగా సొరంగ యుద్ధానికి ఒకటి లేదా రెండు డివిజన్లనే సిద్ధం చేస్తారు. కానీ, ఉత్తర కొరియాలోని పరిస్థితికారణంగాభారీ సంఖ్యలో సైనికులకు ఈ శిక్షణను ఇవ్వాల్సి వస్తోంది. ఉత్తర కొరియాలోని సొరంగాలు ప్రమాదకర ఆయుధాలకు అడ్డాలని అమెరికా నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. వీటిల్లో శతఘ్నులు, అణు, జీవ, రసాయన ఆయుధాలు ఉండవచ్చని భావిస్తున్నారు. ఇప్పటికే ఉత్తరకొరియా వద్ద దాదాపు 5,000 టన్నుల జీవ, రసాయన ఆయుధ నిల్వాలు పోగుబడి ఉన్నట్లు నిఘా సమాచారం. ఉత్తరకొరియా పాలకుడు కిమ్ 2 సంగ్ పాలనలోనే సొరంగాలకు శ్రీకారం చుట్టారు. దక్షిణ కొరియాపై దాడి చేయాలనే లక్ష్యంగా వీటిని నిర్మించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. గంటకు 30,000 మంది సైనికులు వీటి ద్వారా వేగంగా దక్షిణ కొరియాలో చొరబడేలా చేయాలన్నది అప్పట్లో ఆయన లక్ష్యం.ఈ విషయాన్ని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. అప్పట్లో ఒక టన్నెల్‌ను ఏకంగా ద.కొరియా రాజధాని సియోల్‌కు 32మైళ్ల సమీపం వరకు తవ్వారు.

ట్రంప్ ఆరోగ్యం భేషుగ్గా ఉంది



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని, ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు తెలిపారు. అధ్యక్షుడిగా ట్రంప్ ఏడాది పూర్తి చేసు కున్న నేపథ్యంలో శనివారం ఆయనకు వైద్యపరీక్షలు నిర్వహిం చారు. వాల్టర్ రీడ్ నేషనల్ మిలిటరీ మెడికల్ సెంటర్‌లో డాక్టర్ రోనీ జాక్సన్ నేతృత్వంలో కొన్ని గంటల పాటు ఈ పరీక్షలు జరిగాయి. బిపి, కొలెస్ట్రాల్, బ్లడ్ షుగర్, గుండె స్పందన, బరువు వంటి పరీక్షలు చేశారు. పరీక్షల అనంతరం డాక్టర్ రోనీ జాక్సన్ కొద్ది సేపు మీడియాతో మాట్లాడారు. ట్రంప్ చక్కగా ఆరోగ్యంగా ఉన్నారని రోనీ అన్నారు. ట్రంప్ ఆరోగ్యస్థితిపై పూర్తి నివేదిక ను జనవరి 16న మీడియాకు వెల్లడించనున్నారు. గత మూడు ప్రభుత్వాల సమయంలోనూ డాక్టర్ రోనీనే అధ్యక్షుడికి ఫిజీషియన్‌గా వ్యవహరిస్తున్నారు. సాధారణం గా ప్రతి అధ్యక్షుడికి రొటీన్ హెల్త్ పరీక్షలు నిర్వహిస్తుంటారు. అయితే ఇటీవల కొందరు ఆయన మానసిక స్థితిపై అనుమానాలు వ్యక్తంచేశారు. ఆయన చేస్తున్న వ్యాఖ్యలు, ప్రవర్తిస్తున్న తీరును చూస్తుంటే ఆయన మానసికంగా ఫిట్‌గా లేరంటూ ఎద్దేవా చేశారు. దీంతో ఆగ్ర హించిన ట్రంప్ తనను తాను చాలా తెలివైన వ్యక్తినని, స్మార్ట్ అని ట్విటర్‌లో పేర్కొన్నారు. అయితే ఈ రోజు జరిగిన వైద్య పరీక్షల్లో ట్రంప్ మెంటల్ ఫిట్‌నెస్ టెస్ట్ లేదని ఇప్పటికే వైట్‌హౌస్ వెల్లడించింది.

ట్రంప్ 'మరో లీల' వెలుగులోకి..!


ట్రంప్ అంటేనే వివాదాలకు మారుపేరుగా మారి పోయారు. నిత్యం ఏదో ఒక వివాదం అతణ్ని చుట్టుముడుతూనే ఉంది. అక్కడి మీడియా కొత్తగా ఒక విషయాన్ని వెల్లడించింది. ఎన్నికల్లో తనకు అడ్డు రాకూడదని ఓ పోర్న్ స్టార్‌కు డబ్బిచ్చి మాట్లాడకుండా చేశారని వెల్లడించింది. 2006లో జరిగిన ఓ గోల్ఫ్ లీగ్ సమయంలో ట్రంప్‌కు స్టెఫానీ క్లిఫోర్డ్ అనే పోర్న్ స్టార్‌తో పరిచయం ఏర్పడింది. తరవాత కూడా ట్రంప్ ఆమెను కలిశాడు. ఎన్నికల సమయంలో ఈ విషయాన్ని బయట పెట్ట కూడదని తన లాయర్ ద్వారా స్టెఫానీకు పెద్ద మొత్తంలో డాలర్ల ను ముట్టజెప్పాడని అక్కడి మీడియాలో వార్తలు వెలువడ్డాయి. అయితే, ఈ వార్తలను వైట్‌హౌస్ కొట్టివేసింది. అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో చాలామంది మహిళలు ట్రంప్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే.

భారత సంతతి వ్యక్తికి ఎనిమిదేళ్ల శిక్ష విధించిన యుకె కోర్టు

తండ్రిని కారు బాంబు ద్వారా చంపేందుకు పథకం

కుట్రను భగ్నం చేసిన పోలీసులు

లండన్ : భారత సంతతికి చెందిన గుర్‌తేజ్ సింగ్‌కు యుకె కోర్టు ఎనిమిదేళ్ల శిక్ష విధించింది. తన ప్రేమకు అడ్డుతగులుతున్నాడనే కోపంతో తండ్రినే హతమార్చాలని చేసిన కుట్రను నేషనల్ క్రైమ్ ఏజెన్సీ బృందం భగ్నం చేసింది. అతడు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన కారు బాంబుకు బదులుగా డమ్మీ బాంబును అతడికి పంపారు. ఆ నకిలీ బాంబును అతడు ఏం చేయదలచుకున్నాడో జాగ్రత్తగా పరిశీలించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 2017 మే నెలలో అతడిని అరెస్టు చేశారు. అదే ఏడాది నవంబర్‌లో దోషిగా తేల్చారు. అప్పటి నుంచి అతడు పోలీసుల అదుపులోనే ఉన్నాడు. రెండు రోజుల క్రితం (జనవరి 12) అతడికి కోర్టు శిక్ష ఖరారు చేసింది. 8 ఏళ్ల జైలు శిక్షను వేసింది. తీర్పు వెలువరించిన న్యాయమూర్తి గుర్‌తేజ్ గురించి పలు కీలక వ్యాఖ్యలు చేశారు.ప్రేమించిన యువతి కోసమే ఈ విధంగా చేశావని, ఆమెతో కలిసి యూనివర్సిటీలో పై చదువులు చదివేందుకు సన్నాహాలు చేస్తున్నావని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. తండ్రిని కారు బాంబు ద్వారా చంపి జీవితంలో ఎలా పైకి ఎదగాలని అనుకుంటున్నావని న్యాయమూర్తి ప్రశ్నించారు. చాలా తెలివైన వాడివని, ఎటువంటి విషయాన్నైనా తారుమారు చేయగల శక్తి నీకుందని న్యాయమూర్తి గుర్‌తేజ్ గురించి అన్నారు. ఆమెతో కలిసి ఉండేందుకు ఆమె కుటుంబానికి, స్వయంగా మీ తండ్రికి ఎన్నో అబద్ధాలు చెప్పావనేవిషయాన్ని తాము గుర్తించామని న్యాయమూర్తి తెలిపారు.



కేంద్ర పథకాలకు నిధుల గ్రహణం

తొమ్మిది నెలలైనా 50% దాటని నిధుల విడుదల

మన తెలంగాణ / హైదరాబాద్ : ఆర్థిక సంవత్సరం ముగిసి తొమ్మిది నెలలైనా వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. ఇప్పటివరకు రూ. 9,586.56 కోట్ల మేరకు కేంద్రం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉన్నప్పటికీ కేవలం రూ. 3,820.83 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. కేంద్రం నుంచి నిధుల విడుదలలో జాప్యం తలెత్తరాదన్న ఉద్దేశంతోనే కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి 1వ తేదీకి మార్చినా ఆచరణలో మాత్రం ఆ మేరకు ఫలితం కనబడడంలేదు. తెలంగాణ ప్రభుత్వానికి దాదాపు 25 మంత్రిత్వశాఖల నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి డిసెంబరు 20వ తేదీ వరకు రూ. 3,820.83 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. ఇంకా రూ. 5,765.73 కోట్ల మేరకు విడుదల కావాల్సి ఉంది. కేంద్ర బడ్జెట్ అంచనాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు మొత్తం రూ. 14,067.07 కోట్లను ఖర్చు పెట్టాల్సి ఉంది. ఇందులో కేంద్రం తన వాటాగా రూ. 9,586.56 కోట్లను విడుదల చేయాల్సి ఉంది. మిగిలిన దాన్ని రాష్ట్రం తన వాటాగా వెచ్చించాల్సి ఉంది. కొన్ని పథకాలకు కేంద్రం 60%, మరికొన్ని పథకాలకు 100% వాటాను ఇస్తుంది. రోడ్లు, బ్రిడ్జిలు, షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తరగతులు, వెనకబడిన తరగతులు... ఇలా కొన్ని మంత్రిత్వశాఖలకు చెందిన పథకాలకు కేంద్రం 100% భరించాల్సి ఉంది. వీటికి కూడా తొమ్మిది నెలలైనా నిధుల విడుదల నామమాత్రంగానే ఉంది. కేంద్రం నుంచి నిధులు విడుదల కాకపోయినా రాష్ట ప్రభుత్వం మాత్రం తన నిధుల్ని వెచ్చించి పగడ్బందీగా అమలుచేస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్ తయారీ పనుల్ని కేంద్రం ఇప్పటికే ప్రారంభించినా నిధుల విడుదల మాత్రం ఆ వేగంతో జరగడంలేదు. ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా తీసుకున్న గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మొత్తం కేటాయింపు రూ. మూడువేల కోట్లు కాగా ఇందులో కేంద్రం తన వాటాగా (90%) రూ. 2700 కోట్లను సమకూర్చాల్సి ఉంది. కానీ డిసెంబరు 20వ తేదీ నాటికి విడుదల కేవలం రూ. 462.04 కోట్లు మాత్రమే. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ నుంచి ఈ ఆర్థిక సంవత్సరానికి కేంద్రం తన వాటాగా రూ. 4354.30 కోట్లను విడుదల చేయాల్సి ఉన్నా తొమ్మిది నెలలు దాటినా కేవలం రూ. 1353.92 కోట్లను మాత్రమే విడుదల చేసింది. ఇక కీలకమైన వ్యవసాయ మంత్రిత్వశాఖ తరపున రాష్ట్రీయ కృషి వికాస్ యోజనకు రూ. 142.50 కోట్లను కేంద్రం తన వాటాగా విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ కేవలం రూ. 63.85 కోట్లను మాత్రమే విడుదల చేసింది. స్థిరీకృత వ్యవసాయం, వ్యవసాయ విస్తరణ సాంకేతిక పథకం, జాతీయ ఆహార భద్రత, ప్రధానమంత్రి కృషి సించాయి యోజన.. ఇలా పన్నెండు పథకాలకు కేంద్రం తన వాటాగా రూ. 479.44 కోట్లను విడుదల చేయాల్సి ఉండగా ఇప్పటికి కేవలం రూ. 293.95 కోట్లను మాత్రమే విడుదల చేసింది. ఇలా దాదాపు పాతిక కేంద్ర మంత్రిత్వశాఖల నుంచి నిడుదల విడుదలలో జాప్యం జరుగుతూ ఉంది. మహిళా శిశు సంక్షేమ మంత్రిత్వశాఖ నుంచి రూ. 512.70 కోట్లకుగాను రూ. 276.99 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. ప్రతి ఏటా కేంద్ర బడ్జెట్‌ను మార్చి చివర్లో లేదా ఏప్రిల్‌లో ప్రవేశపెట్టడం ఆనవాయితీగా ఉండేది. అయితే వాటికి పార్లమెంటు ఆమోదం లభించడం, ఆయా మంత్రిత్వశాఖలకు సంబంధించిన గ్రాంట్లు, డిమాండ్లపై చర్చలు జరిగి ఆమోదం లభించడానికి మే నెల చివరి వరకూ సమయం పడుతున్నందువల్ల నిధుల విడుదలపై స్పష్టత లేదన్న ఉద్దేశంతో కేంధ్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్ సమర్పణను ఫిబ్రవరి 1వ తేదీకే కుదించింది. గతేడాది ఇదే తరహాలో ఫిబ్రవరి 1వ తేదీన బడ్జెట్‌ను సమర్పించినా ప్రభుత్వం ఆశించిన నిధుల విడుదల లక్ష్యం నెరవేరలేదు. ఇందుకు కొన్ని సందర్భాల్లో రాష్ట్రాల నుంచి నిర్దిష్టంగా 'నిధుల వినియోగ ధృవీకరణ పత్రాల' సమర్పణ జరగలేదని కేంద్రం చెప్తూ ఉంది. వాస్తవానికి తెలంగాణ సహా చాలా రాష్ట్రాల నుంచి ఈ పత్రాల సమర్పణ లేకపోవడంతో తదుపరి దఫా నిధుల విడుదలలో జాప్యం జరుగుతూ ఉంది.

మంత్రిత్వశాఖ	కేంద్రం వాటా	విడుదలైన మొత్తం
వ్యవసాయం	రూ. 479.44 కోట్లు	రూ. 293.95 కోట్లు
మహిళా శిశు సంక్షేమం	రూ. 512.70 కోట్లు	రూ. 276.99 కోట్లు
వైద్యారోగ్యం	రూ. 945.59 కోట్లు	రూ. 247.19 కోట్లు
గృహనిర్మాణం	రూ. 871.28 కోట్లు	రూ. 121.04 కోట్లు
కార్మిక ఉపాధి	రూ. 149.73 కోట్లు	రూ. 4.98 కోట్లు
పట్టణాభివృద్ధి	రూ. 329.47 కోట్లు	రూ. 138.47 కోట్లు
గ్రామీణాభివృద్ధి	రూ. 4354.30 కోట్లు	రూ. 1353.92 కోట్లు
సెకండరీ విద్య	రూ. 1139.61 కోట్లు	రూ. 770.97 కోట్లు

ఒంటేరు ప్రతాప్‌రెడ్డిపై అక్రమ కేసులు ఎత్తివేయించాలి

గవర్నర్ కలిసి విజ్ఞప్తి చేసిన టిడిపి



మన తెలంగాణ/హైదరాబాద్ : తెలుగు రైతు విభాగం అధ్యక్షులు ఒంటేరు ప్రతాప్ రెడ్డిపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయించాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు ఎల్. రమణ నేతృత్వంలోని బృందం గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శనివారం ఆయనను రాజ్‌భవన్‌లో కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రమణ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించి వేధించడమే లక్ష్యంగా టిఆర్ఎస్ ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. ఓయూలో మురళి ఆత్మహత్యపై విచారణ చేయమన్న తమ నాయకుడిపై పలు సెక్షన్‌ల కింద తప్పుడు కేసులు పెట్టి జైల్లో పెట్టారని, బెయిల్‌పై విడుదలైన తరువాత కూడా మరోకేసు నమోదు చేసి మళ్లీ జైలుకు తరలించారన్నారు. సొంత నియోజకవర్గానికి చెందిన ఒక యువకుడు ఆత్మహత్య చేసుకుంటే పరామర్శించడానికి వెళ్లడం తప్పా అని ప్రశ్నించారు. ఎవరూ వెళ్లకూడదని ఆంక్షలు పెట్టడం ఎంతవరకు సమంజసమని ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో రాజ్యసభ సభ్యులు గరికపాటి మోహన్‌రావు, టిడిపి నేతలు మోత్కుపల్లి నర్సింహులు,రావుల చంద్రశేఖర్ రెడ్డి, ఇ. పెద్దిరెడ్డి, జి. బుచ్చిలింగం, నన్నూరి నర్సిరెడ్డి, బిఎన్. రెడ్డి తదితరులు ఉన్నారు.

పెట్రోల్ అమ్మకాలలో రాష్ట్రంలోనే జైళ్లశాఖ నెం.1



మన తెలంగాణ/హైదరాబాద్/ మాదన్నపేట్ : తెలంగాణ జైళ్లశాఖ ఆధ్వర్యంలో చంచల్‌గూడ కేంద్ర కారాగార ఆవరణలో ఖైదీల చేత నడుపుతున్న పెట్రోల్ రిటైల్ అవుట్ లెట్ అమ్మకాలలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. నెలకు 700 కిలో. లీటర్స్ చొప్పున తొమ్మిది నెలలో 6300 కిలో.లీటర్స్ అమ్మకాలు జరగడంతో షామీర్ పేట్‌లో శుక్రవారం జరిగిన ఐ.ఓ.సి.ఎల్ డీలర్స్ కన్వెన్షన్ మీటింగ్ హై సేల్స్ అవార్డ్‌ను ప్రకటించారు. ఈ అవార్డ్‌ను జైలర్ విజయ్ కుమార్ అందుకున్నారు. చంచల్‌గూడ సూపరింటెండెంట్ రాజేష్ ఖైదీలకు,సిబ్బందికి అభినందనలు తెలిపారు.

పలుచోట్ల ఐడిసి ఎత్తిపోతలు

మన తెలంగాణ/హైదరాబాద్: చనాకా కొరటా బ్యారేజి బ్యాక్‌వాటర్‌పై వీలున్న చోట్ల ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ (ఐడిసి) ఎత్తిపోతల పథకాలు నిర్మించాలని యోచిస్తోంది. ఇదేవిధంగా ఎల్లంపల్లి, వరద కాలువలపై కూడా ఐడిసి ఎత్తిపోతల పథకాలపై సాధ్యాసాధ్యాలపై ఐడిసి బృందం పరిశీలన చేయనుంది. వచ్చే ఖరీఫ్‌లో కొత్తగా 30 వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు ఇవ్వాలని ఐడిసి నిర్ణయించారు. 11 ఎత్తిపోతల పథకాలను కొత్తగా నిర్మించడానికి ఐడిసి బోర్డు సమావేశం తీర్మానించారు. ఐడిసి అధ్యక్షులు ఈద శంకరరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇఎన్‌సి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో రూ.70 కోట్ల అంచనాతో 3500 ఎకరాలకు నీరిచ్చే దేవూరు పథకం నిర్మాణానికి బోర్డు అంగీకరించింది.ఇదేవిధంగా రూ.56 కోట్లతో బేకియా పథకం (3,175 ఎకరాల ఆయకట్టు), దబ్బల్ప పథకం (2560 ఎకరాలు) రూ.40 కోట్లతో,సుక్రియాల్ పథకం (2,040) రూ.36 కోట్లతో, దపల్లి పథకం (455 ఎకరాలు) రూ.60 కోట్లతో నిర్మించడానికి అంగీకరించారు.ఇదేవిధంగా ధర్మపురి సమీపంలో కంపల్లి పథకం (3585 ఎకరాలు), రూ.38 కోట్లతో, వెలుగు చెరువు పథకం (1,750 ఎకరాలు) రూ.30 కోట్లతో, తమ్మణపేట పథకం (1,550 ఎకరాలు) రూ.40 కోట్లతో నిర్మించనున్నారు. ఆంథోల్‌లో రూ.38 కోట్లతో 3,000 ఎకరాల ఆయకట్టున్న తోవేలమ్మ పథకానికి, హుజూరాబాద్‌లో మరిపల్లి పథకం (540ఎకరాలు) రూ.4 కోట్లతో, బాన్స్‌వాడలో కొడిచర్ల పథకం (1400 ఎకరాలు) రూ.11 కోట్ల అంచనాతో నిర్మించడానికి తీర్మానం చేశారు. ఇదిలా ఉండగా తాంసీ సమీపంలో ఉన్న పథకం చనాకా కొరటా బ్యారేజి బ్యాక్‌వాటర్‌లో ముంపుకు గురవుతుంది. దీన్ని సమీప ప్రాంతాలకు తరలించి, వినియోగించడం, అనువైన ప్రాంతాల పరిశీలన చేయాలని ఐడిసి చైర్మన్ శంకర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

అణు ఒప్పందానికి రష్యా మద్దతు

మాస్కో: ఇరాన్ అణు ఒప్పందం నుంచి వైదొలగితే అమెరికా పెద్ద తప్పు చేసినట్లే అవుతుందని రష్యా శనివారం నాడు హెచ్చరించింది. ఆ అంగీ కారాన్ని సజీవంగా ఉంచడానికి కృషి చేస్తామని రష్యా ప్రకటించింది

మన తెలంగాణ
12
హైదరాబాద్
ఆదివారం
14, జనవరి 2018
www.manatelangana.news

ధోని డిప్యూటీగా సురేశ్ రైనా



చెన్నై: స్పాట్ ఫిక్సింగ్ ఆరోపణల్లో చిక్కుకుని నిషేధానికి గురైన చెన్నై సూపర్ కింగ్స్ ఈ ఏడాది ఐపిఎల్‌లో మళ్లీ బరిలోకి దిగనున్న విషయం తెలిసిందే. ఈ సీజన్ కోసం చెన్నై సూపర్ కింగ్స్ తన స్టార్ క్రికెటర్లు మహేంద్ర సింగ్ ధోని, సురేశ్ రైనా, రవీంద్ర జడేజాలను అంటిపెట్టుకుంది. కాగా, ఈ సీజన్‌లో తమ జట్టు కెప్టెన్‌గా మహేంద్ర సింగ్ ధోనిని నియమించింది. అదే విధంగా వైస్ కెప్టెన్‌గా సురేశ్ రైనాను ఎంపిక చేసింది. ఈ విషయాన్ని సురేశ్ రైనా స్వయంగా వెల్లడించాడు. రెండేళ్ల నిషేధం తర్వాత మళ్లీ బరిలోకి దిగుతున్న తమ జట్టుపై చైన్నై యాజమాన్యం భారీ ఆశలే పెట్టుకుంది. ఈ సీజన్‌లో మెరుగైన ప్రదర్శన ద్వారా సత్తా చాటాలని యాజమాన్యం భావిస్తోంది. ఈ క్రమంలో తమ స్టార్ ఆటగాళ్లు ధోని, రైనాలకు కీలక బాధ్యతలను అప్పగించింది. ధోని సారథ్యంలో చైన్నై ఐపిఎల్‌లో ఎదురులేని శక్తిగా కొనసాగింది. నాలుగు సార్లు ఫైనల్‌కు చేరిన చెన్నై రెండు సార్లు టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈసారి కూడా ధోనిపైనే జట్టు యాజమాన్యం నమ్మకం పెట్టుకొంది. ఈసారి జరిగే వేలం పాటలో ప్రతిభావంతులైన క్రికెటర్లను సొంతం చేసుకోవాలని జట్టు భావిస్తోంది. కాగా, కొత్త సీజన్‌లో మెరుగ్గా రాణిస్తానమనే నమ్మకాన్ని రైనా వ్యక్తం చేశాడు.

చివర్లో పైచేయి



సత్తా చాటిన అశ్విన్, రాణించిన మార్క్రామ్, ఆమ్లా, సౌతాఫ్రికా 269/6

సెంచూరియన్: దక్షిణాఫ్రికాతో శనివారం ప్రారంభమైన రెండో టెస్టులో భారత్ ఆఖరి సెషన్‌లో పుంజుకుంది. టీ–విరామ సమయానికి రెండు వికెట్ల నష్టానికి 182/2తో పటిష్ఠ స్థితిలోఉన్న ఆతిథ్య జట్టును భారత బౌలర్లు ఆట చివర్లో దెబ్బ తీశారు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా 90 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 269 పరుగులు చేసింది. అశ్విన్ మూడు వికెట్లు తీసి సౌతాఫ్రికాను కట్టడి చేశాడు. ప్రత్యర్థి కెప్టెన్ డుప్లెసిస్ (24), కేశవ్ మహారాజ్ (10) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓపెనర్ ఐడెన్ మార్క్రామ్ (94), హాషిం ఆమ్లా (82) అద్భుత బ్యాటింగ్‌తో జట్టును ఆదుకున్నారు.

శుభారంభం..

టాస్ గెలిచిన సౌతాఫ్రికా బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ నిర్ణయం సరైందేనని ఓపెనర్లు నిరూపించారు. డీన్ ఎల్గర్, ఐడెన్ మార్క్రామ్ సమన్వయంతో ఆడుతూ ముందుకు సాగారు. భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న వీరు ఇన్నింగ్స్‌ను పటిష్ట పరిచారు. భారీ షాట్ల జోలికి వెళ్లకుండా ఆత్మరక్షణతో బ్యాటింగ్ చేశారు. దీంతో స్కోరును నత్తాను తలపించింది. ఎల్గర్ సమన్వయంతో బ్యాటింగ్ చేయగా, మార్క్రామ్ అడపాదడపా బౌండరీలతో ఆకట్టుకున్నాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన మార్క్రామ్ 81 బంతుల్లో 9 ఫోర్లతో అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. భోజన విరామ సమయానికి సౌతాఫ్రికా వికెట్ నష్టపోకుండా 78 పరుగులు చేసింది.

ఆమ్లా జోరు..

మరోవైపు డివిలియర్స్‌తో కలిసి హాషిం ఆమ్లా జోరును కొనసాగించాడు. ఇద్దరు కలిసి మూడో వికెట్‌కు 50 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. భారీ షాట్ల జోలికి వెళ్లకుండా సమన్వయంతో బ్యాటింగ్ చేశారు. డివిలియర్స్ కూడా ఆత్మరక్షణతోనే ఆడాడు. అయితే రెండు ఫోర్లతో 20 పరుగులు చేసిన డివిలియర్స్‌ను ఇషాంత్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. మరోవైపు ఆమ్లా తన జోరును కొనసాగించాడు. భారత బౌలర్లపై ఎదురుదాడి చేస్తూ పరుగుల వర్షం కురిపించాడు. అతనికి కెప్టెన్





డుప్లెసిస్ అండగా నిలిచాడు. అయితే 153 బంతుల్లో 14 ఫోర్లతో 82 పరుగులు చేసి సెంచరీ దిశగా అడుగులు వేస్తున్న ఆమ్లాను హార్దిక్ రనౌట్ చేశాడు. దీంతో సౌతాఫ్రికా 246 పరుగుల వద్ద నాలుగో వికెట్‌ను కోల్పోయింది. కాగా, తర్వాత వచ్చిన డికాక్ (0) ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. అశ్విన్ బౌలింగ్‌లో కెప్టెన్ కోహ్లి పట్టిన క్యాచ్‌కు డికాక్ వెనుదిరిగాడు. ఆ వెంటనే ఫిలాండర్ (0) కూడా ఔటయ్యాడు. అతను కూడా పాండ్య అద్భుత ఫీల్డింగ్‌కు రనౌట్ కాక తప్పలేదు. దీంతో 251 పరుగుల వద్ద దక్షిణాఫ్రికా ఆరో వికెట్‌ను కోల్పోయింది. ఒక దశలో 199/2తో పటిష్ఠ స్థితిలో కనిపించిన సౌతాఫ్రికా 70 పరుగుల తేడాతో నాలుగు వికెట్లు కోల్పోవడం విశేషం. ఈ మ్యాచ్‌లో భారత్ మూడు మార్పులతో బరిలోకి దిగింది. ఓపెనర్ ధావన్ స్థానంలో లోకేష్ రాహుల్, వి కెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా స్థానంలో పార్థివ్ పటేల్, ఫాస్ట్ బౌలర్ భువనేశ్వర్ స్థానంలో ఇషాంత్ శర్మలు తుది జట్టులోకి వచ్చారు. అజింక్య రహానెకు ఈ మ్యాచ్‌లోనూ నిరాశ మిగిలింది. తుది జట్టులో అతనికి స్థానం దక్కలేదు. రోహిత్ తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. దక్షిణాఫ్రికా ఒక మార్పుతో బరిలోకి దిగింది. స్టెయిన్ స్థానంలో నిగిడి జట్టులోకి వచ్చాడు.

స్కోరుబోర్డు:

దక్షిణాఫ్రికా మొదటి ఇన్నింగ్స్: డీన్ ఎల్గర్ (సి) విజయ్ (బి) అశ్విన్ 31, ఐడెన్ మార్క్రామ్ (సి) పార్థివ్ (బి) అశ్విన్ 94, హాషిం ఆమ్లా రనౌట్ 82, డివిలియర్స్ (బి) ఇషాంత్ శర్మ 20, డుప్లెసిస్ (బ్యాటింగ్) 24. డికాక్ (సి) కోహ్లి (బి) అశ్విన్ 0, వెమోన్ ఫిలాండర్ రనౌట్ 0, కేశవ్ మహారాజ్ (బ్యాటింగ్) 10, ఎక్స్‌ట్రాలు 8, మొత్తం 90 ఓవర్లలో 269/6.
బౌలింగ్: జస్‌ప్రిత్ బుమ్రా 18–4–57–0, మహ్మద్ షమి 11–2–46–0, ఇషాంత్ శర్మ 16–3–32–1, హార్దిక్ పాండ్య 14–4–37–0, రవిచంద్రన్ అశ్విన్ 31–8–90–3.



మార్క్రామ్ శతకం మిస్..

లంచ్ తర్వాత దక్షిణాఫ్రికా తొలి వికెట్ కోల్పోయింది. 4 ఫోర్లతో 31 పరుగులు చేసిన ఎల్గర్‌ను అశ్విన్ వెనక్కి పంపాడు. దీంతో 85 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత వచ్చిన స్టార్ ఆటగాడు హాషిం ఆమ్లాతో కలిసి మార్క్రామ్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఇద్దరు భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నారు. వీరిని ఔట్ చేసేందుకు కోహ్లి తరచు బౌలర్లను మార్చినా ఫలితం లేకుండా పోయింది. కీలక ఇన్నింగ్స్ ఆడిన మార్క్రామ్ 150 బంతుల్లో 15 బౌండరీలతో 94 పరుగులు చేసి వెనుదిరిగాడు. మార్క్రామ్ ఆరు పరుగుల తేడాతో సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. ఈ వికెట్ కూడా అశ్విన్ ఖాతాలోకే వెళ్లింది.

హెచ్‌సిఏ అక్రమాలపై విచారణ జరపాలి

- **అవక తవకలపై త్వరలో బిసిసిఐకి ఫిర్యాదు చేస్తా: అజారుద్దీన్**



మనతెలంగాణ/ హైదరాబాద్ : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో జరిగిన అవకతవకలపై తాను త్వరలో బిసిసిఐకి ఫిర్యాదు చేయనున్నట్లు ప్రముఖ క్రికెటర్, భారత జట్టు మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్ వెల్లడించారు. ఇటీవల జరిగిన హెచ్‌సిఏ సర్వసభ్య సమావేశానికి ఆహ్వానం అందడం వల్లే తాను హాజరయ్యానని తెలిపారు. హెచ్‌సిఏ పాలక వర్గం హక్కులను ఉల్లంఘిస్తోందని, లోథా కమిటి సిఫార్సులను హెచ్‌సిఏ అమలు చేయడం లేదని అజార్ ఆరోపించారు. అలాగే హెచ్‌సిఏ పాలక వర్గం ఎన్నికల్లోనూ అక్రమాలు జరిగాయని అజారుద్దీన్ పేర్కొన్నారు. హెచ్‌సిఏపై జరుగుతున్న పలు వివాదాల నేపథ్యంలో ఆయన శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. హెచ్‌సిఏలో తన సభ్యత్వంపై కొందరు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్నారు. తాను పక్కా హైదరాబాదీనని, దేశంలో హైదరాబాద్‌కు పేరు తెచ్చేందుకే ఇన్ని రోజులు క్రికెట్ ఆడానని స్పష్టం చేశారు. హెచ్‌సీఏ అధ్యక్షుడు వివేక్ తనపై చేస్తున్న ఆరోపణలు తీవ్ర ఆవేదనకు గురిచేశాయన్నారు. హెచ్‌సిఏలో ఉన్న వాళ్లకు బిసిసిఐ నిబంధనలు, లోథా సిఫార్సులు ఎంటో కనీస పరిజ్ఞానం కూడా లేదన్నారు. తాను హెచ్‌సిఏ ప్రెసిడెంట్‌గా ఎన్నికల్లో నామినేషన్ వేసినప్పుడు కూడా కొందరు లేని పోని కారణాలు చెప్పి తన నామినేషన్ తిరస్కరింపజేశారన్నారు.

వీటిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు తాను సిద్ధం అవుతున్నట్టు ఆయన వెల్లడించారు. నాకు వివేక్ శత్రువు కాదు.. కానీ నా విషయంలో హెచ్‌సిఏ తీరే నన్ను ఎక్కువగా బాధింధించింది'' అని అన్నారు. లోథా నిబంధనలకు వ్యతిరేకంగా ఈ ఎన్నికలు నిర్వహించారని..వివేక్ వర్గం బాడీ ఎన్నికే అక్రమం అన్నారు. ఈ విషయంలో వివేక్ తీరు సరిగ్గా లేదని, ఆయన ఎన్నిక కూడా అప్రజాస్వామ్యంగానే జరిగిందన్నారు. చదువుకున్న వ్యక్తులు కూడా ఈ విధంగా వ్యవహరించడం బాధకరమన్నారు. నాకు ఉత్తర ప్రదేశ్ క్రికెట్ బోర్డులో సభ్యత్వం ఉందని వివేక్ చెప్పడం ఏంటన్నారు. నేను హైదరాబాద్ నుండి ప్రాతినిధ్యం వహించాను. హైదరాబాద్ ప్లేయర్‌గానే ఉన్నాను అని అన్నారు. హెచ్‌సిఏ నిర్వహించిన ప్రత్యేక సర్వసభ్య సమావేశానికి హాజరయ్యేందుకు తనకు హెచ్‌సిఏ సెక్రటరీ నుండి పాస్ వచ్చిందని ఆ పాస్‌ను మీడియాకు చూపించారు. అంతలోపే హెచ్‌సిఏ సెక్రటరీ శేషును సస్పెండ్ చేశాం. తను జారీ చేసిన పాస్‌లు కూడా చెల్లుబాటు కావని తనను ఈ మీటింగ్‌కు అనుమతించలేదని ఆ పాస్‌లను కూడా అజర్ మీడియాకు చూపించారు. హెచ్‌సిఏ ఇన్నేళ్ల చరిత్రలో ఒక్క గ్రామీణ క్రీడాకారుణ్ణి కూడా ఇంటర్‌నేషనల్ క్రికెటర్‌ను చేయలేక పోయిందని అజార్ ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాలకు కూడా క్రికెట్‌ను చేరువ చేయాలన్నది తన కల అన్నారు. క్రికెట్ క్రీడాకారుడిగానే ఈ పని చేయాలనుకుంటున్నానని, ఏదో పదవి కోసమో, హెచ్‌సిఏ ఆరోపణల కోసమో కాదన్నారు. తాను హైదరాబాద్ నుండే క్రికెట్ ఆడానని, ఆ విధంగానే దేశ జట్టుకు సెలెక్ట్ అయ్యానని అన్నారు. ఇక తాను ఉత్తర ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తానన్న వార్తల పట్ల కూడా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మంది వ్యక్తిగత స్వార్థం కోసం టోర్నమెంట్లు నిర్వహించడం కూడా సరికాదన్నారు. అధికారికంగా టోర్నమెంట్లు నిర్వహిస్తే ఎంతో మంది క్రీడాకారుల ప్రతిభ వెలుగులోనికి వస్తుందని అభిప్రాయపడ్డారు. తండ్రి పేరు మీద టోర్నమెంట్లు నిర్వహించడం కూడా తప్పేనని అజార్ వ్యాఖ్యానించారు. తాను తెలంగాణ క్రికెట్ అసోసియేషన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా కొనసాగడం లేదని స్పష్టం చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తన సభ్యత్వంపై అనవసర ఆరోపణలు చేయడం మానుకోవాలని తాను విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. నిరుపేద క్రీడాకారులను ప్రోత్సహించేందుకు హెచ్‌సీఏలో కీలక పాత్ర పోషించాల్సిన అసవరం ఉందని ఆయన స్పష్టం చేశారు. సహాయం కోసం ఎదురు చూస్తున్న నిరుపేద క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని అవసరమైతే అందుకోసం పోరాడుతానని స్పష్టం చేశారు.

కోహ్లిపై మాజీల ఆగ్రహం



ముంబయి: రెండో టెస్టులో జట్టు ఎంపికలో కెప్టెన్ విరాట్ కోహ్లి వ్యవహరించిన తీరుపై మాజీ కెప్టెన్లు సునీల్ గవాస్కర్, సౌరవ్ గంగూలీతో పాటు ఆకాష్ చోప్రా, సంజయ్ మంజ్రేకర్ తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అద్భుత ఫాంలో ఉన్న భువనేశ్వర్ కుమార్‌ను పక్కన బెట్టడాన్ని వారు ప్రశ్నించారు. కోహ్లి ఇలాగే వ్యవహరిస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. జట్టులో కీలక బౌలర్‌గా ఉన్న భువనేశ్వర్‌ను ఎందుకు తప్పించారో తమకు అంతుబట్టకుండా పోయిందన్నారు. కోహ్లి తీరు జట్టు ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీసే విధంగా ఉందన్నారు. తొలి టెస్టులో ప్రారంభంలోనే మూడు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టును హడలెత్తించిన భువనేశ్వర్‌ను తప్పించేందుకు కారణాలు ఏమిటో కోహ్లి వెల్లడించాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. ఏకపక్షంగా వ్యవహరిస్తూ పోతే త్వరలోనే కనుమరుగు కాక తప్పదని వారు హెచ్చరించారు. ఇటీవల కాలంలో భువనేశ్వర్ అసాధారణ రీతిలో చెలరేగి పోతున్నాడని, ఇషాంత్ శర్మతో పోల్చితే అతని ఫాం చాలా బాగుందని మాజీ అన్నారు. ఈ పరిస్థితుల్లో అతన్ని తప్పించి ఇషాంత్‌ను ఎందుకు ఎంపిక చేశాడో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. తొలి మ్యాచ్‌లో విఫలమైన రోహిత్ శర్మకు మరో అవకాశం ఇచ్చిన కోహ్లి అద్భుత ఫాంలో ఉన్న భువనేశ్వర్ పక్కన బెట్టడంపై అభిమానులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోహ్లి తీరుపై నెటిజన్లు కూడా మండి పడుతున్నారు. ఏకపక్షంగా వ్యవహరిస్తు పోతే కోహ్లి తెరమెరుగు కావడం తథ్యమని వారు జోస్యం చెప్పారు. ఇక, రెండో టెస్టులో అజింక్య రహానెను పక్కన బెట్టడంపై కూడా అభిమానులు గుర్రుగా ఉన్నారు. కోహ్లి కావాలనే రహానెపై కక్ష కట్టాడని వారు ఆరోపించారు. ఒంటెత్తు పోకడలకు పోతే కోహ్లి త్వరలోనే టీమిండియాకు దూరం కావడం ఖాయమని వారు హెచ్చరించారు. కోహ్లి వంటి చాలా మంది ఇలా వచ్చి అలా కనుమరుగై పోయిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ఇప్పటికైన పంథాలు, పట్టింపులకు పోకుండా జట్టు ప్రయోజనాలకు పెద్ద పీట ఇవ్వాలని వారు సూచించారు.

పాకిస్థాన్ @ 74 ఆలౌట్



బౌల్ట్ మ్యాజిక్, కివీస్‌కు సిరీస్

డునెడిన్: న్యూజిలాండ్‌తో శనివారం జరిగిన మూడో వన్డేలో పాకిస్థాన్ 74 పరుగులకే కుప్పకూలింది. ఈ మ్యాచ్‌లో 183 పరుగుల భారీ తేడాతో విజయం సాధించిన న్యూజిలాండ్ 3–0 తేడాతో సిరీస్ కైవసం చేసుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన కివీస్ 257 పరుగులకు ఆలౌటైంది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ 27.2 ఓవర్లలో కేవలం 74 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని చవిచూసింది. కివీస్ స్పీడ్ స్టర్ బౌల్ట్ 17 పరుగులకే ఐదు వికెట్లు తీసి ప్రత్యర్థి బ్యాటింగ్ లైనప్‌ను కుప్పకూల్చాడు. ఊరిస్తున్న లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన పాక్‌కు ప్రారంభంలోనే బౌల్ట్ దెబ్బ తీశాడు. అతని ధాటికి ఓపెనర్లు అజహర్ అలీ (0), ఫకర్ జమాన్ (2) పరుగులకే పెవిలియన్ చేరారు. మరోవైపు స్టార్ ఆటగాడు బాబర్ ఆజమ్ (8) కూడా రనౌటయ్యాడు. సీనియర్ బ్యాట్స్‌మన్ మహ్మద్ హాఫీజ్ (0)ను కూడా బౌల్ట్ వెనక్కి పంపాడు. కీలక ఆటగాడు షోయబ్ మాలిక్ (3) కూడా నిరాశ పరిచాడు. ఒక దశలో 32 పరుగులకే 8 వికెట్లు కోల్పోయిన పాక్ చివరి వరుస బ్యాట్స్‌మన్ కాస్త రాణించడంతో 74 పరుగులు సాధించింది. పాక్ కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్ 14 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మిగతా వారిలో ఫహీం అ్రష్ఫ్ (10), మహ్మద్ అమేర్ (14), రుమాన్ రయీస్ (16) మాత్రమే రెండంకెలా స్కోరును అందుకున్నారు. కివీస్ జట్టులో బౌల్ట్ ఐదు, కొలిన్ మున్రో, ఫెర్గ్యూసన్ రెండేసి వికెట్లు పడగొట్టారు. అంతకుముందు కివీస్ 257 పరుగులు చేసింది. కెప్టెన్ విలియమ్సన్ ఏడు ఫోర్లతో 73 పరుగులు చేసి జట్టును ఆదుకున్నాడు. రాస్ టైలర్ (52), లాథమ్ (35), గుప్టిల్ (45) తమవంతు పాత్ర పోషించారు.

ఐపిఎల్ వేలం బరిలో 1122 మంది క్రికెటర్లు

ముంబయి: ఇండియన్ ప్రీమియర్ లీగ్ వేలంలో పాల్గొనేందుకు ప్రపంచ వ్యాప్తంగా 1122 మంది క్రికెటర్లు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. బెంగళూరు వేదికగా ఈ నెల 27, 28 తేదీల్లో ఐపిఎల్ వేలం జరుగనుంది. వేలానికి సంబంధించి ఎంత మంది తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారో భారత క్రికెట్ బోర్డు (బిసిసిఐ) అధికారికంగా ప్రకటించింది. ఈ వేలంలో ప్రపంచ వ్యాప్తంగా పలువురు అగ్రశ్రేణి క్రికెటర్లు పాల్గొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కొత్త సీజన్ కోసం ఆయా ఫ్రాంచైజీలో కొందరినే అట్టి పెట్టుకున్నాయి. గౌతం గంభీర్, యువరాజ్ సింగ్, యూసుఫ్ పఠాన్, అజింక్య రహానె, కెఎల్.రాహుల్, మురళీ విజయ్, రవిచంద్రన్ అశ్విన్, హర్భజన్ సింగ్, చాహల్, కుల్దీప్ యాదవ్ వంటి భారత స్టార్లు వేలంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఇక అంతర్జాతీయ స్టార్లు క్రిస్ గేల్, మాక్స్‌వెల్, విలియమ్సన్, సాకిబ్ అల్ హసన్, డ్వేన్ బ్రావో, మిఛెల్ స్టార్క్, డుప్లెసిస్, బ్రాత్‌వైట్, హాషిం ఆమ్లా, కొలిన్ మన్రో, టామ్ లాథమ్, మోర్నీ మోర్కెల్, జో రూట్, రబడా తదితరులు కూడా తమ పేర్లను నమోదు చేసుకున్నారు. కాగా, విరాట్ కోహ్లి, మహేంద్ర సింగ్ ధోని, సురేశ్ రైనా, సునీల్ నరైన్, రసెల్, భువనేశ్వర్ కుమార్, డేవిడ్ వార్నర్ వంటి స్టార్లను ఆయా ఫ్రాంచైజీలు అంటి పెట్టుకున్నాయి. అయితే యువరాజ్, గంభీర్, మాక్స్‌వెల్, అశ్విన్ వంటి అగ్రశ్రేణి ఆటగాళ్లను ఆయా ఫ్రాంచైజీలు దూరంగా ఉంచాయి. దీంతో వీరంత వేలంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఇదిలావుండగా భారత్ నుంచి మొత్తం 778 మంది క్రికెటర్లు వేలం పాట కోసం పేర్లను నమోదు చేసుకున్నారు. ఆస్ట్రేలియా నుంచి 58, దక్షిణాఫ్రికా నుంచి 57 మంది క్రికెటర్లు బరిలో దిగనున్నారు. శ్రీలంక, విండీస్‌ల నుంచి 39 చొప్పున క్రికెటర్లు పేర్లను రిజిస్టర్ చేసుకున్న వారిలో ఉన్నారు. ఇక న్యూజిలాండ్‌కు చెందిన 26, ఇంగ్లాంగ్‌కు చెందిన 26 మంది క్రికెటర్లు కూడా వేలం బరిలో నిలువనున్నారు. కాగా, ఐపిఎల్ పదకొండో సీజన్ ఈ ఏడాది ఏప్రిల్ 4న ప్రారంభం కానుంది. కాగా, మే 31న జరిగే ఫైనల్‌తో టోర్నమెంట్ ముగుస్తోంది. ఈసారి వేలం పాటలో క్రిస్ గేల్, కొలిన్ మన్రో, ఆమ్లా, మాక్స్‌వెల్, గంభీర్, యువరాజ్ సింగ్ తదితరులు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నారు.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.